శుక్రవారం 27 నవంబరు 2026

https://www.telugudesam.org





నేడు ఏపీ క్యాబినెట్ సమావేశం

కీలక అంశాలకు ఆమోదం తెలిపే అవకాశం

- వివరాలు 9లో..

కూటమికే పల్లె పట్టాభిషేకం



- పంచాయతీ ఎన్నికల్లోనూ ప్రభంజనం
- కూటమి బలపరిచిన అభ్యర్థులకే ఓటు
- అత్యధిక సర్పంచులు, వార్డు సభ్యులు కైవసం
- మంచి ప్రభుత్వంపై మరోసారి విశ్వాసం
- ప్రశాంతంగా ముగిసిన తొలివిడత పోరు
- 23 పట్టణ స్థానిక సంస్థలకూ ముగిసిన పోలింగ్
- 30న ఓట్ల లెక్కింపు.. అదేరోజు ఫలితాల ప్రకటన

5

మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో కూటమిని గెలిపించిన ప్రజ లు... గురువారం జరిగిన పంచాయతీ తొలి విడత ఎన్నికల్లోనూ జైకొట్టారు. రెండున్నరేళ్ల కూటమి ప్రభుత్వ సుపరిపాలనపై మరో సారి అండగా నిలిచి పట్టం కట్టారు. కూటమి బలపరిచిన అభ్యర్థ లు ప్రభంజనం సృష్టించారు. మొత్తం 3,949 పంచాయతీల్లో 2490 చోట్ల సర్పంచ్ పదవులకు కూటమి బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారు. తొలివిడత 739 చోట్ల ఏకగ్రీవాలు కాగా 26 జిల్లాల్లోని 201 మండలాల్లో 3240 పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు, 25,101 వార్డు సభ్యుల స్థానాలకు గురువారం పోలింగ్ నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచే ఓటు వేసేందుకు ప్రజలు బారులు తీరారు. సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు, మంత్రి లోకేష్, బ్రాహ్మణి మంగళగిరి- తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. మధ్యాహ్నం ఒంటి గంటలకు పోలింగ్ ముగియగా 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు నిర్వహించారు. ఇక మలిదశ 23 పట్టణ స్థానిక సంస్థల్లోనూ పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఆ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఈ నెల 30 కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు.





తొలిదశ మొత్తం పంచాయతీలు: 3,949

ఫలితాలు వెల్లడించినవి:	3,833
కూటమి అభ్యర్థుల గెలుపు:	2,490
టీడీపీ:	2283
జనసేన:	183
బీజేపీ:	24

ఎమ్మెల్యే అఖిలప్రియ వాహనంపై వైసీపీ రౌడీమూకల దాడి హేయం

- జగన్‌రెడ్డి రాజకీయ విధ్వంస క్రీడలు రోజుకో కొత్త పుంతలు తొక్కుతున్నాయి
- పార్వతీపురం మన్యం జిల్లాలో అభ్యర్థినినే తుదముట్టించాలని చూడటం కిరాతక చర్య
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య
- పంచాయతీ ఎన్నికల్లో గొడ్డలిపార్టీ అరాచకాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన బృందం

14

పంచాయతీ ఎన్నికల సందర్భంగా కర్నూలు జిల్లా అహోబిలంలో ఎమ్మెల్యే భూమ అఖిలప్రియపై వైసీపీ గూండాల దాడి, పార్వతీపురం మన్యం జిల్లాలో అభ్యర్థిపై జరిగిన హత్యాయత్నాన్ని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో వైసీపీ నాయకుల చేసిన విధ్వంసం, అల్లర్లపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు గురువారం ఫిర్యాదు చేశారు.



తిరుమల శ్రీవారికి స్వర్ణ వైభవం

- 121 కిలోల బంగారు ఆభరణాల వితరణ
- చెన్నైకు చెందిన జైన్ దంపతుల దాతృత్వం
- అపూర్వ ఘట్టం ఆవిష్కృతం: సీఎం చంద్రబాబు

2

తిరుమల శ్రీవారికి చెన్నైకు చెందిన వర్ధమాన్ జైన్ దంపతులు రూ.206 కోట్ల విలువైన 121 కిలోల బంగారు, వజ్రాభరణాలను సమర్పించారు. వాటిలో మొత్తం 46 రకాల వేర్వేరు బంగారు ఆభరణాలను ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరుమల పవిత్ర క్షేత్రంలో ఒక అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైందని, ఇందులో తాను భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నానని సీఎం చంద్రబాబు తెలిపారు.



121 కిలోల బంగారు ఆభరణాలు

శ్రీవారికి అపూర్వ ఘట్టం

- **కార్యక్రమంలో తాను భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నాం**
- **సేవలోనే నిజమైన ఆనందం.. ఆ అదృష్టం కొందరికే దక్కుతుంది**
- **పేదల సంక్షేమం, ఆధ్యాత్మిక సేవకు ధనవంతులు ముందుకురావాలి**
- **శ్రీకృష్ణదేవరాయలు నుంచి జైన్ దంపతుల వరకు భక్తి పరంపర కొనసాగుతోంది**
- **చెన్నైకు చెందిన జైన్ దంపతులతో కలిసి మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**
- **శ్రీవారికి రూ.206 కోట్ల విలువైన 121 కిలోల బంగారు, వజ్రాభరణాల సమర్పించిన దాతలపై ప్రశంసలు**



తిరుమల(చైతన్యరథం): డబ్బు, సంపద, హోదా ఎప్పటికీ శాశ్వతం కాదు...ఆధ్యాత్మికత, ధర్మం, సేవా భావమే మనిషికి అసలైన సంతృప్తిని, సంతోషాన్ని ఇస్తాయని ముఖ్యమంత్రి చంద్ర బాబు పేర్కొన్నారు. ప్రపంచంలో ఎంతోమంది బిలియనీర్లు, ట్రిలియనీర్లు ఉన్నారని... కానీ సంపాదించిన సంపదను సద్వినియోగం చేసుకునే అదృష్టం కొందరికే దక్కుతుంది... ఆ కోవలోనే నిలిచి తమ దాతృత్వాన్ని చాటుకున్న చెన్నైకు చెందిన వర్ధమాన్ జైన్, రాధికా జైన్ దంపతులు అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. గురువారం తిరుమల శ్రీవారికి చెన్నైకు చెందిన జైన్ దంపతులు రూ.206 కోట్ల విలువైన 121 కిలోల బంగారు, వజ్రాభరణాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సతీసమేతంగా పాల్గొన్నారు. టీటీడీ అర్చకులు, అధి కారులు ఈ ఆభరణాలను స్వీకరించారు. అనంతరం దాతలైన జైన్ దంపతులతో కలిసి సీఎం చంద్రబాబు తిరుమలలో మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. తిరుమల పవిత్ర క్షేత్రంలో ఒక అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైందని, ఇందులో తాను భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ప్రతి రోజూ శ్రీవారికి 120 కిలోల బంగారు ఆభరణాలు అలంకరిస్తా రని, దేవుని ఆదేశంతోనే 121 కిలోల బంగారు, వజ్రాభరణాలను సమర్పించామని జైన్ దంపతులు చెప్పడం వారి భక్తికి నిదర్శన మన్నారు. పూర్వం పల్లవ, చోళ, చేర, పాండ్య రాజులతో పాటు మైసూర్, మరాఠా రాజులు ఆలయాన్ని అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలు శ్రీవారికి రత్నకిరీటం, పీతాంబరం సహా ఎన్నో ఆభరణాలు సమర్పించారని గుర్తుచేశారు. ఆనాటి శ్రీకృష్ణ దేవరాయల కాలం నుంచి నేటి జైన్ దంపతుల వరకు స్వామివారిపై భక్తి విశ్వాసాలు పెరుగుతూనే ఉన్నాయని చెప్పారు.

మానవ సేవే...మాధవ సేవ

దేవునిపై భక్తి ఉన్న ప్రతిఒక్కరూ మానవ సేవే – మాధవ సేవ అనే సూత్రాన్ని గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. సమాజ హితం కోసం పనిచేసే వారే దేవునికి అత్యంత సన్నిహితంగా ఉంటారన్నారు. జైన్ దంపతుల తరహాలోనే ఇతర సంపన్నులు కూడా ముందుకు వచ్చి పేదల సంక్షేమం, సమాజ సేవ, ఆధ్యాత్మి క కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించాలని కోరా రు. భక్తులు సమర్పించే ప్రతి రూపాయిని టీటీడీ వారి సౌకర్యాలు, సేవలకే ఖర్చు చేస్తోందన్నారు.

రాష్ట్రంలో టీటీడీ సహకారంతో 5 వేల దేవాలయాల నిర్మాణం చేపట్టబోతున్నామని, దేశంలోని అన్ని రాజధానులతో పాటు విదేశాల్లో హిందువులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాలు నిర్మిస్తామని వెల్లడించారు. ఆల యం ఉన్న ప్రతిచోటా అన్నప్రసాదం ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే 'ప్రాణదానం' ద్వారా వైద్యసేవలు, 'విద్యాదానం' కింద ప్రత్యేక నిధితో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తామని తెలి పారు. ఎల్‌నినో వంటి ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 'వృక్షో గోవిందం' పేరుతో పచ్చదనం పెంపు కార్యక్ర మాలు చేపడతామన్నారు. భవిష్యత్తులో తిరుమలకు నీటి ఎద్దడి అనే మాటే లేకుండా హంద్రీ–నీవా ద్వారా కళ్యాణి డ్యాంకు, సోమశిల ద్వారా బాలాజీ రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తామని, అవసరమైతే తిరుమలకు రెండో పైపులైన్ కూడా వేస్తామని స్పష్టం చేశారు. టెక్నాలజీ, నాలెడ్జ్‌తో పాటు భగవంతుని కృప ఉండటం వల్లే రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, శ్రీవారి ఆశీస్సులతో రాష్ట్రం, దేశం మరింత అభివృద్ధి చెందడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.

నమ్ముకున్న వారికి శ్రీవారి అండ...రక్షణ

పూర్వకాలంలో దేవాలయాల మీద చాలా దాడులు జరిగా యి... కానీ వెంకటేశ్వరస్వామి దేవాలయం విషయంలో ఎవ్వరూ ఆ సాహసానికి ఒడిగట్టలేదని తెలిపారు. కొలిచిన వారికి, నమ్మిన వారికి శ్రీవారు రక్షణగా నిలుస్తారు... అది తన విషయంలో నిరూపితమైంది. ప్రాణదానం కార్యక్రమాన్ని ప్రారంభించిన రోజే నాపై అలిపిరిలో దాడి జరిగింది... స్వామి కృప వల్లే ఆ దాడిలో ఎవ్వరూ చనిపోలేదని చెప్పారు. వెంకటేశ్వర స్వామే ప్రాణభిక్ష పెట్టారు... పునర్జన్మనిచ్చారంటూ భావోద్వేగంతో నాటి ఘటనను గుర్తుచేసుకున్నారు. ప్రపంచం మొత్తంగా ఉన్న శ్రీవారి భక్తుల్లో విశ్వాసం పెంపొందించేలా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు.

భక్తుల విరాళాలు, ఆదాయాన్ని వెల్లడించడం, భక్తులు ఇచ్చిన విరాళాలను వారి సౌకర్యాలు.. సేవలకే ఖర్చు పెడుతున్నారని తెలిపారు. తిరుమల కొండపై పచ్చదనం విరాజిల్లుతోందని... దేవుని పవిత్రత కాపాడే విషయంలో రాజీ పడవద్దని టీటీడీకి విజ్ఞప్తి చేశారు. గో–సంరక్షణ, వేద పరిరక్షణకు ప్రాధాన్యమి వ్వాలని... దీనికి టీటీడీ నాందీ పలకాలని సూచించారు. శ్రీవారి దేవాలయాన్ని ఆదర్శంగా... పవిత్రతకు మారుపేరుగా తీర్చిదిద్దా లని సూచించారు. శ్రీవారి సేవకులను మరింత ప్రోత్సహించాలని తెలిపారు. ఎక్కడికక్కడ శ్రీవారి దేవాలయాలు నిర్మించాలి...అక్కడ ప్రశాంత, పవిత్ర వాతావరణం ఉండేలా చూడాలని నిర్దేశించారు. దేశంలోని అన్ని రాజధానుల్లో శ్రీవారి దేవాలయాలను నిర్మిస్తామ ని...విదేశాల్లో కూడా హిందువులు ఎక్కువగా ఉన్న చోట వెంకటే శ్వర స్వామి దేవాలయాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

బంగారు ఆభరణాల వివరాలు

వర్ధమాన్ జైన్ దంపతులు రూ.207.6 కోట్ల విలువైన 121 కిలో బంగారు ఆభరణాలను శ్రీవారికి సమర్పించారు. శ్రీవారి కోసం 46 రకాల వేర్వేరు బంగారు ఆభరణాలను తయారు చే యించి కానుకగా అందించారు. అందజేసిన వాటిలో శ్రీవారి ఆభరణాలుగా 106 కిలోల బంగారం, శ్రీ పద్మావతీ అమ్మవారికి 15 కిలోల బరువైన వస్త్రం ఉన్నాయి.

మొత్తం ఆభరణాలలో బంగారు పాద కవచములు–3, బంగారు అందెలు –3, బంగారు పాకడాలు, బంగారు తులసి పాత్ర హారం, బంగారు అష్టోత్తర కాసుల మాల, బంగారు చతుర్భుజ లక్ష్మీ హారం, బంగారు పులిగోరు, బంగారు అశ్వథ పాత్ర హారం, బంగారు సాదా వడ్డాణం, బంగారు గంటల మొలతాడు, బంగారు సూర్యకటారి, బంగారు కౌస్తుభం, బంగారు శ్రీవత్సం, బంగారు మోచేయి, బంగారు కటి హస్తం, బంగారు నాగాభరణ వడ్డాణం, బంగారు గోపు, బంగారు ఐదు పేటల కంఠీలు 5, బంగారు చంద్రవంకీ కంఠీ, బంగారు వైకుంఠ హస్తం, బంగారు కటి హస్తం, బంగారు నాగాభరణ కడియాలు 4, బంగారు భుజ కీర్తులు 3, బంగారు కర్ణపత్రములు 3, బంగారు భావళీలు–3, బంగారు సాలిగ్రామ హారములు–3, బంగారు కమలం తరహా సాలిగ్రామాలు 3, బంగారు మోపుగల యజ్ఞోప వీతం, బంగారు శంఖ కవచం, బంగారు చక్ర కవచం, బంగారు కిటీపు ముఖపట్టి, బంగారు కిరీటం, 2,427 కేరట్ల బరువున్న నీలాలు, పుష్యరాగం, కెంపులు, పచ్చలతో శ్రీవత్సం పతకం, 238.2 కేరట్ల బరువున్న వజ్రాలను పొదిగిన ఆభరణాలు ఉన్నాయి.













తిరుమల శ్రీవారికి 121 కిల్లోల బంగారు అభరణాలను బహుకరించిన జైన్ దంపతులతో సీఎం చంద్రబాబు





చైతన్యరథం


పల్లె ప్రగతి-8

నేడు పల్లె ప్రగతి-నాడు తిరోగతి

నాడు భూ దోపిడి.. నేడు భూ రక్ష!

ప్రజలు, రైతులు తమ భూమిని కేవలం ఆస్తిగా కాదు... తమ జీవితంగా, తమ తాతల చెమటగా, తమ పిల్లల భవిష్యత్తుగా భావిస్తారు. ఆ భూమికి రక్షణ కల్పించడం ప్రభుత్వాల మొట్టమొదటి బాధ్యత. కానీ జగన్ ఐదేళ్ల పాలనలో రెవెన్యూ వ్యవస్థను తీవ్ర గందరగోళంలో పడేశారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ చట్టం తీసుకొచ్చి భూముల రికార్డుల్లో తప్పులు, 22ఏ నిషేధిత జాబితాలో పట్టా భూములు చేర్చడం, అసైన్డ్ భూముల వ్యవహారాల్లో అక్రమాలు, అశాస్త్రీయ రీ-సర్వేతో లక్షలాది పేదల భూములు లాక్కోవాలని ప్రయత్నం చేశారు. తాతలు, తండ్రులు సంపాదించిన ఆస్తులపై జగన్ ఫొటో వేసుకొని భూ యాజమానిని గందరగోళంలోకి నెట్టారు. కూటమి ప్రభుత్వంలో ల్యాండ్ టైటిల్ రద్దు చేసి రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలు పంపిణీ చేసి భూ యాజమాన్యానికి నిజమైన రక్షణ కల్పించారు. రైతు భూమి... రైతుదే అని నిరూపించారు.



ల్యాండ్ టైట్లింగ్ చట్టానికి చరమగీతం!

గత ప్రభుత్వం ప్రజల ఆస్తులపై కన్నువేసి, భూములను లాక్కోవాలనే దుర్బుద్ధితోనే 'ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్' చట్టాన్ని తీసుకొచ్చింది. పైగా భూ వివాదాల్లో కోర్టుల జోక్యాన్ని పూర్తిగా తొలగించి, రైతుల హక్కులను అధికారుల దయాదాక్షిణ్యాల పైనే ఆధారపడేలా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు ముఖ్యమంత్రిగా తొలి సంతకంతో ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేసి 'ల్యాండ్ గ్రాబింగ్ (ప్రొహిబిషన్) యాక్ట్ 2024'ను అమల్లోకి తెచ్చారు. చట్టం ద్వారా ఆక్రమణదారులకు జైలు శిక్షను 10 నుండి 14 ఏళ్లకు పెంచడంతో పాటు, ఆక్రమించిన భూమి మార్కెట్ విలువనే జరిమానాగా విధించేలా, అక్రమాస్తుల జప్తునకు కఠిన నిబంధనలు అమలు చేశారు.

గ్రామసభలతో పరిష్కారం!

గత పాలనలో రీ-సర్వే పేరుతో భూ యాజమాన్య పేర్లు, ఆధార్ నంబర్లు, ఫొటోలు, భూమి విస్తీర్ణం వంటి 101 రకాల తప్పులతో రైతులను ఇబ్బందులకు గురి చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో రచ్చబండలు, గ్రామసభలు, రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై 8లక్షల ఫిర్యాదులు స్వీకరించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తోంది.



సుదీర్ఘ సమస్యకు..
శాశ్వత పరిష్కారం

రైతుల పాస్ పుస్తకాలపై రాజముద్రతో భద్రత!

రైతుల పట్టాదారు పాస్ పుస్తకాలతోపాటు 77 లక్షల సర్వే రాళ్లపై జగన్ తన పేరు, బొమ్మలు వేయించి రూ.660 కోట్ల ప్రజాధనం వృథా చేశారు. రైతుల సొంత భూముల గుర్తింపు కోసం ఉపయోగించాల్సిన పాస్ పుస్తకాలు, సర్వే రాళ్లను రాజకీయ ప్రచారానికి వాడుకున్నారు. కూటమి ప్రభుత్వం ఆ ఫొటోలను తొలగించి ప్రభుత్వ రాజముద్రతో 33లక్షల కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను ఇప్పటి వరకు రైతులకు అందించింది. వ్యక్తుల ఫొటోలతో కాకుండా ప్రభుత్వ రాజముద్రతో రైతుల ఆస్తులకు గుర్తింపు ఇవ్వడం ద్వారా వ్యవస్థలో మార్పు తీసుకొచ్చింది.

కరెంట్ అనాలిసిస్
తెలుసుకుందాం | విశ్లేషిద్దాం | సిద్ధమవుదాం
మంగినపల్లి ఎలీషా, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

పేదల భూములపై అక్రమాలకు చెక్.. ఇళ్లకు పట్టాలు!

పేదలకు కేటాయించిన అసైన్డ్ భూములను గత ప్రభుత్వం ఫ్రీ-హోల్డ్ చేసిన 13.5 లక్షల ఎకరాల్లో 5.7 లక్షల ఎకరాల భూముల ఫ్రీ-హోల్డ్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయి. ఈ అక్రమాలపై చెక్ పెడుతూ..పేదలకు నిజమైన హక్కులు కల్పించేందుకు కొత్త విధానాన్ని కూటమి ప్రభుత్వం రూపొందిస్తోంది. పదేళ్లు దాటిన అసైన్డ్ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు రిజిస్ట్రేషన్ ద్వారా హక్కులు కల్పించే వెసులుబాటు కల్పించింది. ఇప్పటికే 10 వేల పట్టాలు పంపిణీ చేసింది. మంగళగిరిలోనే 8,800 ఇళ్లకు పట్టాలు అందించింది. మరో 25 వేల ఇళ్లకు పట్టాలు ఇచ్చేందుకు చర్యలు చేపడుతోంది.

రిజిస్ట్రేషన్ సులభతరం

గతంలో రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వంలో స్పాట్ రిజిస్ట్రేషన్ ద్వారా 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసి గంటలోనే ఒరిజినల్ పత్రాలు అందించే విధానం తీసుకొచ్చింది. వాట్సాప్ ద్వారా డాక్యుమెంట్లు, ఎస్ఎంఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ వివరాలు అందిస్తోంది. విదేశాల్లో ఉన్న ప్రవాసాంధ్రుల ఆస్తులకు వీడియో ఈ-కేవైసీ రక్షణ కల్పించింది. ఆటో మ్యూటేషన్, డిజిటల్ లాక్, ఓటీపీ విధానాలతో భూ రికార్డుల భద్రతను పెంచింది. నాలా ఫీజులను పారిశ్రామిక భూములకు 3 శాతానికి, ఇతర భూములకు 2 శాతానికి తగ్గించింది. ఆర్వోఆర్ అప్పీళ్ల పరిష్కార గడువును ఆరు నెలల నుంచి మూడు నెలలకు తగ్గించి, అధికారాలను ఆర్డీవోలకు వికేంద్రీకరించింది.

గత ప్రభుత్వంలో భూ యాజమాన్య హక్కుపై భయపడుతూ జీవించాల్సిన పరిస్థితి నుంచి, తన భూమి మీద నిశ్చింతగా, నమ్మకంగా నిలబడే పరిస్థితికి కూటమి ప్రభుత్వం రైతును తీసుకొచ్చింది. పేదవాడి ఇంటికి పట్టా ఇవ్వడం, రైతు భూమికి రక్షణ కల్పించడమే గ్రామీణ ప్రగతికి అసలైన అర్థం. గత తిరోగతి ఛాయలను పూర్తిగా తుడిచిపెట్టి, కూటమి ప్రభుత్వం పల్లెల్లో ప్రగతి విప్లవాన్ని సృష్టిస్తోంది.











కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేసిన సీఎం చంద్రబాబు

ఉండవల్లి(చైతన్యరథం): మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సీఎం చంద్రబాబు కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేశారు. గురువారం ఉదయం ఉండవల్లిలోని గాదె రామయ్య సీతారామమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కుటుంబసభ్యులతో కలిసి చేరుకున్నారు. 53వ డివిజన్ పోలింగ్ కేంద్రంలో సీఎం చంద్రబాబు, భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్, నారా బ్రాహ్మణితో కలిసి ఓటు వేశారు. అనంతరం మీడియాతో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ 23 మున్సిపాలిటీలకు, పంచా యతీలకు తొలిదశ ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. బాధ్యత కలిగిన పౌరులు తమ ఓటు హక్కు వినియోగించుకోవా లని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపిక చేసుకున్న నాయ కుడి వల్ల ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఓటు వేస్తేనే ప్రశ్నించే హక్కు ఉంటుంది...డబ్బు తీసుకోకుండా ఓటు వేస్తే ప్రజలకు మంచి జరుగుతుందని పేర్కొన్నారు. రాజ్యాం గ దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంతో భారత్‌కు దశ దిశా నిర్దేశం చేశారు. ప్రతి పౌరుడికి ఓటుహక్కు కల్పించి ప్రజా స్వామ్య ఆయు ధాన్ని ఇచ్చారు. ప్రతి ఓటరు తమ హక్కును వినియోగించు కోవాలని కోరారు.









భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సీఎం చంద్రబాబు
వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు



భద్రాద్రి కొత్తగూడెం(చైతన్యరథం): తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏపీ సీఎం చంద్రబాబు పర్యటించారు. పాల్వంచలోని నవ లిమిటెడ్ సంస్థ యాజమాన్యం ఆహ్వానం మేరకు అక్కడి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో ముఖ్యమంత్రి సతీమని భువనేశ్వరితో కలిసి పాల్గొన్నారు. పాల్వంచలో కార్యక్రమానికి వచ్చిన సీఎం చంద్రబా బుకు తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున స్వాగతం పలికిన తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులకు ముఖ్యమంత్రి అభివాదం చేసి ధన్యవాదాలు తెలిపారు.













శ్రీవారిని దర్శించుకున్న సీఎం చంద్రబాబు దంపతులు

తిరుమల వేంకటేశ్వరస్వామిని ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు గురువారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ ఈవో ఎం.రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. రంగనాయకుల మండపంలో చంద్రబా బు దంపతులకు అర్చకులు వేదాశీర్వచనం పలికి ప్రసాదాలు అందజేశారు. అనంతరం వర్ధమాన్ జైన్ దంపతులు శ్రీవారికి ఆభరణాల సమ ర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు.



















కూటమికే పల్లె పట్టాభిషేకం

- ప్రశాంతంగా తొలివిడత పంచాయతీ ఎన్నికలు
- మధ్యాహ్నమే ఓట్ల లెక్కింపు..ఫలితాల వెల్లడి
- కూటమి బలపరిచిన అభ్యర్థుల ప్రభంజనం
- అత్యధిక సర్పంచ్, వార్డు సభ్యుల పదవులు కైవసం
- 23 పట్టణ స్థానిక సంస్థలకు ముగిసిన పోలింగ్
- 30న కౌంటింగ్, ఫలితాల వెల్లడి



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో తొలి విడత పంచాయ తీ, మలి విడత మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతం గా ముగిసింది. ఉదయం 7 గంటల ప్రారంభమైన పోలింగ్ పంచాయతీల్లో మధ్యాహ్నం ఒంటిగంటకు ముగిసింది. ఏకగ్రీ వాలు మినహా 3,240 సర్పంచి, 25,101 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. ఆ వెంటనే 2 గంటలకు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటించారు. కూటమి బలపరిచిన అభ్యర్థులే అత్యధిక చోట్ల విజయం సాధించారు. మొత్తం 34,312 పోలింగ్ కేంద్రాల్లో 99,43,895 మంది ఓటుహక్కు వినియోగించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పంచాయతీల్లో 77.65 శాతం ఓటింగ్ నమోదైంది. కాగా 23 పట్టణ స్థానిక సంస్థల్లోనూ పోలింగ్ ప్రశాంతంగా జరి గింది. సాయంత్రం 5 గంటల వరకు 62.5 శాతం ఓటింగ్ నమోదయిందని రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. బ్యాలెట్ బాక్సులను రాత్రి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఈ నెల 30న కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటించనున్నారు.

బ్యాలెట్ బాక్సు ధ్వంసం చేసిన వైసీపీ శ్రేణులు

పంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పల్నాడు జిల్లా ఈపూరు మండలం కొండ్రముట్ల గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. 10వ వార్డు పోలింగ్ కేంద్రంలోని బ్యాలెట్ బాక్సు పగుల గొట్టేం దుకు యత్నించిన వైసీపీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. బొల్లాపల్లి మండలం వెల్లటూరులో పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలింగ్ కేంద్రంలోకి చొరబడిన వైసీపీ శ్రేణులు బ్యాలెట్ బాక్సు పగులగొట్టి పత్రాలను చించివేశారు. దీంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు అక్కడకి చేరుకుని ఆందోళన చేస్తున్న ఇరువర్గాలను చెదర గొట్టారు.

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వాహనంపై దాడి

పంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా నంద్యాల జిల్లా అహోబిలంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వాహనంపై వైసీపీ మద్దతుదారులు దాడి చేశారు. దీంతో వాహనం అద్దాలు పగిలిపోయాయి. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య రాళ్లదాడి జరిగింది. పరిస్థితిని అదుపులోకి తీసుకొ చ్చేందుకు అదనపు బలగాలను రప్పించారు. జిల్లా ఎస్పీ, పోలీసు అధికారులు అహోబిలం చేరుకున్నారు. మరోవైపు ఆళ్లగడ్డ మండ లం జమ్మదిన్నెలోనూ ఉద్రిక్తత నెలకొంది. వైసీపీ మద్దతుదారులు రిగ్గింగ్ చేస్తున్నారంటూ టీడీపీ వర్గీయులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఘర్షణ జరిగింది. పోలింగ్ కేంద్రం వద్ద కారంపొడి చల్లుకుని ఇరువర్గాలు పరస్పరం దాడికి పాల్పడ్డాయి. దీంతో అక్కడ పోలింగ్ తాత్కాలికంగా నిలిచిపోయింది.

రాజాంలో వైసీపీ మాజీ ఎంపీ అరాచకం

శ్రీకాకుళం జిల్లా రాజాంలో వైసీపీ మాజీ ఎంపీ బెల్లాన అరాచకం సృష్టించాడు. రాజాం 7వ వార్డు పోలింగ్ కేంద్రం వద్ద హల్చల్ చేసాడు. అడ్డుకున్న టీడీపీ అభ్యర్థి రమాదేవి భర్తతో పాటు, టీడీపీ నేతలను బూతులు తిడుతూ దాడికి పాల్పడ్డాడు.





ఎన్నికల్లో హింసకు పాల్పడిన వారిపై చర్యలు

- 44 ఘటనలపై కేసులు నమోదు
- డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా వెల్లడి

అమరావతి(చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో హింసకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 26 జిల్లాల్లోని 201 మండలాల్లో, 3,191 గ్రామ పంచా యతీ సర్పంచ్ స్థానాలకు, 25,061 వార్డు స్థానాలకు పోలింగ్ తదనంతర లెక్కింపు ప్రక్రియ జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్రం లోని 21 జిల్లాల్లోని 4 మున్సిపల్ కార్పొరేషన్లలోని 258 వార్డుల కు, 19 పట్టణ స్థానిక సంస్థల్లో 711 వార్డులకు ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు. గురువారం అమరావతి వేదికగా డీజీపీ మీడియాతో వివరాలు వెల్లడించారు. ఎన్నికల నిర్వహణ కోసం 46,380 మంది పోలీస్ సిబ్బందితో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతా ల్లో ప్రత్యేక నిఘా, సాంకేతిక పరిజ్ఞానం, అదనపు బలగాల మోహరింపుతో ఎన్నికల భద్రతను పటిష్ఠంగా పర్యవేక్షించామని వెల్లడించారు. ఎన్నికలకు సంబంధించి పల్నాడు, సత్యసాయి, నంద్యాల, కడప, అనంతపురం, అన్నమయ్య, తిరుపతి తదితర జిల్లాల్లో మొత్తంగా 44 ఘటనలు చోటుచేసుకున్నాయని ప్రస్తా వించారు. వీటికి సంబంధించి చట్టపరంగా కేసులు నమోదు చేశామని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిందితులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించామని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ అనం తరం బ్యాలెట్ బాక్సులను పోలింగ్ కేంద్రాల నుంచి స్ట్రాంగ్ రూమ్‌లకు పటిష్ఠ పోలీసు బందోబస్తు మధ్య సురక్షితంగా తర లించామని చెప్పారు. ఎన్నికల అనంతరం ఎలాంటి అవాంఛనీ య సంఘటనలకు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ అప్రమ త్తంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు.



ప్రశాంతంగా మున్సిపల్ మలిదశ పోలింగ్

సాయంత్రం 5 గంటల వరకు 62.5 శాతం పోలింగ్ - కందుకూరులో అత్యధికం, శ్రీకాకుళంలో అత్యల్పం





అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలోని 23 పట్టణ స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికల పోలింగ్‌లో గురువారం సాయంత్రం 5 గంటల వరకు 62.5 శాతం ఓటింగ్ నమోదయిందని రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ 23 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో మొత్తం 24,98,312 మంది ఓటర్లకుగాను 15,61, 531 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని వివరించింది.

23 పట్టణ స్థానిక సంస్థల వారీగా పోలింగ్ శాతం

- ప్రకాశం జిల్లా కందుకూరు: 76.07 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 47,473, పోలైన ఓట్లు: 36,113)
- మార్కాపురం జిల్లా పొదిలి: 75.68 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 29,697, పోలైన ఓట్లు: 22,476)
- శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస: 75.13 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 33,067, పోలైన ఓట్లు: 24,843)
- గుంటూరు జిల్లా మంగళగిరి-తాడేపల్లి: 72.62 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 2,37,712, పోలైన ఓట్లు: 1,72,632)
- పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు: 68.83 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 77,478, పోలైన ఓట్లు: 53,328)
- బాపట్ల జిల్లా బాపట్ల: 68.64 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 74,809, పోలైన ఓట్లు: 51,350)
- అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట: 68.15 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 23,368, పోలైన ఓట్లు: 15,926)
- పల్నాడు జిల్లా నరసరావుపేట: 67.55 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 1,07,622, పోలైన ఓట్లు: 72,699)
- శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి: 66.87 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 85,433, పోలైన ఓట్లు: 57,126)
- గుంటూరు జిల్లా పొన్నూరు: 66.75 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 60,200, పోలైన ఓట్లు: 40,182)
- తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి: 66.55 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 72,684, పోలైన ఓట్లు: 48,374)
- ఏలూరు జిల్లా చింతలపూడి: 66.02 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 22,738, పోలైన ఓట్లు: 15,012)
- కృష్ణా జిల్లా గుడివాడ: 64.83 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 1,19,594, పోలైన ఓట్లు: 77,534)
- పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం: 64.73 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 1,00,728, పోలైన ఓట్లు: 65,202)
- పశ్చిమగోదావరి జిల్లా తణుకు: 63.88 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 75,465, పోలైన ఓట్లు: 48,208)
- పశ్చిమగోదావరి జిల్లా భీమవరం: 62.62 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 1,45,738, పోలైన ఓట్లు: 91,260)
- విజయనగరం జిల్లా రాజాం: 62.32 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 36,787, పోలైన ఓట్లు: 22,924)
- శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అల్లూరు: 60.68 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 21,833, పోలైన ఓట్లు: 13,249)
- కాకినాడ జిల్లా కాకినాడ: 57.64 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 2,85,950, పోలైన ఓట్లు: 1,64,834)
- తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం: 56.61 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 4,63,323, పోలైన ఓట్లు: 2,62,265)
- కృష్ణా జిల్లా తాడిగడప: 55.81 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 1,38,576, పోలైన ఓట్లు: 77,334)
- శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరు: 54.28 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 80,492, పోలైన ఓట్లు: 43,691)
- శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం: 53.93 శాతం పోలింగ్ (మొత్తం ఓటర్లు: 1,57,545, పోలైన ఓట్లు: 84,969)



రెండో దశ పంచాయతీ పోరుకు ఏర్పాట్లు

- **1,171 సర్పంచి, 19,651 వార్డులు ఏకగ్రీవం**
- **మిగిలిన స్థానాలకు 29న పోలింగ్ ప్రక్రియ**



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో రెండో విడత పంచాయ తీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగియడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం బరిలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను విడుదల చేసింది. ఈ రెండో విడతలో మొత్తం 1,171 సర్పంచ్ స్థానాలు, 19,651 వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవంగా భర్తీ అయ్యాయని ఎన్నికల సంఘం ప్రకటించింది. మిగిలిన స్థానాలకు ఈ నెల 29న పోలింగ్ జరగనుంది. రాష్ట్రంలోని 52 రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఉన్న 246 మండలాల్లో, 4,975 సర్పంచ్ స్థానాలు, 49,318 వార్డు స్థానాలకు గాను ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఏకగ్రీవాలు మినహా మిగిలిన 3,803 సర్పంచ్ స్థానాలకు గాను మొత్తం 10,292 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. అలాగే 29,608 వార్డు స్థానాలకు 63,410 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇదిలా ఉండగా విశాఖపట్నం జిల్లాలో పంచాయతీ ఎన్నికల రెండో విడత జరగదని ఆ జిల్లాకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియ మొత్తం మూడవ విడతలో నిర్వహించనున్నారని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.



నేడు ఏపీ క్యాబినెట్ సమావేశం

కీలక అంశాలకు ఆమోదం తెలిపే అవకాశం

అమరావతి(చైతన్యరథం): రాష్ట్ర మంత్రి మండలి శుక్రవారం ఉదయం 10:30 గంటలకు సమావేశం కానుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏపీ సచివాలయంలో క్యాబినెట్ భేటీ జరగనుంది. ఈ సందర్భంగా రూ.88,392 కోట్ల పెట్టుబడులతో పాటు ఉద్యోగాల కల్పన, హైపర్‌స్కేల్ డేటా సెంటర్, అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ వంటి కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. ముఖ్యంగా ఏపీకి పెట్టుబడుల ద్వారా వచ్చిన రూ.88,392 కోట్ల విలువైన ప్రాజెక్టులకు మంత్రి మండలి ఆమోదం తెలపనుంది. 18 ప్రాజెక్టుల ద్వారా 54,210 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిర్ణయం తీసుకో నుంది. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలో రూ.19 వేల కోట్లతో కియా పరిశ్రమ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. దీని ద్వారా మరో 12 వేల మందికి ఉద్యోగాలు కల్పించనుంది. అనకాపల్లి జిల్లా తూటిపాలలో రూ.47,009 కోట్లతో భారీ హైపర్‌స్కేల్ డేటా సెం టర్ నిర్మాణానికి పచ్చజెండా ఊపనుంది. రాజధాని అమరావతి లో రూ.1,921 కోట్లకు పైగా విలువైన కీలక అభివృద్ధి పనులకు ఆమోదం తెలపనుంది.

అమరావతి పరిధిలోని 26 గ్రామాల్లో రూ.1,215.70 కోట్లతో రహదారులు, డ్రెయిన్ల నిర్మాణానికి పచ్చజెండా ఊపనుంది. అమరావతిలో రూ.80 కోట్లతో గ్రీనరీ అభివృద్ధి పనులకు మంత్రిమండలి ఆమోదం తెలపనుంది. రూ.626.14 కోట్లతో అమరావతి సంగమం ప్రాజెక్టుతో పాటు, అమరావతిలో పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ భవన నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది.

రాజధాని ప్రాంతంలో ఐదు కీలక రహదారుల అభివృద్ధికి సంబంధించిన ఏఐఐబీ నిధుల వినియోగానికి ఆమోదం తెలపనుం ది. ఎల్‌పీఎస్ జోన్-10లో మౌలికవసతుల అభివృద్ధికి ఏఐఐబీ ఆర్థిక సహకారానికి అనుమతి ఇవ్వనుంది. అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్, జంట టవర్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని సీఆర్‌డీఏకు మళ్లించేందుకు అనుమతి ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ఏపీ క్యాపిటల్ రీజియన్ పరిధిలో బిల్డింగ్ ట్రైబ్యునల్ ఏర్పా టుకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపే అవకాశం ఉంది.

మంగళగిరిలో వైసీపీ దొంగ ఓట్లు

అడ్డుకున్న పోలీసులకు అప్పగించిన టీడీపీ ఏజెంట్లు

మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఉద్రిక్తత నెలకొంది. 62వ డివిజన్ పోలింగ్ కేంద్రం లో వైసీపీ శ్రేణులు కొందరితో దొంగ ఓట్లు వేయించేందుకు యత్నించాయి. ఈ క్రమంలో వారిని టీడీపీ పోలింగ్ ఏజెంట్లు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అప్పటికే కొన్ని దొంగ ఓట్లు వేసినట్లు అధికారులు గుర్తించారు. ఇరుపార్టీల నేతల వాగ్వాదంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మరో వైపు పోలింగ్ బూత్‌లోకి వెళ్లేందుకు యత్నించిన వైసీపీ నాయకులను పోలీసులు అడ్డుకు న్నారు. 1వ డివిజన్‌లో తాను చీఫ్ ఏజెంట్‌ను లోపలికి వెళ్లేందుకు యత్నించిన వైసీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ టి.వేమారెడ్డిని పోలీసులు నిలువరించారు. ఒకానొక దశలో పోలీసులను నెట్టుకుని వెళుతుండగా అడ్డగించారు. పోలీసులకు వేలు చూపించి మాట్లాడటంతో బయటకు నెట్టేశారు. ప్రశాంతంగా ఎన్నికలు జరుగుతున్న ప్రాంతంలో మాజీ నేతలకు ఏం పని అని ప్రశ్నించారు.

పంటల బీమా బూటకం కాదు..

గణాంకాలే వాస్తవాలకు నిదర్శనం

- ఖరీఫ్-2026లో రెట్టింపునకు పైగా పెరిగిన పంటల బీమా నమోదులు
- 17.07 లక్షల హెక్టార్లకు బీమా రక్షణ.. దేశంలో ఆరో స్థానంలో ఆంధ్రప్రదేశ్
- పెండింగ్ బీమా ప్రీమియం చెల్లింపులకు రూ.3 వేల కోట్లతో కార్యాచరణ
- ప్రకృతి విపత్తుల బాధిత రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- రైతుల సంక్షేమంపై వైసీపీ అపోహలు సృష్టించడం సరికాదు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో పంటల బీమా అమలు, ఇన్‌పుట్ సబ్సిడీపై వాస్తవాలను విస్మరించి రైతులను తప్పుదోవ పట్టించేలా వైసీపీ తప్పుడు ప్రచారం చేయటం సరికాదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రైతులకు ఆర్థిక భద్రత కల్పించడం, ప్రకృతి విపత్తుల సమయంలో ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఖరీఫ్-2025తో పోలిస్తే ఖరీఫ్-2026లో పంటల బీమా నమోదులు రెట్టింపునకు పైగా పెరగడమే ప్రభుత్వ చర్యలకు నిదర్శనమన్నారు. ఖరీఫ్-2026లో రాష్ట్రవ్యాప్తంగా సాగైన 31.01 లక్షల హెక్టార్లలో 17.07 లక్షల హెక్టార్లు, అంటే సుమారు 42 లక్షల ఎకరాలు బీమా పరిధిలోకి వచ్చాయని మంత్రి తెలిపారు. మొత్తం సాగు విస్తీర్ణంలో 55.05 శాతం బీమా కవరేజీ సాధించామని, బీమా చేసిన విస్తీర్ణం పరంగా ఆంధ్రప్రదేశ్ దేశంలో ఆరో స్థానంలో నిలిచిందని వివరించారు. ఖరీఫ్-2025లో 18.88 లక్షలుగా ఉన్న బీమా దరఖాస్తులు ఖరీఫ్-2026లో 44.09 లక్షలకు పెరిగి 2.3 రెట్ల వృద్ధి నమోదైందన్నారు. రుణం పొందని రైతుల దరఖాస్తులు 2.00 లక్షల నుంచి 25.27 లక్షలకు పెరిగి 12.6 రెట్ల వృద్ధి సాధించాయని తెలిపారు. బీమా విస్తీర్ణం 7.67 లక్షల హెక్టార్ల నుంచి 17.07 లక్షల హెక్టార్లకు పెరిగి 2.2 రెట్ల వృద్ధి సాధించగా, బీమాలో చేరిన రైతుల సంఖ్య 7.43 లక్షల నుంచి 17.10 లక్షలకు పెరిగి 2.3 రెట్ల వృద్ధి నమోదైందన్నారు. స్వచ్ఛంద నమోదు విధానానికి రైతుల నుంచి లభిస్తున్న స్పందనకు ఈ గణాంకాలే నిదర్శనమని పేర్కొన్నారు. నమోదు గడువు పొడిగింపు, 2026 జూలై 29 నుంచి 31 వరకు నిర్వహించిన ప్రత్యేక ఇంటింటి ప్రచార కార్యక్రమాలు, రైతు సేవా కేంద్రాల వారీ పర్యవేక్షణ ఇందుకు దోహదపడ్డాయని వివరించారు.

గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్లే..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పంటల బీమా ప్రీమియం బకాయిలు పేరుకుపోవడం వల్లే రైతులకు బీమా పరిహారం అందడంలో ఇబ్బందులు తలెత్తాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వంతో ప్రత్యేకంగా చర్చించి, పెండింగ్ ప్రీమియం బకాయిలను విడతలవారీగా చెల్లించే కార్యాచరణకు ఆమోదం సాధించామని తెలిపారు. దీంతో రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని సమర్థంగా అమలు చేసేందుకు మార్గం సుగమమైందన్నారు. ఇందులో భాగంగా 2026-27లో రూ.500 కోట్లు, 2027-28లో రూ.1,000 కోట్లు, 2028-29లో రూ.1,500 కోట్లు చొప్పున మొత్తం రూ.3,000 కోట్లు చెల్లించే ప్రతిపాదనకు భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్ర వాటా అందిన వెంటనే పెండింగ్ క్లెయిమ్‌లను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం బీమా కంపెనీలను ఆదేశించిందని వెల్లడించారు. వైసీపీ పాలనలో చేసిన తప్పుల భారం రైతులపై పడకుండా సరిదిద్దుతున్నాం. గొడ్డలిపార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ముందుగా తన ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిల సంగతిని గుర్తుంచుకోవాలి. మీరు సృష్టించిన సమస్యలను మేము పరిష్కరిస్తూ రైతులకు మేలు చేస్తున్నాం. గత ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకుని కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

మంత్రివర్గ ఉపసంఘం సిఫారసుల మేరకే మార్పులు

పంటల బీమా విధానంలో మార్పులు మంత్రివర్గ ఉపసంఘం సిఫారసుల మేరకే చేపట్టామని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఖరీఫ్-2024లో ఈ-పంట ఆధారంగా ఉచిత పంటల బీమా అమలు చేయగా, రబీ 2024-25 నుంచి రైతులను భాగస్వాములను చేస్తూ స్వచ్ఛంద నమోదు విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఖరీఫ్-2020 నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను దేశవ్యాప్తంగా స్వచ్ఛంద పథకంగా అమలు చేస్తోందని గుర్తుచేశారు. ఈ పథకంలో రైతుల ప్రీమియం వాటా ఖరీఫ్ ఆహార, నూనెగింజల పంటలకు గరిష్ఠంగా 2 శాతం, రబీ పంటలకు 1.5 శాతం, వార్షిక వాణిజ్య, ఉద్యాన పంటలకు 5 శాతం మాత్రమేనని తెలిపారు. మిగిలిన ప్రీమియం సబ్సిడీని వర్తించే నిబంధనల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో భరిస్తున్నాయని వివరించారు. పెండింగ్ బీమా క్లెయిమ్‌ల పరిష్కారానికి ప్రభుత్వం పక్కా కార్యాచరణ రూపొందించిందని మంత్రి తెలిపారు. పీఎంఎఫ్‌బీవై మార్గదర్శకాల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రీమియం సబ్సిడీ వాటాలు అందిన అనంతరం బీమా కంపెనీలు క్లెయిమ్‌లను పరిష్కరిస్తాయని వివరించారు. రబీ 2022-23 నుంచి ఖరీఫ్-2025 వరకు పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర వాటా ప్రీమియం సబ్సిడీని మూడు ఆర్థిక సంవత్సరాల్లో చెల్లించేందుకు ప్రతిపాదనలు సమర్పించామని తెలిపారు. ఈ మేరకు రబీ 2022-23 పెండింగ్ ప్రీమియం కోసం రూ.500 కోట్లు విడుదల చేయగా, అందులో రూ.250 కోట్లు ఇప్పటికే బీమా కంపెనీలకు చెల్లించామని, మిగిలిన బిల్లులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర వాటా చెల్లింపులకు అనుగుణంగా సంబంధిత సీజన్ల రైతులకు పరిహారం దశలవారీగా అందుతుందని వివరించారు.

ప్రత్యేక ఎస్క్రో ఖాతా విధానం

ఖరీఫ్-2026 నుంచి కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రత్యేక ఎస్క్రో ఖాతా విధానాన్ని అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అంచనా ప్రీమియం వాటాలో కొంత భాగాన్ని ముందుగానే జమ చేసేందుకు ఈ ఖాతాలో మరో రూ.250 కోట్లు జమ చేశామని తెలిపారు. ఇందులో నుంచి ఖరీఫ్-2026కు రూ.83 కోట్లు, రబీ 2026-27కు రూ.44 కోట్లు అడ్వాన్స్ ప్రీమియంగా బీమా కంపెనీలకు చెల్లించామన్నారు. పంటల బీమా క్లెయిమ్‌ల లెక్కింపునకు అవసరమైన పంట కోత ప్రయోగాలు, యెస్-టెక్ ఆధారిత దిగుబడి అంచనాలు, వాటి తనిఖీ, ధ్రువీకరణ ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసి ఖరీఫ్-2026కు సంబంధించిన అర్హమైన పరిహారాన్ని రైతులకు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. ప్రకృతి విపత్తుల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. 2024 జూలై, ఆగస్టు--సెప్టెంబర్ నెలల్లో సంభవించిన వరదలు, భారీ వర్షాలు, 2025 మార్చిలో కురిసిన అకాల వర్షాల కారణంగా నష్టపోయిన 2.07 లక్షల మంది రైతులకు రూ.310.30 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందించామని వెల్లడించారు. రెవెన్యూ శాఖ జీవో ఎంఎస్ నంబర్ 1, తేదీ 07.01.2025 ద్వారా ఎస్‌డీఆర్ఎఫ్/ఎన్‌డీఆర్ఎఫ్ ప్రమాణాల కంటే అధికంగా రాష్ట్ర సహాయ రేట్లను నిర్ణయించామని తెలిపారు. వరి, పత్తి, వేరుశనగ, చెరకు పంటలకు హెక్టారుకు సబ్సిడీని రూ.17,000 నుంచి రూ.25,000కు పెంచామని, ఎంపిక చేసిన ఇతర పంటలకు హెక్టారుకు రూ.15,000 చొప్పున పెంచిన రాష్ట్ర రేటు వర్తిస్తుందని వివరించారు. పంటల బీమా పరిహారం బీమా చేసిన విస్తీర్ణానికి వర్తిస్తుందని, అయితే ఇన్‌పుట్ సబ్సిడీ పొందేందుకు బీమా తప్పనిసరి కాదని స్పష్టం చేశారు. బీమా ఉన్నా లేకపోయినా 33 శాతం లేదా అంతకంటే ఎక్కువ పంట నష్టం నమోదైన రైతులకు నిబంధనల ప్రకారం గరిష్ఠంగా 2 హెక్టార్ల అర్హమైన నష్ట విస్తీర్ణం వరకు ఇన్‌పుట్ సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు.

క్షేత్రస్థాయి నష్టం నమోదు పూర్తి

ఖరీఫ్--2026లో కరువు, అర్ణబ్, మురసు తుపాన్లు, సెప్టెంబర్ వరదలు, భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న వ్యవసాయ పంటలకు సంబంధించి క్షేత్రస్థాయి నష్టం నమోదు పూర్తయిందని మంత్రి వెల్లడించారు. నాలుగు విపత్తులకు కలిపి 14,59,225 మంది రైతులకు చెందిన 12,06,269.84 హెక్టార్లలో పంట నష్టం నమోదైందని, పెంచిన రాష్ట్ర సహాయ రేట్ల ప్రకారం రూ.2,532.89 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అవసరమని అంచనా వేసినట్లు తెలిపారు. ఖరీఫ్-2026 కరువు కారణంగా 20 జిల్లాల్లో 9,87,231 మంది రైతులకు చెందిన 9,30,899.69 హెక్టార్లలో పంట నష్టం నమోదైందని, ఇందుకు రూ.1,863.23 కోట్లు అవసరమని వివరించారు.

అక్టోబర్‌లో సంభవించిన అర్ణబ్ తుపాను కారణంగా 13 జిల్లాల్లో 3,82,866 మంది రైతులకు చెందిన 2,24,167.09 హెక్టార్లలో నష్టం నమోదైందని, రూ.559.77 కోట్లు అవసరమని తెలిపారు. నవంబర్‌లో సంభవించిన మురసు తుపాను కారణంగా 9 జిల్లాల్లో 52,402 మంది రైతులకు చెందిన 32,621.68 హెక్టార్లలో పంట నష్టం నమోదైందని, ఇందుకు రూ.78.65 కోట్లు అవసరమని పేర్కొన్నారు. సెప్టెంబర్‌లో సంభవించిన వరదలు, భారీ వర్షాల కారణంగా 13 జిల్లాల్లో 36,726 మంది రైతులకు చెందిన 18,581.38 హెక్టార్లలో నష్టం నమోదైందని, రూ.31.24 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అవసరమని వెల్లడించారు.

రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత

ఖరీఫ్-2026 కరువుకు సంబంధించి క్షేత్రస్థాయి ఎన్యూమరేషన్ ఆధారంగా సమర్పించిన రూ.2,743.78 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ప్రతిపాదనలు, మోంథా తుపాను సహా ఇతర విపత్తులకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని మంత్రి తెలిపారు. అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం సహాయం అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయన్నారు.

రబీ 2026-27 సీజన్‌లో రైతులు తమ పంటలకు బీమా రక్షణ కల్పించుకోవాలని సూచించారు. వరి, మామిడి పంటలకు 2026 డిసెంబర్ 31లోగా, మిగిలిన నోటిఫై చేసిన పంటలకు డిసెంబర్ 15లోగా సమీప బ్యాంకు, కామన్ సర్వీస్ సెంటర్, మీ-సేవ కేంద్రాల ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు. సందేహాల నివృత్తికి కిసాన్ కాల్ సెంటర్ 1800-180-1551 లేదా హెల్ప్‌లైన్ 155251ను సంప్రదించవచ్చని తెలిపారు.

రైతాంగ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పంటల బీమా రక్షణను విస్తరించడంతోపాటు ప్రకృతి విపత్తుల్లో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పంటల బీమా నమోదుల్లో సాధించిన పురోగతిని, ప్రీమియం చెల్లింపులకు రూపొందించిన కార్యాచరణను, ఇన్‌పుట్ సబ్సిడీ సహాయాన్ని విస్మరించి అపోహలు సృష్టించడం వైసీపీకి తగదన్నారు.

రైతుల సంక్షేమాన్ని రాజకీయ కోణంలో చూడటం సరికాదు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించడం, పంట నష్టపరిహారం అందించడం మా బాధ్యత. అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తాం. రైతుల ప్రయోజనాల పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

కూటమి మద్దతుదారులను గెలిపించి..

అభివృద్ధికి పట్టం కట్టండి

- కాజులూరు మండలంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ ఎన్నికల ప్రచారం
- రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి మంత్రి నివాళులు



కాజులూరు (చైతన్యరథం): గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డా బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాజులూరు మండలం పల్లిపాలెం గ్రామంలో గ్రామ సర్పంచ్ టేకుమూడి పద్మ (మంచం గుర్తు), వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలను నేరుగా కలుసుకుని కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. గ్రామాభివృద్ధికి కట్టుబడి పనిచేసే నాయకులను ఎన్నుకోవాలని, అభివృద్ధి,సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చే కూటమి అభ్యర్థులకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ఈ హక్కును ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా గ్రామ అభివృద్ధిని కాంక్షించే అభ్యర్థులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే నాయకులకు పట్టం కట్టాలని, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల వేగవంతానికి కూటమి అభ్యర్థుల విజయమే దోహదపడుతుందని పేర్కొన్నారు.

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఘన నివాళులు

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పల్లిపాలెం గ్రామంలో భారతరత్న డాక్టర్ బీర్. అంబేద్కర్ విగ్రహానికి మంత్రి వాసంశెట్టి సుభాష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ అందించిన రాజ్యాంగ స్ఫూర్తిని స్మరించుకున్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు వినియోగం ద్వారా ప్రజలు తమ గ్రామ భవిష్యత్తును నిర్ణయించుకునే అవకాశం ఉందని, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధికి బాటలు వేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న కూటమి బలపరిచిన అభ్యర్థులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో

ఓటు విలువైన హక్కు

- మంత్రి కందుల దుర్గేష్ స్పష్టీకరణ
- రాజమహేంద్రవరం 44వ వార్డులో ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కని, పౌరులందరూ బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ (మున్సిపల్ కార్పొరేషన్) ఎన్నికల సందర్భంగా.. గురువారం ఆయన నగరంలోని 44వ వార్డులో శ్రీ శ్యామలాంబ మోడల్ స్పెషల్ మున్సిపల్ కార్పొరేషన్ అప్పర్ ప్రైమరీ స్కూల్లో ఓటు వేసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. 44వ వార్డు నుంచి కూటమి అభ్యర్థిగా కంటిపూడి రాజేంద్ర ప్రసాద్ పోటీలో ఉన్నారని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటింగ్ ప్రక్రియలో ఉత్సాహంగా పాల్గొనడం చూస్తుంటే ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమపాళ్లలో శరవేగంగా ముందుకు సాగుతున్నాయని మంత్రి తెలిపారు. రాజమహేంద్రవరం నగర భవిష్యత్తు ప్రణాళికలను ప్రస్తావిస్తూ.. 50 వార్డుల నుంచి 72 వార్డులకు విస్తరించిన ఈ నగరాన్ని ఒక మహానగరంగా నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. రాబోయే గోదావరి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరాన్ని మహాద్భుతంగా తీర్చిదిద్దుకుందామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

రాజ్యాంగ బద్ధంగా సీఎం చంద్రబాబు పాలన

- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

అమరావతి (చైతన్యరథం): దేశంలోని ప్రజలందరికీ సమాన హక్కులు, గౌరవం కల్పించిన మహాగ్రంథం మన భారత రాజ్యాంగం అని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా భారతీయులందరినీ ఒకే తాటిపై నడిపించేది రాజ్యాంగమే అన్నారు.

రాజ్యాంగ రూప కల్పనలో అంబేద్కర్ కృషి చిరస్మరణీయం అన్నారు. గొడ్డలి పార్టీ హయాంలో అంబేద్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడిచి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేశారని ధ్వజమెత్తారు. అంబేద్కర్ ఆశయాలకనుగుణంగా నేడు సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని స్పష్టం చేశారు.

గల్లంతైన కాకినాడ మత్స్యకారులు.. క్షేమంగా తీరానికి

- సీఎం చంద్రబాబు ఆదేశాలతో నిరంతర పర్యవేక్షణ... ఫలించిన గాలింపు చర్యలు

అమరావతి (చైతన్యరథం): సముద్రంలో చేపల వేటకు వెళ్లి ఆచూకీ గల్లంతైన కాకినాడ జిల్లా సుబ్బంపేటకు చెందిన ఏడుగురు మత్స్యకారులు క్షేమంగా తీరానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారులు సమన్వయంతో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం, ప్రత్యేక గాలింపు చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. దీనితో మత్స్యకారుల ఆచూకీని వేగంగా గుర్తించగలిగారు. కాకినాడ జిల్లా సుబ్బంపేటకు చెందిన ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లి గల్లంతయ్యారు. ఈ నెల 19వ తేదీన వారితో కమ్యూనికేషన్ పూర్తిగా తెగిపోవడంతో కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది.

ఈ సమాచారం అందిన వెంటనే ప్రభుత్వం స్పందించింది. సీఎం ఆదేశాలతో వివిధ శాఖలు సమన్వయం చేసుకుంటూ గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. ముఖ్యమంత్రి సూచనలతో అధికారులు ఎప్పటికప్పుడు అందుతున్న సమాచారాన్ని విశ్లేషిస్తూ గాలింపు బృందాలను అప్రమత్తం చేశారు. వేటకు వెళ్లిన మత్స్యకారులు లోతట్టు సముద్ర ప్రాంతానికి వెళ్లడంతో అక్కడ మొబైల్ సిగ్నల్స్ అందక సమాచార సంబంధాలు నిలిచిపోయినట్లు తేలింది. గురువారం సాయంత్రం 4:30 గంటల సమయంలో బోటు యజమాని ఫోన్ సిగ్నల్ పరిధిలోకి వచ్చింది. వెంటనే అప్రమత్తమైన కాకినాడ జిల్లా మత్స్యశాఖ అధికారులు సాయంత్రం 5:15 గంటలకు బోటు యజమానితో నేరుగా ఫోన్‌లో మాట్లాడి, బోటులోని ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారని నిర్ధారించుకున్నారు. బోటుకు కూడా ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. ఆ సమయానికి అనకాపల్లి జిల్లా బంగారమ్మపాలెం సమీపంలో ఉన్న బోటు తీరానికి చేరేంత వరకు పర్యవేక్షిస్తూ ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గురువారం అర్ధరాత్రి దాటాక బోటు సురక్షితంగా తీరానికి చేరుకుంది. మత్స్యకారుల కుటుంబ సభ్యులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి క్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, వారి కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

గల్లంతైన బోటు సురక్షితం.. మత్స్యకారులు క్షేమం

- బోటు నంబర్ 927 క్షేమంగా ఉన్నట్లు అధికారుల నిర్ధారణ
- బోటు యజమానితో నేరుగా మాట్లాడిన కాకినాడ జిల్లా మత్స్యశాఖ అధికారి
- క్షేమంగా ఉన్నట్లు తెలిపిన మత్స్యకారులు
- వారి కుటుంబాలకు భరోసా ఇచ్చిన మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి (చైతన్యరథం): కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం యూ.కొత్తపల్లి మండలం సుబ్బంపేటకు చెందిన గల్లంతైన మత్స్యకారుల బోటు (నంబర్ 927) సురక్షితంగా ఉన్నట్లు సమాచారం అందిందని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కాకినాడ జిల్లా మత్స్యశాఖ అధికారి స్వయంగా బోటు యజమానితో ఫోన్‌లో మాట్లాడి క్షేమ సమాచారాన్ని నిర్ధారించుకున్నారని వెల్లడించారు. బోటు ప్రస్తుతం బంగారంపాలెం వద్ద ఉన్నట్లు అధికారులు తెలిపారని, మత్స్యకారుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. మత్స్యకారులు చేపల వేట కోసం డీప్ సీ ప్రాంతానికి వెళ్లడంతో గత 11 రోజులుగా మొబైల్ సిగ్నల్ అందుబాటులో లేక సమాచార సంబంధాలు నిలిచిపోయాయని మంత్రి వివరించారు. చేపల వేట ముగించుకుని సిగ్నల్ పరిధిలోకి వచ్చిన వెంటనే అధికారులను సంప్రదించి తాము క్షేమంగా ఉన్నట్లు సమాచారం అందించారని తెలిపారు. బోటుకు ఎలాంటి ఇబ్బంది లేదని సమాచారం అందడం సంతోషకరమన్నారు. బోటు సురక్షితంగా తీరానికి చేరుకునే వరకు పరిస్థితిని పర్యవేక్షించాలని మత్స్యశాఖ అధికారులకు సూచించారు. మత్స్యకారుల క్షేమమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, వారి కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

విజ్ఞాన విప్లవానికి ఏడాది...

యువత విజయానికి వేదిక

రూ.1.72 కోట్లతో మంగళగిరిలో మోడల్ గ్రంథాలయం

డిజిటల్ ప్రపంచంతో పోటీ పరీక్షలకు కొత్త బాట

మంగళగిరి (చైతన్యరథం): చదువే ఆయుధం... విజ్ఞానమే బలం... లక్ష్యమే గమ్యం... ఈ నినాదానికి ప్రతిరూపంగా మంగళగిరిలో ఆధునిక మోడల్ పబ్లిక్ లైబ్రరీ రూపుదిద్దుకుంది. విద్యార్థుల కలలకు రెక్కలు తొడిగి నిరుద్యోగ యువత ఆశయాలకు అండగా నిలిచే లక్ష్యంతో అభివృద్ధి చేసిన ఈ విజ్ఞాన కేంద్రం ప్రారంభమై నేడు ఏడాది పూర్తి చేసుకుంటోంది. రూ.1.72 కోట్ల భారీ వ్యయంతో ఆధునిక హంగులు అద్దుకున్న ఈ గ్రంథాలయం పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.





1986లో మొదలైన ప్రస్థానం...

ఆధునికతతో కొత్త రూపం

దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హయాంలో 1986లో తెలుగు విజ్ఞాన సమాచార కేంద్రంగా ప్రారంభమైన ఈ గ్రంథాలయం దశాబ్దాలుగా విజ్ఞానాన్ని పంచుతోంది. కాలానుగుణంగా మారుతున్న విద్యా అవసరాలకు అనుగుణంగా దీనిని ఆధునికీకరించారు. 2025 నవంబరు 27న విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆధునిక మోడల్ పబ్లిక్ లైబ్రరీని ప్రారంభించారు.

ఒకే ప్రాంగణంలో విజ్ఞాన ప్రపంచం

రెండు అంతస్తుల్లో రూపుదిద్దుకున్న ఈ గ్రంథాలయంలో పిల్లల కోసం ప్రత్యేక పఠన గది, ఆట స్థలం, దినపత్రికలు, మ్యాగజైన్ల విభాగం, వృద్ధుల కోసం ప్రత్యేక పఠన విభాగం, విశాలమైన రీడింగ్ హాల్ ఏర్పాటు చేశారు. విద్యార్థుల కోసం ప్రత్యేక స్టడీ రూమ్, రెండు బోధనా హాళ్లు, డిజిటల్ లైబ్రరీ, డిజిటల్ రిసోర్స్ సెంటర్ వంటి ఆధునిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

యువత కలలకు డిజిటల్ రెక్కలు

గ్రూప్స్, సివిల్స్, డీఎస్సీ, బ్యాంకింగ్, రైల్వే వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ఈ గ్రంథాలయం విజ్ఞాన గనిగా నిలుస్తోంది. ఖరీదైన ప్రైవేట్ స్టడీ సెంటర్లకు వెళ్లలేని పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునే వేదికగా ఇది ఉపయోగపడుతోంది. తాజా పోటీ పరీక్షల పుస్తకాలు, నాణ్యమైన స్టడీ మెటీరియల్, డిజిటల్ వనరులు నిరంతరం అందుబాటులో ఉంటే యువత విజయానికి మరింత బలమైన పునాది ఏర్పడుతుంది.

రూ.1.72 కోట్లతో అభివృద్ధి...

నిధుల సమీకరణలో భాగస్వామ్యం

ఈ గ్రంథాలయ ఆధునికీకరణకు మొత్తం రూ.1.72 కోట్లు వెచ్చించారు. గుంటూరు జిల్లా మినరల్ ఫండ్స్ నుంచి రూ.90 లక్షలు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ నుంచి రూ.42 లక్షలు, నోవో ఇన్సూరెన్స్ బ్రోకింగ్ సర్వీసెస్ నుంచి రూ.30 లక్షలు సమకూరాయి. ప్రభుత్వ నిధులతో పాటు సంస్థల భాగస్వామ్యం ప్రజా విజ్ఞాన కేంద్రాల అభివృద్ధికి దోహదపడింది.

ఏడాది ప్రస్థానానికి మరింత బలం...

భవిష్యత్తుకు కొత్త లక్ష్యం

గ్రంథాలయం అభివృద్ధి ఒక ప్రారంభం మాత్రమే. పుస్తకాల నిరంతర నవీకరణ, పోటీ పరీక్షల ప్రత్యేక మెటీరియల్, డిజిటల్ సదుపాయాల నిర్వహణ, నాణ్యమైన ఇంటర్నెట్, పరిశుభ్రమైన వాతావరణం, తగిన సిబ్బంది అందుబాటులో ఉంటే ఈ కేంద్రం యువతకు మరింత ఉపయోగకరంగా మారుతుంది. విద్యార్థులు, నిరుద్యోగ యువత, పుస్తక ప్రియుల అవసరాలకు అనుగుణంగా సేవలను విస్తరించాల్సిన అవసరం ఉంది.

చదువుకునే ప్రతి యువకుడికి అండగా...

విజయమే లక్ష్యంగా...

ఒక గ్రంథాలయం అంటే నాలుగు గోడలు, కొన్ని పుస్తకాలు మాత్రమే కాదు. అది కలలకు చిరునామా... ప్రతిభకు వేదిక... భవిష్యత్తుకు మార్గదర్శి. మంగళగిరి మోడల్ గ్రంథాలయం రాబోయే తరాలకు విజ్ఞాన భాండాగారంగా, యువత విజయ ప్రస్థానానికి బలమైన పునాదిగా నిలవాలని ఆకాంక్షిద్దాం.





రాజ్యాంగ స్ఫూర్తికి పెద్దపీట వేస్తూ..

సుపరిపాలనకు చిరునామాగా కూటమి పాలన

- అంబేద్కర్, ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటున్న టీడీపీ
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఉద్ఘాటన
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు
- రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన నేతలు
- భారత రాజ్యాంగం ప్రతీ పౌరునికి పవిత్ర గ్రంథం: ఎమ్మెల్సీ వర్ల రామయ్య
- గత వైసీపీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలకు తూట్లు పొడిచిందన్న నేతలు



అమరావతి (చైతన్యరథం): డా. బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తి, స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆశయాలకు అనుగుణంగా తెలుగుదేశం పార్టీ నడుచుకుంటుందని పార్టీ నేతలు పేర్కొన్నారు. గురువారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో సాగిన ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ వర్ల రామయ్య, ఎమ్మెల్యేలు పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు), గళ్లా మాధవి, టీడీపీ సీనియర్ నేత ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ, పార్టీ ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్ ప్రసాద్, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.... మనం ఈ రోజు ఇంత స్వేచ్ఛగా ఉండటానికి కారణం మన రాజ్యాంగమే అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, రాజ్యాంగ రచన కమిటీ సభ్యులు కలిసి రూపొందించిన రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న ప్రవేశపెట్టి, 1950 జనవరి 26న అమల్లోకి తెచ్చారు. చట్టాలు ఎన్ని చేసినా, వాటిని నిజాయతీగా అమలుచేసే నాయకులు, అధికారులు ఉండాలని అంబేద్కర్ నాడే చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఇష్టానుసారంగా పాలించి, పౌర హక్కులను అణచివేసి రాష్ట్రాన్ని ఇబ్బందుల్లో పెట్టింది. ప్రజల ఆశీర్వాదంతో 2024లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాజ్యాంగాన్ని గౌరవిస్తూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని సమానంగా చూస్తూ అభివృద్ధి చేస్తున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ స్ఫూర్తితో, ప్రతి ఒక్కరి హక్కులను కాపాడుతూ మంచి పాలన అందించడానికి పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.



ఎమ్మెల్సీ వర్ల రామయ్య మాట్లాడుతూ... 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, దేశ ప్రజలకు మార్గదర్శకంగా ఒక లిఖిత రాజ్యాంగం ఉండాలని నాటి పెద్దలు నిర్ణయించారన్నారు. రాజ్యాంగ రచన బాధ్యతను డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కి అప్పగించగా, ఆయన తన కమిటీతో కలిసి గొప్ప రాజ్యాంగాన్ని రూపొందించారు. 1949 నవంబర్ 26న భారతీయులందరూ దీనిని ఆమోదించారు. హిందువులకు భగవద్గీత, క్రైస్తవులకు బైబిల్, ముస్లింలకు ఖురాన్ ఎలాగో, ప్రతి భారతీయుడికి ఈ రాజ్యాంగం అంతకంటే గొప్ప పవిత్ర గ్రంథం లాంటిదని పేర్కొన్నారు.



ఎమ్మెల్యేలు పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు), గళ్లా మాధవి మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా ప్రతి భారతీయుడు గర్వంగా జరుపుకోవాల్సిన పండుగ ఇదన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదు.. 145 కోట్ల మంది ప్రజల హక్కులు, ఆశలకు ప్రతీక. అంబేద్కర్ స్ఫూర్తి, ఎన్టీఆర్ ఆత్మగౌరవం, చంద్రబాబు నాయుడు అభివృద్ధి దార్శనికతతో పేద, ధనిక, ప్రాంతాల తేడా లేకుండా అందరికీ హక్కులు, బాధ్యతలు అందాలి. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే స్తంభాలపై రాజ్యాంగం నిలబడి ఉంది. అణగారిన వర్గాలు, యువతకు అభివృద్ధి ఫలాలు అందినప్పుడే రాజ్యాంగానికి నిజమైన సార్థకత ఉంటుంది. మేధావులు, అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ, రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ పాటించాలని పేర్కొన్నారు.



పార్టీ ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు మాట్లాడుతూ.. ప్రజల కోసం, ప్రజల చేత, ప్రజల కొరకు అనే స్ఫూర్తితో అనేక దేశాల రాజ్యాంగాలను పరిశీలించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేతృత్వంలో మన రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. రాజ్యాంగంలోని మౌలిక అంశాలను ఎవరూ మార్చలేరని సుప్రీంకోర్టు గతంలో అనేక కేసుల్లో స్పష్టం చేసింది. సమానత్వం, లౌకికవాదం దీని ప్రధాన లక్ష్యాలు. కార్యనిర్వాహక, శాసన, న్యాయ వ్యవస్థలకు స్పష్టమైన అధికారాలు ఇస్తూ మన రాజ్యాంగ నిర్మాతలు గొప్ప వరం అందించారు. అయితే రాజ్యాంగం ఎంత గొప్పదైనా, దాన్ని అమలు చేసే నాయకులను బట్టే దాని విలువ ఆధారపడి ఉంటుందని అంబేద్కర్ ఆనాడే చెప్పారు. గతంలో రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేసిన తీరును మనం చూశాం, కానీ ప్రస్తుత ప్రభుత్వంలో నిబంధనలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి చక్కగా అమలవుతున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా మన రాజ్యాంగం అందరికీ ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు.



ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలు, నియమాలకు అనుగుణంగా పార్టీలో బీసీలు, ఎస్సీ, ఎస్టీలకు అధికస్థానం కల్పిస్తున్న పార్టీ తెలుగుదేశం అన్నారు. అన్ని మతాలను గౌరవిస్తూ అన్ని వర్గాలకు సమానంగా చూస్తూ చంద్రబాబు పాలన కొనసాగిస్తున్నారు.



ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్ మాట్లాడుతూ.. బాబూ రాజేంద్ర ప్రసాద్ రాజ్యాంగ పరిషత్తులో ప్రవేశపెట్టిన మన రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యంత పెద్దదన్నారు. రాబోయే వందేళ్ల అవసరాలను ముందుగానే ఊహించి, సభ్యులు, డ్రాఫ్టింగ్ కమిటీ సభ్యులు ఎంతో కష్టపడి, సమన్వయంతో దీన్ని రూపొందించారు. ఈరోజు మనం స్వేచ్ఛగా మాట్లాడగలుగుతున్నామంటే, ప్రతిపక్షాలు కూడా ఇష్టం వచ్చినట్టు మాట్లాడగలుగుతున్నాయంటే దానికి కారణం రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛే. కొందరు ఆ స్వేచ్ఛను దుర్వినియోగం చేసినా, మరికొందరు చక్కగా పాటిస్తారు. తెలుగుదేశం మాత్రం ఎప్పుడూ రాజ్యాంగాన్ని దాటాలని అనుకోదు, రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఏ పనీ చేయదు. ప్రాథమిక హక్కులతో పాటు బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ పాటించాలని కోరుకునే పార్టీ తెలుగుదేశమని స్పష్టం చేశారు.



పార్టీ సీనియర్ నేత వర్మ మాట్లాడుతూ.. బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం దేశ పౌరుల హక్కులకు పెద్ద అండగా నిలిచిందన్నారు. తెలుగుదేశం పార్టీ కూడా రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగానే పనిచేస్తోంది. రాజకీయ, సామాజిక, సంక్షేమ రంగాల్లో అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ, సమతుల్యత పాటిస్తూ చంద్రబాబు నాయుడు నేతృత్వంలో మంచి పాలన సాగుతోందని వర్మ పేర్కొన్నారు.



ప్రజా బలం తగ్గడంతో వైసీపీ మూకల దాడులు

- ఎమ్మెల్యే అఖిలప్రియ వాహనంపై దాడి ప్రజాస్వామ్యంలో హర్షించదగినది కాదు
- పార్వతీపురం మన్యం జిల్లాలో అభ్యర్థినినే తుదముట్టించాలని చూడటం హేయం
- ఎమ్మెల్సీ వర్ల రామయ్య ధ్వజం
- స్థానికసంస్థల ఎన్నికల్లో వైసీపీ విధ్వంసాలపై ఎస్ఈసీకి టీడీపీ నేతల ఫిర్యాదు
- బృందంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్‌ప్రసాద్, బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్, ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ కుప్పం రాజశేఖర్



అమరావతి (చైతన్యరథం): వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయ విధ్వంస క్రీడ రోజుకో కొత్త పుంతలు తొక్కుతూ విభిన్న రూపాలు సంతరించుకుంటోందని ఎమ్మెల్సీ వర్ల రామయ్య తీవ్రంగా విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి ప్రజాబలం తగ్గడం తో దాడులకు తెగపడుతున్నారని మండి పడ్డారు. ముఖ్యంగా అహోబిలంలో గురువారం ఎమ్మెల్యే భూమ అఖిలప్రియపై వైసీపీ గూండాల దాడి, పార్వతీపురం మన్యం జిల్లాలో అభ్యర్థిపై హత్యయత్నాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు టీడీపీ పార్టీ ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్‌బాబు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్‌ప్రసాద్, బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్, ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ కుప్పం రాజశేఖర్‌లతో కలిసి రాష్ట్రంలో వైసీపీ నాయకుల చేసిన విధ్వంసం, అల్లర్లపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) కార్యదర్శి డా.ఎ.మల్లికార్జున, ఐజీ రాజకుమారికి ఫిర్యాదు చేశారు.

అనంతరం మీడియాతో మాట్లాడిన వర్ల రామయ్య.. ఎన్నికల్లో ప్రజల మద్దతు పొందలేమనే భావనతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అల్లర్లు, దాడులు, బెదిరింపులు సృష్టించి రాజకీయ ఉనికిని చాటుకోవాలనే ధోరణి వైసీపీలో కనిపిస్తోందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి ఎన్నికల్లో ప్రజల తీర్పు ఏమిటో స్పష్టంగా తెలుసని... అయినప్పటికీ పార్టీ ఉనికిని చాటుకోవాలనే ఉద్దేశంతో ఓటర్లు ఓటు వేసేందుకు వెళ్లకుండా అడ్డుకోవడం, పోలింగ్ కేంద్రాల వద్ద గొడవలు సృష్టించడం, ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు, నాయకులపై దాడులకు పాల్పడుతున్నారని ద్వజమెత్తారు. వైసీపీ చేస్తుంది రాజకీయ పోరాటం కాదు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే విపరీత ధోరణి అని విమర్శించారు.

అఖిలప్రియ వాహనంపై దాడి అత్యంత దారుణం

నంద్యాల జిల్లా అహోబిలంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వాహనంపై జరిగిన రాళ్లదాడిని వర్ల రామయ్య తీవ్రంగా ఖండించారు. ప్రజాప్రతినిధుల వాహనాలపై దాడులు చేయడం, వాహనాలను ధ్వంసం చేయడం, పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తతలు సృష్టించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ ఘటనలో వాహనం అద్దాలు ధ్వంసమై డ్రైవర్ గాయపడినట్లు వచ్చిన వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ తరహా ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మన్యం జిల్లాలో మహిళా అభ్యర్థిపై దాడి అమానుషం

మన్యం జిల్లాలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న మహిళా అభ్యర్థిపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలు సరైనవి కాదని హెచ్చరించారు. ఈ ఘటనతో ఆమె ప్రాణాలకే ముప్పు ఏర్పడే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు.

సమయానికి పోలీసులు జోక్యం చేసుకోకపోయి ఉంటే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉండేదని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న మహిళా అభ్యర్థులకే రక్షణ లేకపోతే సామాన్య మహిళలు, ఓటర్ల భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలోని పలు గ్రామాల్లో దాడులు, ఘర్షణలు, బ్యాలెట్ బాక్సులను ఎత్తుకెళ్లేందుకు వైసీపీ రౌడీ మూకలు ప్రయత్నించారని ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడం, ఓటర్లను భయపెట్టడం, పోలీసు యంత్రాంగాన్ని సైతం సవాలు చేయడం రాజ్యాంగ వ్యవస్థకు విరుద్ధమని అన్నారు. ఈ ఘటనల వెనుక ఉన్నవారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జగన్ పద్ధతి మార్చుకోవాలి

జగన్ మోహన్‌రెడ్డి ప్రతి రాజకీయ చర్యలోనూ హింసాత్మక ధోరణి కనిపిస్తోందని ఆరోపించారు. రాజకీయ విమర్శలు చేయడం వేరు, ప్రజాస్వామ్య వ్యవస్థను అడ్డుకోవడం వేరని వర్ల రామయ్య వ్యాఖ్యానించారు.

ప్రజల దగ్గరకు వెళ్లి ఓట్లు అడగాలి, ప్రజల విశ్వాసం పొందాలి, ఎన్నికల్లో గెలవాలి. అంతేకానీ దాడులు, బెదిరింపులు, విధ్వంసాలతో రాజకీయ ఉనికిని చాటుకోవాలని ప్రయత్నించడం సరైన విధానం కాదన్నారు. రెండేళ్లు ఆగండి.. మళ్లీ అధికారంలోకి వస్తానంటున్న జగన్ మోహన్ రెడ్డి.. ముందుగా ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా మహిళలు, రాజకీయ నాయకుల వ్యవహారశైలిని గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు తమ పద్ధతిని మార్చుకొని శాంతియుత రాజకీయాలు చేయాలని హితవు పలికారు.





రాయలసీమ లిఫ్ట్ పేరుతో జగన్ రాజకీయ డ్రామా

- బీఆర్ఎస్ నేత హరీష్‌రావు వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలి
- ఐదేళ్ల పాలనలో సీమకు తీరని ద్రోహం
- చివరి భూముల వరకు కృష్ణా జలాలు పారిస్తున్న సీఎం చంద్రబాబు
- మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

అమరావతి (చైతన్యరథం): రాయలసీమ రైతుల గురించి, రాయలసీమ ప్రాంతం గురించి మాట్లాడే కనీస అర్హత లేని వ్యక్తి జగన్మోహన్ రెడ్డి మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ పులివెందుల ఇన్‌ఛార్జి బీటెక్ రవి (మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి) మండిపడ్డారు. ఐదేళ్ల పాలనలో రాయలసీమకు తీరని ద్రోహం చేసిన వ్యక్తి జగన్ అని గురువారం ఒక ప్రకటనలో రవి ధ్వజమెత్తారు. హంద్రీనీవా పనులు శరవేగంగా పూర్తి చేసి రాయలసీమ చివరి భూముల వరకు సీఎం చంద్రబాబు నాయుడు కృష్ణా జలాలను పారిస్తున్నారని పొరుగు రాష్ట్రాల నాయకులు కీర్తిస్తుంటే... జగన్‌రెడ్డికి కడుపు మంటగా ఉన్నట్టుంది. 2020లోనే సీఎం జగన్‌కు వార్నింగ్ ఇచ్చి రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆపించామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు అంటున్నా రు. జగన్ దీనికి సమాధానం చెప్పాలి. శ్రీశైలం జలాశయం నుంచి 798 అడుగుల నీటిమట్టం వద్దనే కృష్ణా జలాలను తరలిం చేందుకు నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని ముచ్చుమర్రి వద్ద చంద్రబాబు నిర్మించారు. జగన్ ఐదేళ్లపాలనలో ఈ పథకాన్ని నిర్వీర్యం చేశారు. రాయలసీమ లిఫ్ట్ పేరుతో రూ. 1000 కోట్లు మట్టి



పనులు చేసుకొని దోచుకున్నారు. 2020లోనే అనుమతులు లేవని రాయలసీమ లిఫ్ట్‌ని ఎన్జీటీ నిలిపి వేసింది. వైసీపీ ఇసుక మాఫియాకు అన్నమయ్య డ్యామ్ తెగి 39 మంది చనిపోయారు. హంద్రీనీవా కరెంట్ బిల్లులకు కూడా డబ్బులు చెల్లించలేదు. ఐదేళ్ల పాలనలో కేవలం రూ. 2 వేల కోట్లు కూడా సీమ ప్రాజెక్టులకు ఖర్చు చేయలేదు. జీఓ 365 తెచ్చి 102 రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల పనులు రద్దు చేశారు. పట్టిసీమ పూర్తి చేసి కృష్ణా డెల్టాకు గోదావరి నీటిని తరలించి, కృష్ణా జలాల్లో 512టీఎంసీల వాటా సాధించి రాయలసీమను సస్యశామలం చేసిన ఘనత చంద్రబాబుది. ఈ రెండున్నరేళ్ల పాలనలో దాదాపు రూ. 13,500 కోట్లు రాయలసీమ ప్రాజెక్టులకు ఖర్చు చేశాం. మరో రూ. 10వేల కోట్లు ఖర్చు చేయబోతు న్నాం. రెండు సార్లు కుప్పం వరకు కృష్ణా జలాలను తరలించాం. రాయలసీమను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలుపుతున్నాం. నీచ రాజకీయల కోసం రాయలసీమ పేరును వాడుకోవడం జగన్‌కు అల వాటుగా మారింది. 2024 ఎన్నికల్లో, ఇప్పుడు జరు గుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పినా జగన్‌లో ఇంకా మార్పు రాలేదని బీటెక్ రవి దుయ్యబట్టారు.

రీకౌంటింగ్ కోరితే రాళ్లతో వైసీపీ దాడులు ప్రజాస్వామ్యమా?

- 43 ఓట్ల తేడాతో ఫలితం.. రీకౌంటింగ్ కోరడం అభ్యర్థి హక్కు
- గతంలో వైసీపీ ఎమ్మెల్సీ భరత్ చేసిన రక్తపాత వ్యాఖ్యలే తాజా దాడులకు ప్రేరణ
- కౌంటింగ్ కేంద్రం వద్ద దాడి ఘటనలో టీడీపీ కార్యకర్త మృతి అత్యంత బాధాకరం
- కుప్పం ప్రశాంతతను దెబ్బతీసేందుకు వైసీపీ కుట్రలు.. ఇలాంటి దాడులను ప్రభుత్వం సహించదు
- మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ ధ్వజం



అమరావతి (చైతన్యరథం): కుప్పం నియోజకవర్గం వానగుట్లపల్లి పంచాయతీ ఎన్నికల్లో రీకౌంటింగ్ కోరినందుకు వైసీపీ శ్రేణులు రాళ్లతో దాడులకు దిగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేవలం 43 ఓట్ల తేడాతో ఎన్నికల ఫలితం ఉండటంతో టీడీపీ అభ్యర్థి రీకౌంటింగ్ కోరారని, ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతి అభ్యర్థికీ ఆ హక్కు ఉంటుందని స్పష్టం చేశారు. రీకౌంటింగ్ కోరడం నేరమా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ప్రజల తీర్పును గౌరవించడమే ప్రజాస్వామ్యమని, అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలే తప్ప దాడులకు దిగడం సమంజసం కాదన్నారు.

క్రమశిక్షణకు టీడీపీ మారుపేరు - దాడులు, దౌర్జన్యాలకు వైసీపీ మారుపేరు

కుప్పం ఎప్పుడూ ప్రశాంతతకు, అభివృద్ధికి మారుపేరుగా నిలిచిందని, అలాంటి ప్రాంతంలో వైసీపీ దాడులకు దిగడం బాధాకరం. ఎన్నికలకు ముందే వైసీపీ ఎమ్మెల్సీ భరత్ తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు దాడులకు సిద్ధంగా ఉండాలని, ప్రాణాలు తీసేవారినే రాజకీయాల్లో ముందుకు తీసుకొస్తామని వ్యాఖ్యానించి రెచ్చ గొట్టారు. గతంలో వైసీపీ ఎమ్మెల్సీ భరత్ చేసిన రక్తపాత వ్యాఖ్యలే తాజా దాడులకు ప్రేరణగా మారాయి. నాయకుల ఆలోచనా విధానమే కిందిస్థాయి కార్యకర్తల ప్రవర్తనపై ప్రభావం చూపుతుంది. క్రమశిక్షణకు తెలుగుదేశం పార్టీ మారుపేరైతే, దాడులు, దౌర్జన్యాలకు వైసీపీ మారుపేరుగా మారిందని విమర్శించారు.

టీడీపీ కార్యకర్త బలి కావడం బాధాకరం

రీకౌంటింగ్ ప్రక్రియపై అధికారులతో చర్చలు జరుగుతున్న సమయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి వచ్చిన కారుపై వైసీపీ శ్రేణులు రాళ్లతో దాడి చేశాయి. దాడి నుంచి తప్పించుకునే క్రమంలో కారు డ్రైవర్ భయంతో వాహనాన్ని ముందుకు తీసుకెళ్లగా, ఆ కారు ఢీకొని టీడీపీ కార్యకర్త ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరం. ముందస్తు ప్రణాళికతోనే రాళ్లు సిద్ధం చేసుకుని దాడులకు దిగారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరగాలి. ఒక కుటుంబం రోడ్డున పడేలా చేసిన ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి. రీకౌంటింగ్ నిర్వహించకూడదని వైసీపీ భావిస్తే అధికారుల వద్ద అభ్యంతరాలు వ్యక్తం చేయవచ్చు. చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని కోరవచ్చు. అంతేకానీ రాళ్లతో దాడులు చేసి అభ్యర్థులను, అధికారులను భయభ్రాంతులకు గురిచేయడం ఏమిటి? రీకౌంటింగ్ ప్రక్రియను అడ్డుకోవడం ద్వారా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం జరిగింది. కరకట్ల వద్ద టీడీపీ నాయకుడు చంద్రశేఖర్ ఇంటిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలపై పోరాడిన నాయకుడి ఇంటిపైకి వెళ్లి దాడి చేయడం దుర్మార్గం. రాజకీయంగా ఎదుర్కోలేక భౌతిక దాడులకు పాల్పడటం వైసీపీ వైఖరికి నిదర్శనం" అని పేర్కొన్నారు.

చంద్రబాబు నేతృత్వంలో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ

రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్నాయి. విశాఖపట్నం మేయర్ ఎన్నికలు, విజయవాడ, తిరుపతి, అనంతపురం వంటి ప్రాంతాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎక్కడా అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోలేదు. ప్రజలు ఎవరిని కోరుకుంటే వారిని ఎన్నుకునే స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాం. అనంతపురంలో వైసీపీ గెలిచినప్పటికీ ఎలాంటి దాడులకు పాల్పడలేదు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకటో తేదీ ఉదయం నుంచే లబ్ధిదారులకు పెన్షన్లు అందిస్తున్నాం. రైతులకు అండగా నిలుస్తూ, గ్రామాల్లో రహదారులు సహా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నాం.

ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో ఉన్న నమ్మకమే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి వస్తున్న మద్దతుకు కారణం. కుప్పం రాష్ట్రానికే ఒక రోల్ మోడల్‌గా ఉంది. అభివృద్ధి, సంక్షేమం, ప్రశాంత వాతావరణంలో ముందంజలో ఉంది. రాజకీయ ప్రయోజనాల కోసం కుప్పంలో అలజడి సృష్టించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలనే ప్రయత్నాలను వైసీపీ మానుకోవాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో దాడులకు, హింసకు స్థానం లేదు. ఇలాంటి ఘటనలను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని వర్మ స్పష్టం చేశారు.

కుప్పం వైసీపీ ఇన్‌చార్జి భరత్ డైరెక్షన్ లోనే... వైసీపీ అల్లరి మూకల బరితెగింపు

- గతంలో భరత్ వ్యాఖ్యలకు అనుగుణంగా కుప్పంలో రక్తపాతానికి రెచ్చిపోతున్న వైసీపీ గూండాలు
- ప్రమాదాన్ని కూడా రాజకీయం చేయాలనుకోవడం వైసీపీ దిగజారుడు రాజకీయానికి నిదర్శనం
- ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ధ్వజం

కుప్పం (చైతన్యరథం): ప్రశాంతమైన కుప్పంలో గొడ్డలి పార్టీ నేతలు ఘర్షణలు, దాడులు చేసి ఈ ప్రాంతానికి చెడ్డపేరు తీసుకురావాలని చూస్తున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్న ఎన్నికల్లో వైసీపీ నేతలు విధ్వంసం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కుప్పంలో గురువారం చోటుచేసుకున్న ఘర్షణలకు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భరత్ రెచ్చగొట్టే వ్యాఖ్యలే కారణమని ఆరోపించారు. గతంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఇవాళ ఆ పార్టీ కార్యకర్తలు పాటించారని ధ్వజమెత్తారు. ఆ పార్టీ నేతలతో పాటు



అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి సైతం హింసా దోరణినినే కోరుకుంటున్నారని దుయ్యబట్టారు. ఈ మేరకు ఆయన ఓ వీడియోను విడుదల చేశారు.

వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం

వానగుట్లపల్లి పంచాయతీ ఎన్నికల్లో వైసీపీకి 42 ఓట్ల మెజారిటీ రాగా, రీకౌంటింగ్ జరగాలని టీడీపీ నేతలు, కౌంటింగ్ ఏజెంట్లు అడిగారు. ఆ సమయంలో అక్కడికి రూట్ ఆఫీసర్ వచ్చారు. సాధారణ ప్రక్రియలో భాగంగా రూట్ ఆఫీసర్ కౌంటింగ్ హాల్‌లోకి వెళ్లగా అధికారులపై దాడికి యత్నించారు. వైసీపీ నేతలు ముందుగానే సిద్ధం చేసుకున్న రాళ్లు, పెట్రోల్‌తో కౌంటింగ్ కేంద్రం, రూట్ ఆఫీసర్ వాహనంపై దాడి చేశారు. దీంతో జనం భయపడి పారిపోగా, రాళ్ల దాడి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో రూట్ ఆఫీసర్ వాహనం ఢీకొని ఓ వ్యక్తి చనిపోవడం బాధాకరం. జంపనూరు గ్రామానికి చెందిన 60 ఏళ్ల టీడీపీ కార్యకర్త రాజేంద్ర ఓటు వేసి అక్కడ ఉండగా ఆ కారు ఢీ కొని చనిపోయారు. ఈ ప్రమాదాన్ని వైసీపీ రాజకీయంగా వాడుకోవాలని చూస్తుందని ఎమ్మెల్సీ శ్రీకాంత్ విమర్శించారు.

ఎమ్మెల్సీ భరత్ ఆదేశాలు ప్రకారమే ఈ దాడులు

ఎన్నికలకు ముందు కుప్పం వైసీపీ ఇంచార్జ్, ఎమ్మెల్సీ భరత్.. చావడానికైనా, చంపడానికైనా సిద్ధంగా ఉన్నవాళ్లను అభ్యర్థులుగా పెడతామని, రక్తాభిషేకం చేసి అయినా గెలుస్తామని చెప్పారు. ఇవాళ ఆయన ఆదేశాలు మేరకు ఇక్కడ దాడులు చేశారు. ఒక నిండు ప్రాణం పోయి, ఆ కుటుంబానికి పెద్ద దిక్కు లేకుండా పోవడానికి వైసీపీ నేతల మాటలు, చేతలే కారణం. పోలీస్ స్టేషన్లు, కోర్టులతో అవసరం లేని ప్రశాంతమైన కుప్పాన్ని చూడాలని సీఎం చంద్రబాబు కలలు కంటే వైసీపీ నాయకులు మాత్రం విధ్వంసం, అల్లర్లు సృష్టిస్తున్నారు. 2019-24 మధ్య వందలాది మంది టీడీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి హింసించారు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా అరాచకాలు ఆపడం లేదు. కర్లగట్ట గ్రామంలో టీడీపీ 136 ఓట్ల మెజారిటీతో గెలిస్తే టీడీపీ నేత చంద్రశేఖర్ ఇంటికి వెళ్లి దాడులు చేశారు. ఇంట్లో మనుషులు లేకపోవడంతో కారు అద్దాలు, కారును ధ్వంసం చేశారు. 2019-24లో రౌడీ రాజ్యం నడిపిన వాళ్లు ఇప్పుడు కూడా అదే తీరుతో వ్యవహరించడం సిగ్గుచేటు. అసాంఘిక చర్యలకు పాల్పడి ప్రజలను భయపెడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు.

పదవిలో ఉన్నప్పుడు ధైవద్రోహం..
అధికారం పోయాక 'హే రామ్' అంటూ కొత్త రాగం!

పిల్లి.. పులి వేషం వేసుకుంటే పులి అయిపోదు. అలాగే కరుడుకట్టిన హిందూ వ్యతిరేకి అకస్మాత్తుగా హిందూ ముసుగు వేసుకుని 'హే రామ్' అంటూ నాటకాలాడితే హిందువూ అయిపోడు

మత సామరస్యానికి, ఆధ్యాత్మిక వైభవానికి నిలయమైన ఆంధ్రప్రదేశ్ గడ్డపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సాగించిన ఐదేళ్ల హిందూ వ్యతిరేక పాలన ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. అన్ని మతాలను సమభావంతో చూడటం ప్రజాస్వామ్య ప్రభుత్వాల ప్రాథమిక కర్తవ్యం. కానీ, జగన్ మోహన్ రెడ్డి హయాంలో హిందూ ధర్మంపై వ్యవస్థీకృత దాడి జరిగింది. ఐదేళ్ల పాటు సాగిన హిందూ వ్యతిరేక విధానాలను కప్పిపుచ్చుకోవడానికి, నేడు అధికారం కోల్పోయిన తర్వాత కూడా జగన్ మోహన్ రెడ్డి, అతని ముఠా నిత్యం హిందూ ఆలయాలపై, ప్రసాదాలపై విష ప్రచారం చేస్తూ కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ఆడుకుంటున్నారు.



రాజకీయ నిరుద్యోగికి అకస్మాత్తుగా గుర్తొచ్చిన 'హే రామ్'!

తిరుపతి గ్రూప్ టెంపుల్స్ పరిధిలోని కరకంబాడి వద్ద సుమారు 70 ఏళ్ల క్రితం గ్రామస్తులు నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయ విషయంలో వైసీపీ చేస్తున్న రాద్ధాంతం వారి ద్వంద్వ నీతికి నిదర్శనం. రేణిగుంట-కోడూరు ఎన్‌హెచ్-716 నాలుగు లైన్ల రహదారి విస్తరణ కోసం ఆలయ భూమిలో 1,740.21 చదరపు మీటర్ల స్థలాన్ని ఎన్‌హెచ్ఏఐ సేకరించింది. దీనికి సంబంధించిన భూసేకరణ అవార్డును 20 అక్టోబర్ 2023న స్వయంగా జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా, స్థానిక ఎమ్మెల్యేగా-టీటీడీ ఛైర్మన్‌గా కరుణాకర్ రెడ్డి ఉన్నప్పుడే ఆనాటి జాయింట్ కలెక్టర్ పాస్ చేశారు. ఆనాడు వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆగిపోయిన విస్తరణ పనులను నేడు కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది. నాడు వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిన రూ.59,30,606 పరిహారాన్ని 2026లో కూటమి ప్రభుత్వం జమ చేయించి, ఆ నిధులను ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో భద్రపరిచి కొత్త ఆలయ నిర్మాణానికి వినియోగిస్తున్నారు. అంతేకాకుండా, పక్కనే ఉన్న 2,420 చదరపు గజాల ప్రభుత్వ భూమిని కేటాయించి, 22 నవంబర్ 2026న అర్చకులు, గ్రామస్తుల సమక్షంలో ఆగమ శాస్త్రం ప్రకారం బాలాలయం నిర్వహించి మూలవిరాట్టును సురక్షితంగా ధాన్యాధివాసానికి తరలించారు. 2023లో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన అలైన్‌మెంట్ ప్రకారమే పనులు జరుగుతుంటే, అలైన్‌మెంట్ మార్చేశారంటూ జగన్ అండ్ కో విషం చిమ్మడం సిగ్గుచేటు. తన పాలనలో వందలాది ఆలయాలు కూల్చివేతకు గురైనప్పుడు గుర్తురాని దేవుడు, నేడు రాజకీయ నిరుద్యోగిగా మారిన తర్వాత మత విద్వేషాలు రెచ్చగొట్టడానికి గుర్తుకురావడం జగన్మోహన్ రెడ్డి నీచ రాజకీయాలకు పరాకాష్ట.

రామతీర్థం రాములవారి శిరస్సు ఖండన

చరిత్రలో విదేశీ ఆక్రమణదారుల దాడుల సమయంలో హిందూఆలయాలు,సంప్రదాయాలు తీవ్రంగా నష్టపోయాయి. సరిగ్గా అలాంటి భయానక పరిస్థితులే జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్‌లో పునరావృతమయ్యాయి. విజయనగరం జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో బోడికొండపై ఎన్నో శతాబ్దాలుగా కొలువైన కోదండరామస్వామి విగ్రహ శిరస్సును దుండగులు అత్యంత కిరాతకంగా ఖండించిన ఘటన యావత్ హిందూ సమాజాన్ని కన్నీరు పెట్టించింది. కనీసం ఘటనా స్థలానికి వెళ్లి భక్తులకు మనోధైర్యం ఇవ్వకపోగా,నిరసన తెలిపిన వారిపైనే అక్రమ కేసులు బనాయించారు. 400ఏళ్ల చరిత్ర కలిగిన రాముల వారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన అసలు దోషులను పట్టుకుని కఠినంగా శిక్షించడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసింది... ఆనాడు జగన్మోహన్ రెడ్డికి 'హే రామ్' గుర్తుకు రాలేదేం!

కనకదుర్గమ్మ ఆలయంలో వెండి విగ్రహాల చోరీ

రాష్ట్రంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం సైతం వైసీపీ హయాంలో అపవిత్రమైంది. అమ్మవారి రథానికి అమర్చిన విలువైన వెండి సింహాల విగ్రహాలు మాయమైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. అత్యంత పవిత్రమైన ఆలయ ప్రాంగణంలో, నిఘా నీడలో ఉండాల్సిన అమ్మవారి వెండి విగ్రహాలు చోరీకి గురైతే, ఆనాటి ప్రభుత్వం దానిని ఒక సాధారణ ఘటనగా చిత్రీకరించే ప్రయత్నంచేసింది. అమ్మవారి సన్నిధిలో జరిగిన ఈఅపచారాలపై కఠినచర్యలు తీసుకోవాల్సింది పోయి, విచారణ పేరుతో కాలయాపన చేస్తూ దోషులను కాపాడే ప్రయత్నం చేశారు... ఆనాడు జగన్మోహన్‌రెడ్డికి హే రామ్' గుర్తుకురాలేదేం!

అంతర్వేది రథం దగ్ధం

తూర్పుగోదావరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా, శతాబ్దాల చరిత్ర కలిగిన రథం అగ్నికి ఆహుతైన ఘటన కోట్లాది మంది భక్తుల గుండెలను పిండేసింది. అత్యంత సురక్షితంగా షెడ్డులో ఉంచిన రథం అర్ధరాత్రి వేళ తగలబడి బూడిదైతే, అది కేవలం ప్రమాదమని, పిచ్చివాళ్ల పని అని నాటి వైసీపీ ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా ప్రకటించింది. రథం దగ్ధమైన ఘటనపై న్యాయం చేయాలని, సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ రోడ్డెక్కిన భక్తులు, హిందూ ధార్మిక సంఘాల నేతలపై పోలీసులు లాఠీఛార్జ్ చేసి అక్రమ కేసులతో వేధించారు...ఆనాడు జగన్మోహన్ రెడ్డికి హే రామ్' గుర్తుకురాలేదేం!

ఆలయాలపై 350కి పైగా దాడులు..
2,500 ట్రస్టుల నిర్వీర్యం

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్‌లో హిందూ దేవాలయాలపై జరిగిన దాడుల గణాంకాలు చూస్తే ఒళ్లు గగుర్పొడుస్తుంది. ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా 350 పైగా దేవాలయాలపై దాడులు, విగ్రహాల ధ్వంసం ఘటనలు నమోదయ్యాయి. పిఠాపురంలోని అగ్రహారంలో ఉన్న బజరంగ్ ఆలయంలో గణేశుడు, హనుమంతుడు, సాయిబాబా, దుర్గామాత విగ్రహాలను సుత్తులతో పగలగొట్టిన ఘటన అప్పటి అరాచక పరిస్థితులకు అద్దం పడుతోంది. ఆలయాల వద్ద రథాలు తగులబెట్టడం, విగ్రహాలను ధ్వంసం చేయడం ఒక పథకం ప్రకారం జరుగుతున్నా, ముఖ్యమంత్రి హోదాలో ఉన్న జగన్ మోహన్ రెడ్డి ఒక్కరోజు కూడా ఏ ఆలయాన్నీ సందర్శించలేదు, కనీసం ఖండిస్తూ ఒక్క ప్రకటన కూడా చేయలేదు. అంతేకాకుండా, రాష్ట్రంలోని 2,500 దేవాలయాల ట్రస్ట్ బోర్డులను నిర్వీర్యం చేసి, ఆలయ వ్యవస్థను పూర్తిగా బలహీనపరిచారు. హిందూ ఆచారాలు, సంప్రదాయాలు, స్థలపురాణాలను మంటగలుపుతూ రాష్ట్రవ్యాప్తంగా బలవంతపు మత మార్పిడులను ప్రోత్సహించారు.

కలియుగ వైకుంఠం తిరుమలలో అపచారాలు..
అంతులేని దోపిడీ!

ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది హిందువులు అత్యంత పవిత్రంగా భావించే తిరుమల తిరుపతి దేవస్థానాన్ని వైసీపీ ప్రభుత్వం ఒక రాజకీయ పునరావాస కేంద్రంగా, ఆదాయ వనరుగా మార్చుకుంది. సాక్షాత్తు తిరుమల శ్రీవారిని 'నల్లరాయి' అని అవమానించిన భూమన కరుణాకర్ రెడ్డికి టీటీడీ ఛైర్మన్ పదవి కట్టబెట్టడం జగన్ మోహన్ రెడ్డి హిందూ వ్యతిరేక మనస్తత్వానికి పరాకాష్ట.

అన్యమత ప్రచారం: టీటీడీలో అన్యమతస్థుల నియామకం, తిరుమల-తిరుపతి బస్సు టికెట్ల వెనుక జెరూసలేం యాత్ర ప్రకటనలు ముద్రించడం, తిరుమల కొండపై అన్యమత గుర్తులు కనిపించడం భక్తులను తీవ్ర ఆవేదనకు గురిచేశాయి.

వెబ్‌సైట్‌లో అపచారం, అయోధ్య విస్మరణ: టీటీడీ అధికారిక వెబ్‌సైట్ పంచాంగం సమాచారంలో 'శ్రీ వేంకటేశాయ నమః' స్థానంలో 'శ్రీ యేసయ్య' అనే అక్షరాలు రావడం, భక్తులకు అశ్లీల వెబ్‌సైట్ లింక్ పంపడం వంటి దారుణాలు జరిగాయి. ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా పాల్గొన్న చారిత్రాత్మక అయోధ్య రామమందిర భూమిపూజ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ఛానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయకుండా ఉద్దేశపూర్వకంగా అడ్డుకుని కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీశారు.

కల్తీ నెయ్యి పాపం: ప్రమాదకర రసాయనాలతో నెయ్యి కానీ నెయ్యితో శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని తయారు చేసి మహాపాపానికి ఒడిగట్టారు. నేటికీ ఆ పాపాన్ని సమర్థించుకుంటూ వైసీపీ నేతలు మాట్లాడటం వారి సిగ్గులేనితనానికి నిదర్శనం.

టీటీడీలో భారీ స్కామ్‌లు: పరకామణిలో హుండీ కానుకల దోపిడీని చిన్న దొంగతనంగా చిత్రీకరించి రాజీ పేరుతో దొంగసొమ్ము పంచుకోవటం, రూ.2 కోట్ల విలువైన తలనీలాలు మయన్మార్ మీదుగా చైనాకు అక్రమంగా తరలుతూ అస్సాం రైఫిల్స్‌కు పట్టుబడటం, శ్రీవారి పట్టు శాలువాల కొనుగోళ్లలో అక్రమాలు, గోవిందరాజుల స్వామి ఆలయ విమాన గోపురంపై ఉన్న సుమారు 50 కిలోల బంగారు తాపడం మాయం కావడం, దర్శనానికి వచ్చిన భక్తులు పోగొట్టుకున్న విలువైన వస్తువులను సైతం దోచుకోవడం వంటి కుంభకోణాలు వైసీపీ హయాంలోనే జరిగాయి. దర్శనం, వసతి, గదుల అద్దె, టోల్, ప్రసాదాల ధరలను విపరీతంగా పెంచి సామాన్య భక్తుడి నడ్డి విరిచారు.

అధికారం కోల్పోయినా మారని కుట్రలు

2024 ఎన్నికల్లో ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసి బుద్ధిచెప్పినా జగన్‌మోహన్‌రెడ్డి తీరులో ఏమాత్రం మార్పు రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని ప్రధాన ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేసింది. భౌతిక దాడులు చేయడానికి అవకాశం లేకపోవడంతో, వైసీపీ పేటీఎం బ్యాచ్ సోషల్ మీడియా వేదికగా ఆలయాలపై విష ప్రచారానికి తెరలేపింది.

శ్రీశైలం లడ్డూలో బొద్దింక వచ్చిందంటూ వైసీపీ ముఠా పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేసింది. కానీ, లడ్డూను కొనుగోలు చేసిన తర్వాత కావాలనే అందులో బొద్దింకను దూర్చిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డయ్యాయి.

2019లో తమ హయాంలో జరిగిన దుర్గమ్మ లడ్డూ మేకు వీడియోను కూటమి ప్రభుత్వంలో జరిగినట్లుగా సోషల్ మీడియాలో వైరల్ చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కుట్రపన్నారు.

తిరుమల గోశాలలో ఆవులు చనిపోతున్నాయని, నిత్యాన్నదానం సరిగా జరగడం లేదని అబద్ధాలు ప్రచారం చేయడంతో పాటు, వైసీపీ నాయకుడుతో తిరుమల దర్శన కంపార్ట్‌మెంట్‌లో కావాలనే నిరసన డ్రామా ఆడించి వీడియోలు విడుదల చేశారు.

స్వయంగా వైసీపీహయాంలో ముంతాజ్‌హోటల్‌కు అనుమతులు ఇచ్చి,నేడు ఆ అనుమతులను రద్దుచేసిన కూటమి ప్రభుత్వంపైనే నిందలు మోపుతున్నారు.

తిరుమలలో ఖాళీ మద్యం సీసాలను పెట్టి కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలుచేయడానికి నీచమైన కుట్రలు పన్నారు

రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటక రంగాన్ని దెబ్బతీయడానికి, మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందడానికి వైసీపీ చేస్తున్న ఈ నీచ కుట్రలను ఆంధ్రప్రదేశ్ ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. ఆనాడు రాములవారికి జరిగిన అవమానాన్ని చూసి చలించిపోయిన ప్రజలు, ఐదేళ్ల తర్వాత తమ ఓటు అనే ఆయుధంతో జగన్ అరాచక పాలనకు శాశ్వతంగా ముగింపు పలికారు. చచ్చిపోయిన పార్టీని బతికించుకోవడానికి దేవుడితోనే రాజకీయ ఆటలు ఆడుతున్న జగన్ "మోసపు" రెడ్డికి భవిష్యత్తులో ప్రజలు మరింత గట్టిగా బుద్ధి చెప్పడం ఖాయం.

వైకాపా నుంచి టీడీపీలోకి ఏడు కుటుంబాలు.. మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో పసుపు కండువా కప్పుకున్న నేతలు!



కోటబొమ్మాళి (చైతన్యరథం): కోటబొమ్మాళి మండలం అక్కయ్యవలస గ్రామానికి చెందిన 7 వైసీపీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. గ్రామానికి చెందిన ఏడు కుటుంబాలు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో వైకాపాను వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో గిన్ని ధనుంజయ రెడ్డి, కోళ్ల నీలకంఠ రెడ్డి, గిన్ని ధర్మారెడ్డి, కోళ్ల జనార్దన్ రెడ్డి, గిన్ని జగ్గారావు, గిన్ని ఆమాస్ రెడ్డి తదితరులకు మంత్రి అచ్చెన్నాయుడు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ విధానాలు, కూటమి ప్రభుత్వ పాలనలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. పార్టీ బలోపేతానికి, గ్రామ అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వరప్రసాద్ పాల్గొన్నారు.

చీడికాడలో 14 అడుగుల పాడవు... 12 కేజీల బరువైన గిరినాగు



చీడికాడ (చైతన్యరథం): అనకాపల్లి జిల్లా మండల కేంద్రం చీడికాడ శివారు కల్లాల వద్ద గిరినాగు హల్ చల్ చేసింది. భారీ ఆకారంలోని అత్యంత పొడవైన పామును చూసిన స్థానిక రైతులు అటవీ శాఖ అధికారులు ద్వారా తూర్పు వన్యప్రాణుల సంరక్షణ సభ్యులకు సమాచారం అందించారు. వారంతా తీవ్రంగా శ్రమించి చాకచక్యంగా భారీ గిరినాగుని ఓ సంచిలో బంధించారు. దీని పొడవు 14 అడుగుల వరకు ఉంటుందని... బరువు 12 కేజీల పైగా ఉందని అటవీశాఖ గార్డు నటరాజ్ తెలిపారు. దీన్ని కోనాం శివారు దట్టమైన అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో చీడికాడ రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఇంత పొడవైన భయంకరంగా ఉన్న పామును గతంలో ఎన్నడూ చూడలేదని రైతులు తెలిపారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంటా శంకుస్థాపన



భీమిలి (చైతన్యరథం): భీమిలి సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. విశాఖకు వచ్చే ప్రాజెక్టుల్లో మూడో వంతు భీమిలి నియోజకవర్గంలోనే ఏర్పాటవుతున్నాయని ఉద్ఘాటించారు. 3, 4 వార్డుల్లో రూ. 2.25 కోట్ల విలువైన పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 3 వార్డు శ్మశాన వాటికల్లో రూ. 41 లక్షలతో తాగునీరు, విద్యుత్, టాయ్ లెట్ల నిర్మిస్తున్నామని, అలాగే 4 వార్డులో రూ. 1.83 కోట్లతో సెంట్రల్ మీడియన్ గ్రిల్స్, నేరెళ్ళవలస క్రిస్టియన్ శ్మశానవాటికలో తాగునీరు, విద్యుత్ వంటి ప్రాథమిక సదుపాయాలను కల్పిస్తున్నామని వివరించారు. 2014-19 మధ్యలో మంత్రిగా నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో రూ. 4,300 కోట్ల విలువైన పనులు చేపట్టామని, ఈసారి అంతకుమించిన అభివృద్ధి పనులు చేస్తానని హామీ ఇచ్చారు. రూ. 49 లక్షలతో ప్రతిపాదించిన గంట స్తంభం ఆధునికీకరణ పనులు మరో నెల రోజుల్లో పూర్తి కానున్నాయన్నారు. జోనల్ కమిషనర్ ఎం. విజయ్ కుమార్, ఎస్.ఈ. శాంతిరాజు, కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారి లక్ష్మి, గరే సదానంద, పాసి సుస్మిత, ఇప్పాక వరలక్ష్మి, ఎంపీపీ యరబాల కృష్ణవేణి, కూటమి నాయకులు గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర, గరే గుర్నాథ్, సి.టి. శంకర్, దండి వెంకటేష్, కనకల అప్పలనాయుడు, చురకల రమణ, కె. రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఈపీడీసీఎల్‌లో ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం

విశాఖపట్నం (చైతన్యరథం): భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) కార్పొరేట్ కార్యాలయంలో గురువారం 77వ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కార్పొరేట్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) & హెచ్ఐర్డీ) టి. వనజ అధికారులు, సిబ్బందితో కలిసి భారత రాజ్యాంగ పీఠికను చదివి వినిపించడంతో పాటు రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నడుచుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. డైరెక్టర్ (ఆపరేషన్స్) టి.వి. సూర్య ప్రకాష్, చీఫ్ జనరల్ మేనేజర్లు డి. సుమన్ కళ్యాణి, సాల్మన్ రాజు, మహేంద్రనాథ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాకినాడలో ఓటు హక్కును వినియోగించుకున్న రాజ్యసభ ఎంపీ సానా

● జెన్ జీ యువత ఓటింగ్‌లో చురుగ్గా పాల్గొనాలి

●మన ఓటు.. మన భవిష్యత్తు.. ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత



కాకినాడ (చైతన్యరథం): కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో భాగంగా, స్టేడియం రోడ్డులోని హౌసింగ్ బోర్డు కార్యాలయ భవనంలో ఏర్పాటు చేసిన 66/2 పోలింగ్ బూత్‌లో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పండుగలో భాగంగా తన ఓటు హక్కును వినియోగించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. "మన ఓటు.. మన భవిష్యత్తు.. ఓటు వేయడం మన బాధ్యత" అని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుగుతుండటం సంతోషకరమని అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో కాకినాడలో ప్రశాంత వాతావరణం నెలకొందని పేర్కొన్నారు. ప్రజలు ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఎన్నికల్లో చురుగ్గా పాల్గొంటున్నారని తెలిపారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ విధిగా వినియోగించుకోవడమే ప్రజాస్వామ్య విజయానికి తొలి మెట్టని ఎంపీ అన్నారు. ముఖ్యంగా జెన్ జీ యువత ఎన్నికల ప్రక్రియపై ఆసక్తి చూపుతూ పోలింగ్‌లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. యువత, మహిళలు, వృద్ధులు సహా అర్హులైన ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లొంగకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు వేయడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా భాగస్వాములు కావాలని ఎంపీ సానా సతీష్ బాబు కోరారు.

కాకినాడలో గల్లంతైన మత్స్యకారులు సురక్షితం

కాకినాడ (చైతన్యరథం): జిల్లాలో అదృశ్యమైన మత్స్యకారులు సురక్షితంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మత్స్యకారుల ఫోన్లు సిగ్నల్స్ అందుబాటులోకి వచ్చాయని వివరించారు. కాకినాడ జిల్లా సుబ్బంపేటకి చెందిన ఏడుగురు మత్స్యకారులు ఈ నెల 4న సముద్రంలో వేటకు వెళ్లారు. కాగా ఈ నెల 14 నుంచి కమ్యూనికేషన్ కట్ అయ్యింది. ఈ నెల 19వ తేదీ నుంచి బోటుతో పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. మత్స్యకారుల వద్ద ఉన్న మొబైల్ ఫోన్లతో పాటు బోటులోని ట్రాన్స్‌పాండర్ కూడా స్విచ్ ఆఫ్ అయింది. దీంతో జీపీఎస్ ద్వారా కూడా వారి ఆచూకీని గుర్తించడం సాధ్యం కాలేదు. అధికారులు ఈ నెల 20వ తేదీ నుంచి మత్స్యకారులు కోసం గాలిస్తున్నారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారుల కోసం ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టింది.

నౌకలు, హెలికాప్టర్లతో జల్లెడ : బోటు అదృశ్యమైన విషయం తెలియగానే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అప్రమత్తమైంది. మత్స్యకారులను సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి భారీ స్థాయిలో గాలింపు చర్యలు చేపట్టింది. కాకినాడ, చెన్నై, ఒడిశా కోస్ట్‌గార్డ్ అధికారుల సమన్వయంతో సముద్రంలో గాలింపు ముమ్మరంగా కొనసాగుతోంది. భారత నౌకాదళం (నేవీ), కోస్ట్‌గార్డ్ బృందాలు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించాయి.

విజయవాడలో అత్యాధునిక పీఎస్‌కే మోడల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

●ఎంపీ కేశినేని చిన్ని కృషికి కేంద్ర ప్రభుత్వం సానుకూల స్పందన... ఏర్పాటుకు రూ.50 లక్షల నిధులు మంజూరు



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ ప్రజలు ఆస్తుల రిజిస్ట్రేషన్ విషయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలనే లక్ష్యంతో తాను కేంద్ర మంత్రులను పలుమార్లు కలిసి చేసిన విజ్ఞప్తులకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) హర్షం వ్యక్తం చేశారు. భూ రికార్డుల ఆధునికీకరణ కార్యక్రమమైన DILRMP 3.0 & NAKSHA పథకాల పరిధిలో విజయవాడలో అత్యాధునిక పాస్‌పోర్ట్ సేవా కేంద్రం (PSK) తరహా మోడల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు మొదటి దశలో రూ.50 లక్షల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయడం ఎంతో సంతోషకరమని తెలిపారు. ఈ కార్యాలయం అందుబాటులోకి రావడం ద్వారా విజయవాడ ప్రజలకు ఆస్తుల రిజిస్ట్రేషన్ సేవలు మరింత సులభతరంగా, వేగవంతంగా, పారదర్శకంగా అందనున్నాయని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సేవలు అందుబాటులోకి రావడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించాలనే లక్ష్యంతో తాను చేసిన నిరంతర ప్రయత్నాలకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయడం విజయవాడ అభివృద్ధికి మరో ముందడుగుగా అభివర్ణించారు. ఈ సందర్భంగా తన విజ్ఞప్తిని మన్నించి విజయవాడకు నిధులు మంజూరు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేంద్ర గ్రామీణ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ,సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు విజయవాడ ప్రజల తరఫున ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మెరుగైన ప్రభుత్వ సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎంపీ చిన్ని స్పష్టం చేశారు.

ఏపీకి మళ్లీ వర్ష సూచన... నేడు పలు జిల్లాల్లో వర్షాలు



అమరావతి (చైతన్యరథం): ఏపీని మరోసారి వర్షాలు పలకరించబోతున్నాయి. తాజాగా నెల రోజుల గ్యాప్ లోనే మూడు తుఫాన్లు ఎదుర్కొన్న ఆంధ్రప్రదేశ్ కు మరోసారి వర్ష సంకేతాలు అందుతున్నాయి. ఈ మేరకు నేడు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. రాష్ట్రంలోని ఏయే జిల్లాల్లో రేపు వర్షాలు కురవబోతున్నాయో వివరాలను వెల్లడించింది. అలాగే గురువారం సాయంత్రం వరకూ వివిధ జిల్లాల్లో కురిసిన వర్షాల వివరాలను కూడా విడుదల చేసింది. రాష్ట్రంలో నేడు అంటే శుక్రవారం నెల్లూరు, కర్నూలు, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ సిఈవో ప్రఖర్ జైన్ తెలిపారు. మిగతా జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే సమయంలో చెట్ల క్రింద నిలబడరాదని ప్రజలకు సూచించారు. ఈ మేరకు వర్షాలు కురిసే జిల్లాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు. మరోవైపు గురువారం సాయంత్రం 5 గంటల నాటికి గుంటూరు జిల్లా తెనాలిలో 29.4మిమీ, నెల్లూరు జిల్లా, ఇందుకూరుపేటలో 25మిమీ, తిరుపతి జిల్లా, పుత్తూరులో 21మిమీ, గుంటూరు జిల్లా వడ్లమూడిలో 20.8మిమీ, నెల్లూరు రూరల్‌లో 20మిమీ చొప్పున వర్షపాతం నమోదైందని అధికారులు ప్రకటించారు. బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల పంటలకు పెద్దగా నష్టం ఉండకపోవచ్చని అంచనా. ఇప్పటికే తుఫాన్ల వల్ల భారీ ఎత్తున పంటలు నష్టపోయిన రాష్ట్ర రైతులకు ఈ వర్షాలతో ఇబ్బందులు ఉండవల్ల సంకేతాలు వెలువడుతున్నాయి. దీంతో ఆ మేరకు రైతులకు ఊరట కలిగించే విషయం.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి: దేవినేని ఉమా

●గొల్లపూడిలో 268వ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ మంత్రి



విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న తొలి దశ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా విజయవాడ రూరల్ పరిధిలోని గొల్లపూడి పంచాయితీ సాయిపురం కాలనీలో 268వ బూత్‌లో మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఓటు వేయడం ప్రతి పౌరుడి హక్కుతో పాటు బాధ్యత అని పేర్కొన్నారు. మన ప్రాంత అభివృద్ధి, భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో చురుకుగా పాల్గొని తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ఓటు హక్కు వినియోగించుకున్న 93 ఏళ్ల వృద్ధుడు... పలువురికి ఆదర్శంగా నిలిచిన రామబ్రహ్మం



అమరావతి (చైతన్యరథం): ఏపీలో తొలిదశ పంచాయతీ ఎన్నికలు గురువారం ఉదయం ప్రశాంతంగా జరిగాయి. తమ ప్రాంతాల్లో ఓటు ఉన్న వారంతా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తమ నాయకున్ని ఎన్నుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద లైన్లలో నిలబడి ఓటు వేసేందుకు మొగ్గు చూపారు. ఉదయం నుంచే ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ప్రతి ఎక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఓటు హక్కును 18 ఏళ్ల వయస్సు నుంచి వృద్ధుల వరకూ ప్రతి ఒక్కరూ వినియోగించుకోవచ్చు. అయితే కొందరు సిటీల్లో ఉద్యోగాల్లో బిజీ లైఫ్‌ని గడుపుతున్నారు. మరికొందరు తమ వ్యక్తిగత పనుల్లో నిమగ్నమైపోయి ఓటు హక్కును వదులుకుంటున్నారు. ఇంకొందరు ఎలాగైనా ఓటు హక్కును వినియోగించుకోవాలని నగరాల నుంచి బయలుదేరి, ప్రయాణాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చి ఓటు వేస్తున్నారు. ఇదిలావుంటే ఈ ప్రజాస్వామ్య పండుగలో వయసు అడ్డంకి కాదని నిరూపించారు కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరుకు చెందిన 93 ఏళ్ల వృద్ధుడు. అడుసుమిల్లి రామబ్రహ్మం వయోభారాన్ని సైతం లెక్క చేయకుండా పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఆయన ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చాటి చెప్పి, పలువురికి ఆదర్శంగా నిలిచారు.

టీడీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు మాతృవియోగం



విజయవాడ (చైతన్యరథం): మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు సతీమణి, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ మాతృమూర్తి హైమావతి నందిగామ మండలం ఐతవరంలో కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె స్వగృహంలోనే తుది శ్వాస విడిచారు. ఆమెకు కుమారుడు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. హైమావతి మృతి పట్ల పలువురు టీడీపీ నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం ఖాయం : రావిపాటి సాయికృష్ణ



మంగళగిరి (చైతన్యరథం): తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లోని అన్ని వార్డుల్లో కూటమి బలపరిచిన మేయర్ మరియు అభ్యర్థులు అఖండ విజయం ఖాయం అని గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ ఆకాంక్షించారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా మంగళగిరిలోని 16వ వార్డులో రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు మదనపల్లి మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి శ్రీరామ్ చినబాబుతో కలిసి గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మదనపల్లి మున్సిపల్ చైర్మన్‌గా గెలుపొంది బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీరామ్ చినబాబుని మర్యాదపూర్వకంగా కలిసి గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ సత్కరిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

అర్జీ ఇచ్చింది.. ఇస్త్రీ బండి వచ్చింది... ఇస్త్రీ బండి పాడైదంటూ ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే నసీర్‌కు అర్జీ

●జీవనాధారం లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళ ఆవేదన

●వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నసీర్... సొంత నిధులతో మహిళకు ఇస్త్రీ బండి అందజేత



గుంటూరు (చైతన్యరథం): 'అయ్యా.. మేము ప్రాంతానికి చెందిన వారమై ఇస్త్రీ బండి పెట్టుకుని బతుకుతున్నాం. ఇప్పుడు ఆ బండి పాడైపోవడంతో ఏ పనులు చేతగాక ఇబ్బందులు పడుతున్నాం. మమ్మల్ని మీరే ఆదుకోవాలయ్యా' అని ప్రజాదర్బార్ రో 11వ వార్డుకు చెందిన పార్వతి అర్జీ ఇవ్వడంతో ఎమ్మెల్యే నసీర్ వెంటనే స్పందించారు. ఇస్త్రీ బండి అందించి ఆదుకునే బాధ్యత నాది అంటూ భరోసా కల్పించారు. ఇంత మంది ప్రజలు వస్తున్నారు..తమ గురించి ఎమ్మెల్యే ఆలోచిస్తారో లేదో అనుకుంటూ అప్పటికి ఆమె వెనుదిరిగారు. కేవలం పది రోజుల వ్యవధిలోనే పార్వతికి ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఫోన్ రావడంతో ఆమె ఆనందానికి అవధుల్లేవు. భార్యాభర్తలను బుధవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయానికి పిలిపించి ఎమ్మెల్యే నసీర్ చేతుల మీదుగా ఇస్త్రీ బండి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో పార్వతి తమకు ఇస్త్రీ బండి జీవనాధారమని తెలిపడంతో అందించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తన సొంత నిధులతో ఆ కుటుంబానికి ఇస్త్రీ బండి అందించడం సంతోషంగా ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో బీసీ వర్గాలకు మేలు చేసేలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వారి కాళ్లపై నిలబడేలా ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో కేవలం రూ.3 వేలు ఉన్న పింఛన్‌ను రూ.4 వేలకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పేద వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని చెప్పారు. ప్రజాదర్బార్‌కు వచ్చే అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అధికార యంత్రాంగం పరిధిలోని సమస్యలను సంబంధిత కార్యాలయాలకు పంపిస్తున్నామని చెప్పారు. ప్రతి అర్జీకి జవాబుదారీగా ఉండేలా ప్రణాళికబద్ధంగా పని చేస్తున్నామన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రతి డివిజన్‌లో కార్పొరేటర్లు తమ పరిధిలోని సమస్యలను తెలుసుకునేలా సూచనలిచ్చామని తెలిపారు. అనంతరం ఇస్త్రీ బండి అందుకున్న పార్వతి మాట్లాడుతూ ప్రతి రోజూ ఇస్త్రీ బండి వేస్తేనే కుటుంబం గడిచేదని, కొద్ది రోజులుగా బండి దెబ్బతినడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని చెప్పారు. ప్రస్తుతం ఇస్త్రీ బండి అందించిన ఎమ్మెల్యే నసీర్ కు, 11వ వార్డు కార్పొరేటర్ అహ్మద్‌కు రుణపడి ఉంటామని తెలిపారు. ప్రజాదర్బార్ అర్జీ ఇచ్చిన వెంటనే స్పందించినందుకు ధన్యవాదాలు చెప్పారు.

మంగళగిరిలో వైసీపీ దొంగ ఓట్లు... అడ్డుకున్న టీడీపీ ఏజెంట్లు



గుంటూరు (చైతన్యరథం): మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఉద్రిక్తత నెలకొంది. 62వ డివిజన్ పోలింగ్ కేంద్రంలో వైసీపీ శ్రేణులు కొందరితో దొంగ ఓట్లు వేయించేందుకు యత్నించాయి. ఈక్రమంలో వారిని టీడీపీ పోలింగ్ ఏజెంట్లు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అప్పటికే కొన్ని దొంగ ఓట్లు వేసినట్లు అధికారులు గుర్తించారు. ఇరుపార్టీ నేతల వాగ్వాదంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

పోలింగ్ బూత్‌లోకి వెళ్లేందుకు యత్నించిన వేమారెడ్డి..

మరో వైపు పోలింగ్ బూత్‌లోకి వెళ్లేందుకు యత్నించిన వైసీపీ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. 1వ డివిజన్లో తాను చీఫ్ ఏజెంట్ను లోపలికి వెళ్లేందుకు యత్నించిన వైసీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జ్ టి. వేమారెడ్డిని పోలీసులు నిలువరించారు. ఒకానొక దశలో పోలీసులను నెట్టుకుని వెళ్తుండగా అడ్డగించారు. పోలీసులకు వేలు చూపించి మాట్లాడటంతో బలవంతంగా బయటకు నెట్టేశారు. ప్రశాంతంగా ఎన్నికలు జరుగుతున్న ప్రాంతంలో మాజీ నేతలకు ఏం పని అని నిలదీశారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు సరికొత్త దిశానిర్దేశం... విజయవాడలో ఘనంగా ఫౌండ్ హర్ - 2026



విజయవాడ (చైతన్యరథం): పారిశ్రామికవేత్త కావాలనుకునే మహిళలకు కొత్త దిశను చూపిస్తూ విజయవాడలో నిర్వహించిన 'ఫౌండ్ హర్-2026' సదస్సు విజయవంతమైంది. ఇంటి వద్ద నుంచి చిన్న వ్యాపారాలు చేసే స్థాయికి, ఆ తర్వాత ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎలా ఎదగాలి అనే అంశంపై వ్యాపార, వైద్య, విద్య, సినీ రంగాల నిపుణులు కీలక సూచనలు చేశారు. 'హర్ ఆంబిషన్ అవర్ షేర్డ్ విజన్' థీమ్‌తో జరిగిన ఈ సదస్సులో పెట్టుబడులు ఎలా సాధించాలి? స్టార్టప్‌లు ఎలా పట్టాలెక్కించాలి? అనే అంశాలపైనా మార్గనిర్దేశం చేశారు. మహిళల్లో దాగున్న వ్యాపార ఆలోచనలు, ఆశయాలకు అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా విజయవాడ వివంతా హోటల్ వేదికగా 'ఫౌండ్ హర్ ఆంధ్రప్రదేశ్-2026' సదస్సు నిర్వహించారు. చిన్న ఆలోచనతో మొదలయ్యే వ్యాపారం పట్టుదల, ప్రణాళిక, నాయకత్వంతో ఉపాధి కల్పించే సంస్థగా ఎదగొచ్చు అనే అంశంపై తొలి చర్చ సాగింది. మహిళలు కేవలం వ్యాపార నిర్వాహకులుగానే కాకుండా ఉద్యోగాలు సృష్టించే లీడర్లుగా ఎదగాలని నిపుణులు సూచించారు. వ్యాపారంలోని సవాళ్లను అధిగమిస్తూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించడానికి అవసరమైన దృక్పథం, నాయకత్వ లక్షణాలపై దిశానిర్దేశం చేశారు. వారసత్వంగా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటు సొంత ప్రతిభతో ఎదగాలని మార్గనిర్దేశం చేశారు. మహిళా నాయకత్వం : వ్యాపారంలో రాణించాలంటే సరైన రంగాన్ని ఎంచుకోవడం, పెట్టుబడుల సమీకరణ ఎంతో ముఖ్యమని నిపుణులు అభిప్రాయపడ్డారు. వినూత్న ఆలోచనలకు నిధులు సమకూర్చుకుని లాభదాయక సంస్థలుగా మలిచే విధానాలపై సలహాలిచ్చారు. విజయవాడను హెల్త్‌కేర్ హబ్‌గా మార్చే అంశంపై కమల్ కృష్ణన్ మోడరేటర్‌గా జరిగిన చర్చలో మహిళా నాయకత్వం, ఆసుపత్రుల విస్తరణ ఆవశ్యకతను డాక్టర్ సౌమ్య మేడారమెట్ల, డాక్టర్ మణి అక్కినేని, డాక్టర్ శ్రీముఖి అనుమోలు అభిప్రాయాలు పంచుకున్నారు. మరోవైపు 'ఫ్రమ్ ఇండియా టూ వెంచర్' వర్క్‌షాప్ ద్వారా ఆలోచనలకు ఆచరణలోకి తెచ్చే విధానాలపైనా అవగాహన కల్పించారు. సరైన వేదిక నిపుణుల మార్గదర్శకత్వం, పెట్టుబడులపై స్పష్టతతో ఫౌండ్ హర్ సదస్సు మహిళల్లో కొత్త స్ఫూర్తిని నింపింది.

రాజకీయాలను కేవలం అధికారం కోసం కాకుండా ప్రజలకు సేవ చేసే మార్గంగా భావించి, తెలుగు రాష్ట్రాల సమగ్రాభివృద్ధికి పాటుపడటం : పార్టీ సిద్ధాంతం

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రతి జిల్లాలో టాస్క్‌ఫోర్స్ : అబ్దుల్ అజీజ్

●ప్రతి జిల్లాకు ఒక టాస్క్‌ఫోర్స్ వాహనం

●తొలి దశలో ఐదు బొలెరో వాహనాల కొనుగోలు చేశామని వెల్లడి



నెల్లూరు (చైతన్యరథం): వక్ఫ్ ఆస్తుల ఆక్రమణలపై సమాచారం అందిన వెంటనే స్పందించేందుకు ప్రతి జిల్లాలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంకల్పం, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టామన్నారు. కొన్ని ప్రాంతాల్లో వక్ఫ్ భూములను పరిశీలించేందుకు సిబ్బంది 100 నుంచి 150 కిలోమీటర్ల వరకు ప్రయాణించాల్సి వస్తోందని అజీజ్ తెలిపారు. అత్యవసర సమయంలో బస్సులు, అద్దె వాహనాల కోసం వేచి ఉండకుండా బృందాలు వెంటనే అక్కడికి చేరుకునేందుకు 10 జిల్లాలకు ఒక్కో వాహనం చొప్పున సమకూర్చాలని నిర్ణయించామని, తొలి దశలో ఐదు బొలెరో వాహనాలను కొనుగోలు చేశామని వివరించారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణను తరతరాలుగా చూసుకుంటున్నంత మాత్రాన వాటిని విక్రయించే హక్కు రాదని చైర్మన్ స్పష్టం చేశారు. వక్ఫ్ భూములని తెలియక స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకున్న కుటుంబాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, బోర్డు హక్కులను కాపాడుతూ నిబంధనల ప్రకారం అద్దె ప్రాతిపదికన అక్కడే నివసించే అవకాశం కల్పించే అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి ఫరూక్ లతో చర్చిస్తామన్నారు. మతంతో సంబంధం లేకుండా అర్హులైన వారందరూ నిబంధనల ప్రకారం వక్ఫ్ వ్యవసాయ భూములను లీజుకు, దుకాణాలను అద్దెకు తీసుకోవచ్చని అజీజ్ తెలిపారు. వక్ఫ్ ఆస్తులను కాపాడి, వాటి ఆదాయాన్ని పెంచి, పేద ముస్లింల విద్య, ఉపాధి అవకాశాలకు, మసీదులు, దర్గాల అభివృద్ధికి వినియోగించడమే బోర్డు లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ వక్ఫ్ బోర్డ్ సీఈవో అబ్దుల్ ఖాదర్, జిల్లా ఇన్స్పెక్టర్ ఖుదావన్, కార్పొరేటర్ లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పొదలకూరులో వైసీపీకి బిగ్ షాక్... సోమిరెడ్డి సమక్షంలో పార్టీలోకి చేరికలు



సర్వేపల్లి (చైతన్యరథం): నియోజకవర్గంలోని పొదలకూరులో వైసీపీ బిగ్ షాక్ తగిలింది. వైసీపీ సీనియర్ నాయకులు ఊకోటి లక్ష్మీనారాయణ, సన్నికంటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో 150 కుటుంబాలు గురువారం టీడీపీలో చేరారు. ఊకోటి లక్ష్మీనారాయణ, సన్నికంటి శ్రీనివాసులుతో పాటు ఊకోటి భాస్కర్, ఆడిగొప్పుల మారుతి, చింతగింజల సురేంద్ర తదితరులను నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ... సమష్టి నిర్ణయంతో కాసా శ్రీనివాసులును పొదలకూరు సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిపామని, కాసా కుటుంబం 40 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తోందన్నారు. ఆత్మకూరు, కోవూరు తదితర నియోజకవర్గాల్లో పంచాయతీలను ఏకగ్రీవం చేసుకుంటున్నారని, ఏకగ్రీవం అయితే ఒక్కో పంచాయతీకి జనాభా ఆధారంగా ప్రభుత్వం రూ.15 లక్షలు, రూ.25 లక్షలు, రూ.50 లక్షలు చొప్పున ప్రోత్సాహకాలు అందజేస్తోందన్నారు. పొదలకూరు పంచాయతీ ఏకగ్రీవం అయితే రూ.50 లక్షలు వచ్చే అవకాశం ఉందని, కానీ సర్వేపల్లిలో తోడేరు రెడ్డి ఏకగ్రీవాలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని, ప్రతి పంచాయతీలో, ప్రతి వార్డులో పోటీ ఉండాలంటూ హుకూం జారీ చేశారని, పోటీల పేరుతో ఊళ్లలో తన్నుకోవాలి... నాయకులు ఆస్తులు అమ్ముకోవాలి...అప్పుల పాలుకావాలి.. కక్షలు పెంచుకోవాలన్నదే వైసీపీ నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్య ఉద్దేశమని మండిపడ్డారు. కాకాణి కుటుంబానికి రాజకీయ భిక్ష పెట్టిన పొదలకూరుకు ఏం చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పొదలకూరులోని జెడ్పీ హైస్కూళ్లలో విద్యార్థులకు మరుగుదొడ్డి కట్టించలేని వ్యక్తి జిల్లా పరిషత్ చైర్మన్‌గా, రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా చేసి ఉపయోగమేంటని ప్రశ్నించారు.

టీడీపీ హయాంలోనే అభివృద్ధి సాధ్యం

తాను ఎమ్మెల్యే అయ్యాకనే రూ.16 లక్షలతో 18 మరుగుదొడ్లు, రెండు హైస్కూళ్లలో రూ.48 లక్షలతో డైనింగ్ హాల్స్ నిర్మించామని, బాలికల హైస్కూలుకు నాబార్డు నిధులు రూ.1 కోటి మంజూరు చేయించామన్నారు. 2014లో పొదలకూరు మండలంతో తగ్గిన ఓట్లతో తాను ఓడిపోవడం జరిగిందని అయినా... అభివృద్ధి విషయంలో ఎక్కడ వెనకడుగు వేయలేదని సోమిరెడ్డి పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్చి అధునాతన భవనాలు, నిమ్మ యార్డు రూ.24 కోట్లతో నిర్మించామని, పెద్దఎత్తున సిమెంట్ రోడ్ల నిర్మాణంతో పాటు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, అన్న క్యాంటీన్ ద్వారా నాణ్యమైన భోజనం అందించామన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం రాగానే సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏడు మండలాల ప్రజలకు ఉపయోగపడేలా డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయించాను..రూ.2 కోట్లతో ప్రత్యేక భవనం కట్టించబోతున్నామని తెలిపారు. రూ.1.50 కోట్లతో పొదలకూరు పట్టణమంతా సోలార్ లైట్లు ఏర్పాటు చేయించాం...రూ.1.90 కోట్లు నుడా నిధులతో సెంట్రల్ లైటింగ్ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో 8,9 తరగతులు చదివే విద్యార్థినులకు గత ఏడాది సుమారు 1900 సైకిళ్లు పంపిణీ చేశాం. డిసెంబర్‌లో మరో 2 వేల సైకిళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. సోమశిల దక్షిణ కాలువ పెండింగ్ పనులను పూర్తి చేయించే బాధ్యత తాను తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. టీడీపీ హయాంలోనే అభివృద్ధి సాధ్యమని, వైసీపీ పాలనలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం జరగలేదన్నారు.

గాటీ పోలింగ్ కేంద్రం వద్ద ఘర్షణ - జుట్టుపట్టుకుని కొట్టుకున్న మహిళలు



కాకినాడ (చైతన్యరథం): రాష్ట్రంలో మలివిడత మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా గురువారం 23 పట్టణ స్థానిక సంస్థలకు పోలింగ్ నిర్వహించారు. మేయర్ స్థానాలకు 36 మంది, ఛైర్‌పర్సన్ స్థానాలకు 134 మంది పోటీపడ్డారు. మొత్తం 964 డివిజన్లు, వార్డుల్లో 2968 మంది బరిలో ఉన్నారు. ఈ క్రమంలోనే పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల ఓటింగ్ సందర్భంగా గాటీ పోలింగ్ కేంద్రం వద్ద మహిళలు గొడవకు దిగారు. ఓటేసేందుకు వచ్చిన ఓటర్లను తమకే ఓటు వేయాలంటూ వైసీపీ, కూటమి మద్దతుదారుల వారు కోరడంతో వివాదం మొదలైంది. ఈ క్రమంలో రెండు వర్గాలకు చెందిన మహిళల మధ్య వాగ్వాదం కాస్తా తోపులాటకు దారి తీసింది. అది కాస్తా మాటామాటా పెరగడంతో ఒకరినొకరు జుట్టు పట్టుకుని కొట్టుకున్నారు. దీంతో పోలింగ్ కేంద్రం వద్ద కాసేపు ఉద్రిక్తత నెలకొంది. ఈ నేపథ్యంలోనే పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

శివరాంపురంలో వైసీపీకి భారీ షాక్.. టీడీపీలో చేరిన 45 కుటుంబాలు

● గొట్టిపాటి లక్ష్మీ సమక్షంలో పసుపు కండువాలు కప్పుకున్న వైసీపీ నేతలు



దర్శి (చైతన్యరథం): నియోజకవర్గం, తాళ్లూరు మండలం, శివరాంపురం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గ్రామానికి చెందిన 45 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి దర్శి టీడీపీ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మీ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. దర్శి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శివరాంపురం గ్రామ టీడీపీ నాయకుల సమక్షంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మీ వారికి పార్టీ కండువాలు కప్పి, సాదరంగా తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధికి, గ్రామ అభ్యున్నతికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆమె ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, కూటమి ప్రభుత్వ పాలనపై విశ్వాసంతో పార్టీలో చేరిన వారందరికీ తగిన గుర్తింపు, గౌరవం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్రాంతి పండుగ వేళ ఉత్తరాంధ్రకు ప్రత్యేక రైళ్లు



అమరావతి (చైతన్యరథం): సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. పండుగ సమయంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 30 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. సికింద్రాబాద్, చర్లపల్లి, హైదరాబాద్ నుంచి పార్వతీపురం, శ్రీకాకుళం రోడ్, నర్సాపురం తదితర ప్రాంతాలకు ఈ ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉండనున్నాయి. ఈ రైళ్లలో సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే శాఖ వెల్లడించింది.

నడికుడి-శ్రీకాళహస్తి రూట్‌లో కొత్త రైల్వేస్టేషన్‌లు రెడీ... ఆ రైలు కోసం స్థానికుల ఎదురు చూపులు



నడికుడి–శ్రీకాళహస్తి రైలు మార్గంలో కనిగిరి వరకు పనులు పూర్తయ్యాయి. దీంతో స్థానికులు రైలు సర్వీసుల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టులో రైళ్లు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని చర్చ జరిగినా.. ఇప్పటి వరకు అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. గుంటూరు నుంచి కనిగిరి వరకు రైలు నడిపితే బాగుంటుందని స్థానికులు అంటున్నారు. రైళ్లు నడపటంపై అధికారులు స్పందించాలని దర్శి, కనిగిరి ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పెండింగ్ రైల్వే ప్రాజెక్టులపై కేంద్రాన్ని సంప్రదించి పనుల్ని వేగవంతమయ్యేలా చూస్తోంది. నడికుడి నుంచి శ్రీకాళహస్తికి కొత్త రైలు మార్గం పనులు ఈ రెండున్నరేళ్లలో వేగవంతం అయ్యాయి.. నడికుడి నుంచి కనిగిరి వరకు ట్రాక్ పనులు పూర్తిచేశారు. కొత్త రైల్వేస్టేషన్‌లు కూడా సిద్ధం కావడంతో కనిగిరి వరకు రైళ్లను నడపాలని ఎప్పటి నుంచో డిమాండ్ వినిపిస్తోంది. కనిగిరి వరకు రైల్వే లైన్ సిద్ధం కావడంతో రైల్వే అధికారులు ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. గుంటూరు నుంచి కనిగిరి రైలు సర్వీసు ప్రారంభమవుతుందని ప్రచారం జరిగినా.. ఇప్పటి వరకు ఆ దిశగా అడుగులు పడలేదు. గతంలో అధికారులు దర్శి, కనిగిరి వరకైనా రైలును నడుపుతామని చెప్పారు.. ఆ తర్వాత ఆగస్టు నెలలో ఖాయమని ప్రచారం జరిగింది. ఏకంగా రైలు షెడ్యూల్ కూడా ప్రకటించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి రైల్వే అధికారుల్ని కలిసి రైలు సర్వీసుపై విన్నవించినా ఫలితం లేకుండా పోయింది.

నడికుడి నుంచి శ్రీకాళహస్తి రైలు మార్గంలో.. నడికుడి నుంచి కనిగిరి వరకు ట్రాక్ పనులు జనవరి నెల నాటికే పూర్తయ్యాయి. దర్శి, పొదిలి, కనిగిరి కొత్త రైల్వే స్టేషన్‌లు పూర్తయ్యాయి. కాకపోతే ఈ రైల్వే స్టేషన్లకు కోడ్ నంబర్లు ఇప్పటి వరకు ఇవ్వలేదని చెబుతున్నారు.. ఈ కారణంగా కూడా రైళ్లు నడపటం లేదనే చర్చ జరుగుతోంది. విశాఖ దక్షిణ కోస్తా రైల్వేజోన్ ప్రక్రియకు సంబంధించి ప్రక్రియ కారణమని చెప్పారు.. కానీ ఆ జోన్ కూడా ప్రారంభమైంది.. కానీ రైళ్లు నడపటంపై మాత్రం నిర్ణయం తీసుకోలేదు. దీంతో దర్శి, పొదిలి, కనిగిరి ప్రాంతవాసులు రైళ్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది కాకపోయినా వచ్చే ఏడాదినాటికైనా రైళ్లు నడపాలని కోరుతున్నారు.

రెండు జిల్లాల్లో పనులు పెండింగ్

పల్నాడు ప్రాంతంలోని నడికుడి నుంచి తిరుపతి జిల్లాలలోని శ్రీకాళహస్తి వరకు మొత్తం 309 కిలోమీటర్ల పరిధిలో రైల్వే పనులు చేపట్టారు. మొత్తం ఐదు దశల్లో ఈ రైలు మార్గం పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఒకటి, రెండు దశలు పూర్తికాగా.. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో మూడు, నాలుగో దశ పనులు ముగింపు దశలో ఉన్నాయి. ప్రకాశం జిల్లా పరిధిలోని ట్రాక్ 145 కి.మీ నిర్మాణం గార్లపేట వరకు పూర్తయ్యింది. ప్రస్తుతం గౌతువారిపల్లి, గార్లపేట రైల్వేస్టేషన్ పనులు ముగింపు దశలో ఉన్నాయి. పేరంగడిపల్లి దగ్గర నేషనల్ హైవే పనులు పూర్తిచేస్తే రైల్వే బ్రిడ్జి పనులు చేపట్టనున్నారు. కనిగిరి వరకు ఈ పనులు పూర్తయ్యాయి కాబట్టి అక్కడి వరకు రైలు నడిపితే తమకు సౌకర్యవంతంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. నడికుడి నుంచి శ్రీకాళహస్తి వరకు రైళ్లు నడిపితే హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లే ప్రయాణికులకు ఉపయోగంగా ఉంటుంది.

ఓటు హక్కు వినియోగించుకున్న 106 ఏళ్ల వృద్ధుడు



ఆంధ్రప్రదేశ్ పంచాయతీ ఎన్నికల తొలిదశ ఓటింగ్‌లో ఆసక్తికర సంఘటన జరిగింది. అనంతపురం జిల్లా వెస్ట్ కోడిపల్లి గ్రామంలో 106 ఏళ్ల వృద్ధుడు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. వృద్ధాప్యంలోనూ ఆయన ఓటు వేయడం అందరి దృష్టిని ఆకర్షించింది.

ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ వాహనంపై దాడి



ఆళ్లగడ్డ (చైతన్యరథం): పంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా నంద్యాల జిల్లా అహోబిలంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వాహనంపై వైసీపీ మద్దతుదారులు దాడి చేశారు. దీంతో వాహనం అద్దాలు పగిలిపోయాయి. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య రాళ్లదాడి జరిగింది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు అదనపు బలగాలను రప్పించారు. జిల్లా ఎస్పీ, పోలీసు అధికారులు అహోబిలం చేరుకున్నారు. మరోవైపు ఆళ్లగడ్డ మండలం జమ్మదిన్నెలోనూ ఉద్రిక్తత నెలకొంది. వైసీపీ మద్దతుదారులు రిగ్గింగ్ చేస్తున్నారంటూ టీడీపీ వర్గీయులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఘర్షణ జరిగింది. పోలింగ్ కేంద్రం వద్ద కారంపొడి చల్లుకుని ఇరువర్గాలు పరస్పరం దాడికి పాల్పడ్డాయి. దీంతో అక్కడ పోలింగ్ తాత్కాలికంగా నిలిచిపోయింది.

జగన్ సొంతూరిలో టీడీపీ జెండా రెపరెపలు



సింహాద్రిపురం (చైతన్యరథం): వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ సొంత గ్రామమైన వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం బలపనూరు పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ జెండా రెపరెపలాడింది. ఇక్కడ కూటమి మద్దతుతో బరిలో నిలిచిన కొత్తరెడ్డి అనిల్‌కుమార్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 4 దశాబ్దాల తర్వాత ఈ పంచాయతీలో టీడీపీ బలపరిచిన అభ్యర్థి సర్పంచిగా ఎన్నిక కావడం విశేషం. పులివెందుల నియోజకవర్గంలోని బలపనూరు వైఎస్ జగన్ సొంత గ్రామం కావడంతో ఈ పంచాయతీ ఎన్నికలపై మొదటి నుంచీ రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఇక్కడ 2,269 మంది ఓటర్లుండగా, సర్పంచి ఎన్నికలు ఎప్పుడూ హోరాహోరీగా జరిగేవి. ఈసారి వైసీపీ మద్దతుదారులెవరూ కనీసం నామినేషన్ వేసేందుకూ ముందుకు రాలేదు. ఇటీవలి ఎంపీటీసీ ఎన్నికల్లో ఈ గ్రామం ఉండే ఎంపీటీసీ స్థానంలో అనిల్‌కుమార్‌రెడ్డి కుటుంబానికే చెందిన కొత్త రెడ్డి రవిచంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం మరో విశేషం. సర్పంచి, ఎంపీటీసీ స్థానాలు రెండూ ఒకే కుటుంబానికి దక్కాయి. సింహాద్రిపురం మండలంలో 20 పంచాయతీలకు 18 చోట్ల కూటమి మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కన్నీరు పెట్టుకున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

●పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే తనపై దాడి జరిగిందని ఆవేదన వ్యక్తం



నంద్యాల (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా అహోబిలంలో ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ కారుపై దాడి జరిగింది. ఈ ఘటనలో వాహనం అద్దాలు పగిలిపోయాయి. అనంతరం రెండు వర్గాల మధ్య రాళ్ల దాడి జరిగినట్టు తెలుస్తుంది. పోలీసులు అదనపు బలగాలను రప్పించి ఈ వివాదాన్ని అదుపు చేసినట్టు సమాచారం. అంతేకాదు జిల్లా ఎస్పీ, పోలీసు అధికారులు అహోబిలం చేరుకున్నారు. పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొనసాగుతున్న టైమ్‌లో అహోబిలం దగ్గర టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కారుతో వైసీపీ మద్దతుదారులపైకి దూసుకొచ్చారని ఆ వర్గీయులు చెబుతుంటే, లేదు కారుపై వైసీపీ వాళ్లే దాడి చేశారని భూమా అఖిలప్రియ వర్గం ఆరోపిస్తుంది. అయితే ఇరు వర్గాల మధ్య జరిగిన ఈ ఘర్షణలో కొంతమందికి గాయాలైనట్టు తెలుస్తుంది. ప్రధానంగా భూమా అఖిలప్రియ డ్రైవర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో ఆస్పత్రికి తరలించారు. దీంతో అఖిలప్రియ ఘటనా స్థలంలో భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ దాడికి పోలీసుల వైఫల్యమే కారణమని ఆమె విమర్శించారు. ఈ ప్రాంతంలో దాడులు జరిగే అవకాశం ఉందని తాము వారం రోజుల ముందే పోలీసులకు తెలియజేశామని, అయినా వారు పట్టించుకోలేదని ఆమె మండిపడ్డారు. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఇంతటి దారుణం జరిగిందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా పోలీసుల సమక్షంలో వైసీపీ కార్యకర్తలు దాడులు చేస్తుంటే ఏమనాలి? అని ఆమె సూటిగా ప్రశ్నించారు.

ఏపీ మద్యం దుకాణాల్లో బార్‌కోడ్ స్కానర్లు.. స్కాన్ చేశాకే బాటిల్ విక్రయం



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో మద్యం విక్రయాల విధానంలో పారదర్శకత పెంచేందుకు, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కీలక మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటివరకు మద్యం దుకాణాల్లో బాటిళ్లను నేరుగా విక్రయిస్తుండగా, ఇకపై ప్రతి బాటిల్‌ను బార్‌కోడ్ స్కానర్ ద్వారా స్కాన్ చేసిన తర్వాతే కస్టమర్లకు అందించే కొత్త వ్యవస్థను తీసుకురానున్నట్లు సమాచారం. సూపర్ మార్కెట్ల బిల్లింగ్ తరహాలో అమలు చేయబోయే ఈ విధానంలో బాటిల్ స్కాన్ చేయగానే బ్రాండ్, ధర వివరాలు స్క్రీన్‌పై కనిపించడంతో పాటు స్పీకర్ ద్వారా కూడా వినిపించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనివల్ల నిర్ణీత ధర కంటే ఎక్కువ వసూలు చేసే మోసాలకు అడ్డుకట్ట పడుతుందని, మద్యం విక్రయ వేళలకు (ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు) అనుగుణంగా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో మెషిన్లు పనిచేసేలా రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ బార్‌కోడ్ స్కానింగ్ విధానం వల్ల ఎక్సైజ్ శాఖకు విక్రయాలు, స్టాక్‌పై పూర్తి స్థాయి పర్యవేక్షణ లభించనుంది. ఏ షాపులో ఎంత మద్యం అమ్ముడైంది, ఏ బ్రాండ్‌కు డిమాండ్ ఉంది, ఎంత స్టాక్ మిగిలి ఉంది వంటి వివరాలు ఎప్పటికప్పుడు తెలుస్తాయి. రికార్డుల ప్రకారం ఉన్న స్టాక్‌కు, వాస్తవ నిల్వలకు తేడా వస్తే అధికారులకు వెంటనే సమాచారం అందేలా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నారు. స్కాన్ చేయకుండా బాటిళ్లను విక్రయిస్తే నిర్వాహకులు వివరణ ఇవ్వాల్సి ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధించే అవకాశం ఉందని సమాచారం.

మెషిన్ల అద్దె భారం.. గత ప్రయత్నాల నేపథ్యం:

ఆప్‌స్టెక్ సంస్థ ద్వారా సరఫరా చేయనున్న ఈ స్కానింగ్ పరికరాలను ఉచితంగా కాకుండా నెలవారీ అద్దె ప్రాతిపదికన అందిస్తారని, ఆ అద్దెను షాపు నిర్వాహకులే భరించాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఇది తమకు అదనపు భారమవుతుందని కొందరు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలోనూ ఇలాంటి స్కానింగ్ విధానాన్ని తీసుకురావాలని ప్రయత్నించినా ఆశించిన స్థాయిలో అమలుకాలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు పకడ్బందీగా అమలు చేస్తే ధరల పారదర్శకత, స్టాక్ నియంత్రణలో ఇది ఎంతవరకు సక్సెస్ అవుతుందో చూడాలి.

ప్రతి గడపకు వెళ్లండి.. కూటమి సంక్షేమ పథకాలను వివరించండి

●పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలి : మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



కోయిలకుంట్ల (చైతన్యరథం): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్డీఏ కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంపై అభ్యర్థులు, నాయకులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజలను నేరుగా కలిసి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారి ఆదరాభిమానాలను పొందేలా ప్రచారం నిర్వహించాలని తెలిపారు.

కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని పేర్కొన్నారు.

సమన్వయంతో పనిచేయండి.. గెలుపే లక్ష్యంగా ముందుకు సాగండి

నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా కృషి చేస్తూ, కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు.

విద్యుత్ స్తంభంపైనే సీపీఆర్... అనంతపురం జిల్లాలో ఒళ్లు గగుర్పొడిచే ఘటన



అనంతపురం (చైతన్యరథం): కంబదూరు మండల కేంద్రంలో జరిగిన ఓ ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ప్రైవేట్ విద్యుత్ కార్మికుడై రాజు తన విధుల్లో భాగంగా కంబదూరులోని ఓ విద్యుత్ స్తంభం ఎక్కి.. మరమ్మతులు చేసే సమయంలో కరెంట్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే నిర్జీవంగా మారి.. కరెంట్ తీగల మధ్య చిక్కుకుపోయాడు. అక్కడే ఉన్న సిబ్బంది .. వెంటనే స్థంభంపైకి ఎక్కడి రక్షించే ప్రయత్నం చేశారు. ట్రైన్స్‌లోనో.. బస్సుల్లోనో.. రోడ్డు మీదో.. ఎవరైనా స్పృహ తప్పి పడిపోతే.. వెంటనే అక్కడున్న వాళ్లు సీపీఆర్ చేసి వాళ్లని రక్షించే ప్రయత్నం చేస్తుంటారు. ఇవి అడపాదడపా జరిగేవే. దీనికి భిన్నంగా ఒళ్లు గగుర్పొడిచే ఘటన చోటుచేసుకుంది. ఒక వ్యక్తి నిటారు స్తంభంపైకి ఎక్కి.... ఇంకో వ్యక్తికి సీపీఆర్ చేశాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ప్రాణం.. ఎంత విలువైనదో అందరికి తెలిసిందే. అందుకే కళ్ల ముందు ఎవరైనా కొన ఊపిరితో కొట్టుమిట్టాడితే ఊరికే చూస్తూ ఉండలేం. ఏదో ఒకటి చేయాలనుకుంటాం. కొంచెం సమయస్ఫూర్తి తోడైతే.. మృత్యువు అంచు నుంచి ప్రాణాల్ని కాపాడొచ్చు. ఈ అద్భుత ఘటన అనంతపురం జిల్లా కంబదూరు మండల కేంద్రంలో గురువారం జరిగింది. ఊపిరి ఆగి.. స్తంభంపై వేలాడుతూ... ప్రైవేట్ విద్యుత్ కార్మికుడై రాజు తన విధుల్లో భాగంగా కంబదూరులోని ఓ విద్యుత్ స్తంభం ఎక్కాడు. మరమ్మతులు చేసే సమయంలో కరెంట్ షాక్‌కు గురయ్యాడు. దాంతో అపస్మారక స్థితిలోకి వెళ్లి.. అలా స్తంభంపైనే తీగల మధ్య ఇరుక్కుపోయాడు. అయితే కింద ఉన్నవారికి విషయం అర్థమయ్యేలోపే పరిస్థితి తీవ్రంగా మారింది. స్తంభంపై అలా పడి ఉన్న రాజు చూసి కంగారు పడ్డారు.

స్తంభంపైనే ప్రాణదానం...

కానీ కింద ఉన్న సిబ్బంది భయపడి చేతులు ఎత్తేయలేదు. అందులో ఒక కార్మికుడు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా మొదట విద్యుత్ ఆపేసి, స్తంభంపైకి ఎక్కాడు. అంత ఎత్తులో, ప్రమాదకరమైన పరిస్థితి మధ్యే ఆయన రాజుకు సీపీఆర్ చేశాడు. ఆగిపోయిన గుండెను మళ్లీ కొట్టుకునేలా చేయడానికి ప్రయత్నించాడు. దాంతో రాజులో మళ్లీ కదలిక వచ్చింది. అతడిని భ్రదంగా కిందకు దించి.. మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో రాజు పరిస్థితి గురించి ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు.. అందరిని భావోద్వేగానికి గురి చేస్తున్నాయి. ఆపదలో ఉన్న వ్యక్తిని ఎలాగైనా రక్షించాలనే మానవత్వం ముందు మృత్యువు ఓడిపోయిందని నెటిజన్లు భావిస్తున్నారు.



సేవా స్ఫూర్తికి సలాం

నిధుల సేకరణలో 'అట్లాంటా చాప్టర్' సరికొత్త రికార్డు

శంకర నేత్రాలయ వాలంటీర్లకు ఘన సత్కారం

అరవింద్ కృష్ణస్వామికి బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రత్యేక గౌరవం

అట్లాంటా, జార్జియా: శంకర నేత్రాలయ యూఎస్ఏ అట్లాంటా చాప్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక స్వచ్ఛంద సేవకుల (వాలంటీర్ల) అభినందన విందు ఘనంగా జరిగింది. వార్షిక గ్రాండ్ ఫినాలే విజయవంతమైన సందర్భంగా సంస్థ నిధుల సేకరణ లక్ష్యాన్ని చేరుకోవడంలో కీలక పాత్ర పోషించిన అంకితభావం గల వాలంటీర్లను గౌరవించేందుకు స్థానిక 'సాంబార్ టు సుక్కా' రెస్టారెంట్ బ్యాంక్వెట్ హాల్‌లో ఈ వేడుకను నిర్వహించారు. దాతల అసాధారణ దాతృత్వం, వాలంటీర్ల కృషితో శంకర నేత్రాలయ గత రెండు వరుస సంవత్సరాల్లో ఏటా 2 మిలియన్ డాలర్ల నిధులను సేకరించి అద్భుత మైలురాయిని అధిగమించింది.

ఈ కార్యక్రమానికి శంకర నేత్రాలయ సలహాదారుల మండలి సభ్యులు అరవింద్ కృష్ణస్వామి, జయ కృష్ణస్వామి ముఖ్య అతిథులుగా విచ్చేయగా... బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, అట్లాంటా మాజీ నివాసి మధు తాతా ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) కార్యదర్శి రమేష్ మర్రి, వనవాసీ కల్యాణ ఆశ్రమం తరపున రామనారాయణరావు బొనగిరి తదితర విశిష్ట అతిథులు పాల్గొన్నారు. అట్లాంటా చాప్టర్ అధ్యక్షుడు బాలారెడ్డి ఇందుర్తి నాయకత్వంలోని బృందం అతిథులందరికీ హృదయపూర్వక స్వాగతం పలికింది.

వేడుకలో భాగంగా అరవింద్ కృష్ణస్వామిని శంకర నేత్రాలయ 'బ్రాండ్ అంబాసిడర్'గా గుర్తిస్తూ ప్రత్యేక జ్ఞాపిక ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కృష్ణస్వామి మాట్లాడుతూ... శంకర నేత్రాలయ ఆశయాలకు తన జీవితాంతం అండగా నిలుస్తానని పునరుద్ఘాటించారు. ఇప్పటివరకు మొత్తం 5.53 లక్షల డాలర్ల విరాళాలు అందించిన కృష్ణస్వామి... 6.25 లక్షల డాలర్లు అందించిన ప్రసాద్ రెడ్డి తర్వాత శంకర నేత్రాలయ యూఎస్ఏ 38 ఏళ్ల చరిత్రలో రెండో అత్యధిక వ్యక్తిగత దాతగా నిలిచారు.

విశిష్ట అతిథి మధు తాత మాట్లాడుతూ... నిరుపేదలకు నాణ్యమైన నేత్ర వైద్యం అందించి వారికి చూపును ప్రసాదించడంలో శంకర నేత్రాలయ చేస్తున్న సేవలను కొనియాడారు. అట్లాంటా చాప్టర్ వాలంటీర్ల అంకితభావాన్ని అభినందిస్తూ సంస్థ లక్ష్యాలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

కార్యక్రమంలో భాగంగా అట్లాంటాకు చెందిన గాయకులు ఫణి డొక్కా, శిల్పా ఉప్పలూరి, సందీప్ కొవ్వా ఆలపించిన తెలుగు, హిందీ మధుర గీతాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమ నిర్వహణలో చాప్టర్ కోశాధికారి మూర్తి రేకపల్లి, ధర్మకర్తలు శ్రీనిరెడ్డి వంగిమళ్ల, రాజశేఖర్ ఐల, డాక్టర్ కిషోర్ రెడ్డి రాసమల్లు, సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు నీలిమ గద్దమానుగు, సీవీపీ వెంకీ నీలం, చాప్టర్ లీడ్స్ బిజుదాస్, కార్తికేయన్ వినాయగం, రామరాజు గదిరాజు, అకాడమీ గురువులు కీలక పాత్ర పోషించారు. మీడియా సహకారం అందించిన రత్నకుమార్ కవుటూరు, శ్రీగిరి కోటగిరిలకు నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





ఆస్ట్రేలియా ఎన్నికల బరిలో

తెలుగు మహిళ

విక్టోరియా రాష్ట్ర అసెంబ్లీకి పోటీ చేస్తున్న లక్ష్మి లంకల కెందెర్ల

సిడెన్‌హామ్ స్థానం నుంచి 'ది రిపబ్లికన్' పార్టీ అభ్యర్థిగా ...



హైదరాబాద్/మెల్‌బోర్న్: విదేశాల్లో స్థిరపడిన ప్రవాస భారతీయులు ఉద్యోగాలు, వ్యాపారాలకే పరిమితం కాకుండా అక్కడి ప్రత్యక్ష రాజకీయాల్లోనూ తమదైన ముద్ర వేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో పుట్టి పెరిగి ఆస్ట్రేలియాలో స్థిరపడిన లక్ష్మి లంకల కెందెర్ల అక్కడి విక్టోరియా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. ఈ నెల 28వ తేదీ శనివారం జరగనున్న ఎన్నికల్లో మెల్‌బోర్న్‌లోని సిడెన్‌హామ్ నియోజకవర్గం నుంచి ఆమె 'ది రిపబ్లికన్' పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. విక్టోరియా ఎన్నికల సంఘం లక్ష్మి అభ్యర్థిత్వాన్ని అధికారికంగా నమోదు చేసింది. ఈ స్థానం నుంచి మొత్తం 12 మంది అభ్యర్థులు తలపడుతుండగా బ్యాలెట్ పేపర్‌పై లక్ష్మికి మూడో స్థానం లభించింది. ఆస్ట్రేలియా చట్టసభ ఎన్నికల్లో తెలుగు మూలాలున్న మహిళ పోటీపడుతుండటంతో అక్కడి తెలుగు సమాజంతో పాటు భారతీయ ప్రవాసుల్లో ఆసక్తి నెలకొంది.

హైదరాబాద్‌తో అనుబంధం: లక్ష్మి కుటుంబం నారాయణ్‌పేట జిల్లా నుంచి 38ఏళ్ల క్రితం హైదరాబాద్ వచ్చి స్థిరపడింది. ఆమె విద్యాభ్యాసం నగరంలోని నారాయణగూడలో ఉన్న కేశవ మెమోరియల్ స్కూల్, కాలేజీలో సాగింది. అనంతరం ఢిల్లీలో ఎంబీబీఎస్ పూర్తి చేసి వైద్యురాలిగా పట్టా పొందారు. కర్ణాటకకు చెందిన మల్లేశ్‌ను వివాహం చేసుకున్న తర్వాత భర్తతో కలిసి ఆస్ట్రేలియాలో స్థిరపడ్డారు. 18 ఏళ్లుగా ఆస్ట్రేలియాలోని ఫెడరల్ ప్రభుత్వ విభాగంలో పని చేస్తున్నారు. లక్ష్మి తల్లి ఎల్‌కే జయమ్మ, ఇతర కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో నివసిస్తున్నారు.

ఎన్నికల ప్రధాన హామీలు:

స్థానిక సమస్యల పరిష్కారమే అజెండాగా లక్ష్మి ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సిడెన్‌హామ్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించేందుకు నాలుగు ప్రధాన అంశాలపై దృష్టి సారించినట్టు ప్రకటించారు:

- ప్రజా భద్రత: స్థానికంగా నేరాల నియంత్రణకు చర్యలు, పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం.
- రవాణా సదుపాయాలు: మెరుగైన రోడ్లు, ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడం.
- విద్య: పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు అవసరమైన వనరులు అందించడం.
- వైద్యం: ఆసుపత్రులు, జనరల్ ప్రాక్టీషనర్లు, అత్యవసర వైద్య సేవలు ప్రజలకు సులభంగా అందేలా కృషి చేయడం.

సమాజ సేవలో 'ఏఐఏ', 'సేవా దీపావళి'

శాన్‌హోసేలో పేద కుటుంబాలకు 220 పౌండ్లకు పైగా నిత్యావసర ఆహార పంపిణీ

సిలికాన్ వ్యాలీ కేంద్రంగా దాతృత్వ, మానవతా కార్యక్రమాల నిర్వహణ

శాన్‌హోసే, కాలిఫోర్నియా: థాంక్స్ గివింగ్ పండుగ స్ఫూర్తి, సామాజిక సేవా దృక్పథంతో 'అసోసియేషన్ ఆఫ్ ఇండో అమెరికన్స్' (ఏఐఏ), 'సేవా దీపావళి' సంస్థలు సంయుక్తంగా కాలిఫోర్నియాలోని శాన్‌హోసే నగరంలో ఆహార పంపిణీ చేపట్టాయి. పండుగ సీజన్‌లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానిక కుటుంబాలకు అండగా నిలిచేందుకు 220 పౌండ్లకు పైగా నిత్యావసర ఆహార సామగ్రితో కూడిన ఫుడ్ ప్యాకెట్లను విరాళంగా అందజేశాయి. శాన్‌హోసే సిటీ కౌన్సిల్ సభ్యుడు డొమింగో కాండెలాస్ కార్యాలయ సమన్వయంతో ఈ పంపిణీ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. కరుణ, దాతృత్వం, సామాజిక సేవ పట్ల ఆయా సంస్థలకు ఉన్న ఉమ్మడి నిబద్ధతకు ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. పండుగ సమయంలో కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అవసరమైన చేయూత లభించేందుకు కౌన్సిల్ సభ్యుడు డొమింగో కాండెలాస్ అందించిన సహకారం ఎంతో దోహదపడిందని కొనియాడారు. ఈ సేవా కార్యక్రమం విజయవంతం కావడానికి విరాళాలు అందించిన దాతలు, వాలంటీర్లు, కమ్యూనిటీ భాగస్వాములకు ఏఐఏ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది.

కాగా సిలికాన్ వ్యాలీ కేంద్రంగా పనిచేస్తున్న ఏఐఏ... 60కి పైగా భావసారూప్యత కలిగిన లాభాపేక్షలేని, కమ్యూనిటీ సంస్థల నెట్‌వర్క్ మద్దతుతో సాంస్కృతిక వేడుకలతో పాటు దాతృత్వ, మానవతా కార్యక్రమాలను నిరంతరం చేపడుతోంది. 'సమాజానికి తిరిగి సేవ చేయడం మా ప్రధాన విలువల్లో ఒకటి. సమిష్టి దాతృత్వం, సహకారం ద్వారా పండుగ సీజన్‌లో అవసరమైన కుటుంబాలకు ఓదార్పు, ఆశ, ఆనందాన్ని అందించాలని ఆశిస్తున్నాము' అని సంస్థ ప్రతినిధులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమ వివరాల కోసం www.aiaevents.org వెబ్‌సైట్ లేదా (408) 490-0220 నెంబరును సంప్రదించవచ్చని చెప్పారు.





చదువుతో పాటు ఆటపాటలు

విద్యార్థుల కోసం 'ఫ్లెక్స్ షెడ్యూలింగ్' విధానం

మిల్పిటాస్, కాలిఫోర్నియా: విద్యార్థులపై చదువుల ఒత్తిడి తగ్గించి వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు కాలిఫోర్నియాలోని మిల్పిటాస్ యూనిఫైడ్ స్కూల్ డిస్ట్రిక్ట్ పరిధిలోని 'రాంచో మిల్పిటాస్ మిడిల్ స్కూల్' వినూత్న విద్యా విధానానికి శ్రీకారం చుట్టింది. పాఠశాల రోజువారీ సమయాన్ని పునరుద్ధరిస్తూ 'ఫ్లెక్స్ షెడ్యూలింగ్' పేరుతో ప్రత్యేక వ్యవస్థను రూపొందించింది. ఈ విధానంలో ప్రతి రెండు వారాలకు ఒకసారి సాధారణ పాఠశాల వేళల్లోనే 45 నిమిషాల ప్రత్యేక సమయాన్ని కేటాయించారు. చదువులో అదనపు సహాయం అవసరమైన విద్యార్థులు పాఠశాల సమయం ముగిసిన తర్వాత అక్కడే ఉండాల్సిన అవసరం లేకుండా... ఈ సమయంలోనే పరీక్షలను తిరిగి రాసేందుకు, ఉపాధ్యాయుల నుంచి వ్యక్తిగత మార్గదర్శకత్వం పొందేందుకు లేదా రీడింగ్ ల్యాబ్‌ల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. కొత్త విషయాలను అన్వేషించాలనుకునే విద్యార్థుల కోసం ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జరిగే 'ప్యాషన్ ప్రాజెక్టుల'లో పాల్గొనే వీలు కల్పించారు. ఇందులో భాగంగా కరోకే, వాలీబాల్, స్టూడియో ఆర్ట్, బ్రెయిన్ ట్రివియా, పజిల్స్, డిజిటల్ సిటిజన్‌షిప్ గేమ్స్ వంటి ఆసక్తికర కార్యక్రమాలు ఉంటాయి. ఈ వినూత్న విధానం విద్యార్థులు, సిబ్బంది ఇద్దరికీ ఒత్తిడి లేని, ఉత్సాహభరితమైన అభ్యాస వాతావరణాన్ని అందిస్తోందని పాఠశాల వర్గాలు తెలిపాయి.



ప్యాకేజ్డ్ ఫుడ్‌పై
ఎరుపు రంగు హెచ్చరిక గుర్తులు

ఎఫ్ఎస్ఎస్ఏఐకి సుప్రీంకోర్టు ఆదేశాలు

కొవ్వులు, ఉప్పు, చక్కెర అధిక స్థాయిలో ఉన్న ప్యాకేజ్డ్ ఫుడ్ ఉత్పత్తులపై వార్నింగ్ లేబుళ్లను తప్పనిసరిగా ఉంచాలని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ)కు సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. అలాంటి ఆహార ఉత్పత్తులపై స్పష్టమైన హెచ్చరిక చిహ్నాలు ఉండి తీరాలని తేల్చిచెప్పింది. ఆహారంలో సాల్ట్, షుగర్, ఫ్యాట్ ఎక్కువ మోతాదులో ఉన్నాయని వినియోగదారుడికి తెలిసేలా ప్యాకెట్ ముందు భాగంలో హెక్సాగాన్ ఆకారంలో ఎరుపు రంగు గుర్తులను ముద్రించాలని ఆదేశించింది. ఇలా చేయడం వల్ల అనారోగ్యకర ఆహార పదార్థాలను కొనుగోలుదారులు గుర్తిస్తారని జస్టిస్ పార్థీవాలా, జస్టిస్ కె.వినోద్‌తో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. కొవ్వులు, ఉప్పు, చక్కెర... ఈ మూడింటికీ వేర్వేరు హెచ్చరిక చిహ్నాలు ఉండాలని సుప్రీంకోర్టు సూచించింది. ఈ చిహ్నాలను ఎరుపు రంగు హెక్సాగాన్ ఆకారం మధ్యలో ప్రదర్శించాలని తెలిపింది. ఉదాహరణకు ఒక ఆహార పదార్థంలో పై మూడూ అధికంగా ఉన్నాయని అనుకుందాం. అప్పుడు ఆ ప్యాకెట్‌పైన సాల్ట్, షుగర్, ఫ్యాట్‌కు సంబంధించిన మూడు వేర్వేరు హెచ్చరిక చిహ్నాలు ఉండాలి. అదే ఒకవేళ చక్కెర మాత్రమే ఎక్కువగా ఉంటే... ఒక వార్నింగ్ సింబలే ఉంటుంది. ఈ విధానం ద్వారా కొనుగోలు చేస్తున్న ప్యాకేజ్డ్ ఫుడ్ ఉత్పత్తులపై వినియోగదారులకు పూర్తి అవగాహన ఏర్పడుతుందని 'సుప్రీం' భావిస్తోంది.

అఖిలేష్ యాదవ్
ఎన్నికల మేనిఫెస్టో

నిరుద్యోగులకు నెలకు రూ.5వేల భృతి, రైతులకు రుణమాఫీ



ఉత్తర్‌ప్రదేశ్‌లో మరికొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. గెలుపు కోసం ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టాయి. ఈ క్రమంలో సమాజ్‌వాదీ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించింది. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో 25 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగ పట్టభద్రులకు నెలకు రూ.5వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చింది. లఖ్‌నవూలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఎన్నికల వాగ్దానాలను ప్రకటించారు. రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని గతంలో కొందరు చెప్పారని, కానీ అవి రాలేదని ఈ సందర్భంగా బీజేపీని ఉద్దేశించి అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్యానించారు. త్వరలో చెడు రోజులు మాత్రం పోతాయన్నారు. ప్రతి పట్టభద్రుడికీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, ఉద్యోగ ఆధారిత నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షల్లో అవకతవకలను సహించే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రంలో కులగణన చేపడతామని చెప్పారు. రైతులకు తక్షణ రుణమాఫీతో పాటు 23 రకాల పంటలు, పాలకు కనీస మద్దతు ధర కల్పిస్తామని తెలిపారు. బీపీఎల్‌కు దిగువన ఉన్న ప్రజలకు రూ.10 లక్షల ఆరోగ్య బీమా, వృద్ధ మహిళలు సహా కార్మికులు, కళాకారులకు ఏడాదికి 40వేల పింఛను, సమాజ్‌వాదీ క్యాంటీన్లలో రూ.5కే పేదలు, మహిళలకు భోజన సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. 12వ తరగతి పాసైన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఇస్తామన్నారు.

2027 కేంద్ర ప్రభుత్వ సెలవుల జాబితా విడుదల



2027 సంవత్సరానికి దేశంలోని కేంద్ర ప్రభుత్వ పరిపాలనా కార్యాలయాలు, పారిశ్రామిక సంస్థలు, బ్యాంకులకు సంబంధించిన అధికారిక సెలవుల క్యాలెండర్‌ను కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ విడుదల చేసింది. తప్పనిసరి సెలవులు, ఐచ్ఛిక సెలవులు, రెస్ట్రిక్టెడ్ సెలవులకు సంబంధించిన మార్గదర్శకాలను ఇందులో స్పష్టంగా పేర్కొన్నది. ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు 17 సాధారణ సెలవులు వర్తిస్తాయి. వీటికి అదనంగా ప్రతి ఉద్యోగి 32 రెస్ట్రిక్టెడ్ సెలవుల జాబితా నుంచి ఏవైనా రెండు సెలవులను ఎంపిక చేసుకోవచ్చు. ఢిల్లీ వెలుపల ఇతర రాష్ట్రాల్లోని కేంద్ర కార్యాలయాలకు 14 సెలవులను తప్పనిసరిగా ఖరారు చేశారు. వీటికి అదనంగా ప్రభుత్వం ఇచ్చిన 12 ఐచ్ఛిక పండుగల జాబితా నుంచి ఆయా రాష్ట్ర రాజధానుల్లోని 'కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సమన్వయ కమిటీలు' మరో 3 సెలవులను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఒకసారి నోటిఫై చేసిన తర్వాత ఈ జాబితాలో ఎలాంటి మార్పులు ఉండవు. పారిశ్రామిక, వాణిజ్య సంస్థలకు గణతంత్ర దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం, గాంధీ జయంతి అనే మూడు జాతీయ సెలవులతో కలిపి గరిష్ఠంగా 16 సెలవులు అమలవుతాయి. బ్యాంకులకు కేంద్ర ఆర్థిక శాఖ మార్గదర్శకాల ప్రకారం వేరుగా ఆదేశాలు వర్తిస్తాయి. పండుగ సెలవు ఆదివారం లేదా సాధారణ వారాంతపు సెలవుల్లో వచ్చినప్పుడు వాటికి బదులుగా ఎలాంటి ప్రత్యామ్నాయ సెలవులను మంజూరు చేయరు. ఒకటి కంటే ఎక్కువ పండుగలు ఒకే రోజు వచ్చినా ఇదే నిబంధన వర్తిస్తుంది. నెలవంక దర్శనాన్ని బట్టి ఈద్-ఉల్-ఫితర్, బక్రీద్, మొహర్రం, మిలాద్-ఉన్-నబీ పండుగల తేదీలను మార్చే అధికారం సంబంధిత కమిటీలకు, కేంద్ర శాఖకు ఉంటుంది. 2027లో దీపావళి అక్టోబరు 29 (శుక్రవారం) వచ్చింది. కొన్ని రాష్ట్రాల్లో నరక చతుర్దశి నాడే తప్పనిసరి దీపావళి సెలవుగా ప్రకటిస్తే అక్కడి కేంద్ర కార్యాలయాలు కూడా ఆ రోజే సెలవు పాటించవచ్చు.

సాధారణ సెలవులు

జనవరి 26(మంగళవారం)-గణతంత్ర దినోత్సవం
మార్చి 10 (బుధవారం)- ఈద్-ఉల్-ఫితర్
మార్చి 23 (మంగళవారం)- హోలీ
మార్చి 26 (శుక్రవారం)-గుడ్ ఫ్రైడే
ఏప్రిల్ 15 (గురువారం)-శ్రీరామనవమి
ఏప్రిల్ 19 (సోమవారం)-మహావీర్ జయంతి
మే 17 (సోమవారం)-ఈద్-ఉల్-జుహా (బక్రీద్)
మే 20 (గురువారం)-బుద్ధ పూర్ణిమ
జూన్ 16 (బుధవారం)- మొహర్రం
ఆగస్టు 15 (ఆదివారం)- స్వాతంత్ర్య దినోత్సవం
ఆగస్టు 15 (ఆదివారం)-మిలాద్-ఉన్-నబీ
ఆగస్టు 25 (బుధవారం)-శ్రీకృష్ణాష్టమి
అక్టోబరు 2 (శనివారం)-మహాత్మాగాంధీ జయంతి
అక్టోబరు 9 (శనివారం)-విజయదశమి
అక్టోబరు 29 (శుక్రవారం)-దీపావళి
నవంబరు 14 (ఆదివారం)-గురునానక్ జయంతి
డిసెంబరు 25 (శనివారం)-క్రిస్మస్

రాష్ట్రాల్లోని కార్యాలయాల కోసం 12 ఐచ్ఛిక సెలవులు ఉంటాయి. వీటిలో మూడు మాత్రమే ఎంచుకోవాలి. అవి... దసరా అదనపు రోజు, హోలీ, జన్మాష్టమి, శ్రీరామనవమి, మహాశివరాత్రి, వినాయకచవితి, మకర సంక్రాంతి, రథయాత్ర, ఓనమ్, పొంగల్, వసంత పంచమి, ఉగాది/గుడి పడ్వా/బిహు/వైశాఖి/ఛత్ పూజ/కర్వా చౌత్.

జాతీయ రహదారిపై విమానాల ల్యాండింగ్
చరిత్ర సృష్టించిన భారత సైన్యం





భారత సైన్యం మరో అరుదైన ఘనత సాధించింది. సాధారణంగా వాహనాల రాకపోకలకు మాత్రమే ఉపయోగించే జాతీయ రహదారిపై నాలుగు సైనిక విమానాలను విజయవంతంగా ల్యాండింగ్,టేకాఫ్‌చేసి సరికొత్త చరిత్ర సృష్టించింది. గుజరాత్‌లోని అమృత్‌సర్-జామ్‌నగర్ ఎకనామిక్ కారిడార్‌పై ఈ వినూత్న ప్రయోగం జరిగింది. భారత సైన్యానికి చెందిన 'టీమ్ మౌంటైన్ ఈగిల్స్' బృందం ఈ సాహసోపేత కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. భారత సైన్యం చేపట్టిన 'వింగ్స్ ఆఫ్ వాలర్ అండ్ యూనిటీ ఎక్స్‌పెడిషన్-2026'లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో రెండు ఫిక్స్‌డ్ వింగ్ మైక్రోలైట్ విమానాలు, రెండు పవర్డ్ హ్యాంగ్ గ్లైడర్లు పాల్గొన్నాయి. గుజరాత్‌లోని పాటన్ జిల్లాలో అమృత్‌సర్-జామ్‌నగర్ ఎకనామిక్ కారిడార్‌లో 946 నుంచి 949 కిలోమీటర్ల మధ్య ఈ విమానాలు విజయవంతంగా దిగాయి. అనంతరం తిరిగి గాల్లోకి ఎగిరాయి. విమానాలు సురక్షితంగా ల్యాండ్ అయ్యేందుకు రహదారి ఉపరితలం, భౌగోళిక పరిస్థితులు,భద్రతాప్రమాణాలను అధికారులు ముందుగానే పరిశీలించారు.స్థానిక పోలీసు యంత్రాంగం, జిల్లా అధికారులు, ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది సమన్వయంతో ట్రాఫిక్‌ను తాత్కాలికంగా మళ్లించారు.

ఈ అరుదైన ఘనతపై కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ హర్షం వ్యక్తంచేశారు. భారత సైన్యం, ఎన్‌హెచ్ఏఐ అధికారులసమన్వయాన్ని ప్రశంసించారు. దేశంలో నిర్మిస్తున్న ఆధునిక జాతీయ రహదారులు కేవలం ప్రయాణ సౌకర్యాలకే పరిమితం కాదని, సైనిక అవసరాలు,అత్యవసర పరిస్థితుల్లో కీలకంగా ఉపయోగపడగలవని పేర్కొన్నారు.కాగా ఈ నెల 14న ప్రారంభమైన 'వింగ్స్ ఆఫ్ వాలర్ అండ్ యూనిటీ ఎక్స్‌పెడిషన్'... మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల మీదుగా సాగుతోంది. 28న మధ్యప్రదేశ్‌లోని మౌలో ముగుస్తుంది. ఈ కార్యక్రమం భారత సైన్యం సాహసం, సాంకేతిక సామర్థ్యం, దేశ మౌలిక సదుపాయాల బలాన్ని చాటి చెప్తోంది.

శరద్ పవార్‌కు మళ్లీ అస్వస్థత

ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్‌పవార్ మరోసారి అనారోగ్యంతో ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. డీహైడ్రేషన్‌తో ఇబ్బందిపడుతున్న ఆయన్ను ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రికి తరలించినట్టు పవార్ కుమార్తె, బారామతి ఎంపీ సుప్రియా సూలే తెలిపారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్టు పెట్టారు. ఛాతీలో నొప్పి, శ్వాసకోస ఇన్ఫెక్షన్ లాంటి సమస్యలతో శరద్‌పవార్ మరోసారి అస్వస్థతకు గురయ్యారు. ఇలాంటి సమస్యతోనే ఇటీవల చికిత్స పొంది నవంబరు 5న ఇదే ఆస్పత్రి నుంచి పవార్ డిశ్చార్జి అయ్యారు. ఈ పరిస్థితుల్లో ప్రయాణాలు చేయొద్దని



వైద్యులు సూచించినప్పటికీ ఆయన తమ మాట వినకుండా పనిలో నిమగ్నమవుతున్నారని సుప్రియా సూలే తెలిపారు.



పాస్‌పోర్టులో తేడాలు
సౌరవ్ దాస్‌పై లుకౌట్ నోటీసు

న్యూఢిల్లీ: 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) నేత సౌరవ్ దాస్ పాస్‌పోర్టు వివరాల వ్యవహారం ఢిల్లీ హైకోర్టుకు చేరింది. బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనియన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న తనను విమానాశ్రయంలో అడ్డుకోవడాన్ని సవాల్ చేస్తూ దాస్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కీలక విషయాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. సౌరవ్ దాస్‌పై లుకౌట్ సర్క్యులర్ (ఎల్ఓసీ) జారీ అయ్యిందని కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) చేతన శర్మ వెల్లడించారు. ఈ నెల 23న ముంబై పోలీసులు సౌరవ్ దాస్‌పై లుకౌట్ నోటీసులు జారీ చేసినట్టు ఏఎస్‌జీ కోర్టుకు తెలిపారు. ఆయన పాస్‌పోర్టు దరఖాస్తు, రికార్డుల్లో తండ్రి పేరు, చిరునామా వంటి వివరాలలో తేడాలున్నట్టు గుర్తించామని, ఈ లోపాలు ఆయన భారత పౌరసత్వంపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని ప్రభుత్వం పేర్కొంది. ఈ అంశంపై షోకాజ్ నోటీసు జారీ చేసి, వివరణ ఇవ్వడానికి ఈ నెల 30 వరకు గడువు ఇచ్చినట్లు వివరించింది.

ప్రతివాదన.. తదుపరి విచారణ

మరోవైపు తమ క్లయింట్‌పై లుకౌట్ నోటీసు జారీ చేసిన విషయాన్ని, అందుకు గల కారణాలను గోప్యంగా ఉంచారని సౌరవ్ దాస్ తరపు న్యాయవాదులు కోర్టులో ప్రశ్నించారు. ఎల్ఓసీ కాపీని తమకు అందించాలని కోరగా, దానిని ఇవ్వడం కుదరదని కేంద్రం తరపు న్యాయవాది స్పష్టం చేశారు. ఈ పిటిషన్‌పై స్పందన తెలపాలని కేంద్రానికి, రీజినల్ పాస్‌పోర్టు అధికారికి, విదేశాంగ మంత్రిత్వ శాఖకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు తదుపరి విచారణను డిసెంబరు 9కి వాయిదా వేసింది.

అంతరిక్షంలో 10 లక్షల ఉపగ్రహాలు

స్పేస్‌ఎక్స్‌కు ఎఫ్‌సీసీ గ్రీన్‌సిగ్నల్

అంతరిక్షంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు అమెరికా రంగం సిద్ధం చేస్తోంది. తమ దేశానికి చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ ఏకంగా 10 లక్షల (మిలియన్) ఉపగ్రహాలను ప్రయోగించేందుకు యూఎస్ ఫెడరల్ కమ్యూనికేషన్స్ కమిషన్ (ఎఫ్‌సీసీ) అనుమతులు మంజూరు చేసింది. ఈ ఉపగ్రహాల ద్వారా అంతరిక్షంలో డేటా సెంటర్ల నెట్‌వర్క్‌ను నిర్మించనుండగా... ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి అనుమతి పొందిన తొలి సంస్థగా స్పేస్‌ఎక్స్ నిలిచింది.

సౌరశక్తిని ఉపయోగించుకుని ఉపగ్రహాలకు విద్యుత్తును అందిస్తూ వాటిలో డేటాను ప్రాసెస్ చేయడం ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అవసరాలను తీర్చాలన్నది ఎలాన్ మస్క్ ప్రణాళిక. ఈ ప్రాజెక్టుకు 'స్టార్‌మైండ్' అని నామకరణం చేశారు. స్టార్‌మైండ్ ప్రాజెక్టు అమెరికా సూపర్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఎకానమీకి ఎంతో దోహదపడుతుందని ఎఫ్‌సీసీ పేర్కొంది. భూభాగంపై డేటా సెంటర్ల ఏర్పాటుపై వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో తక్కువ ఇంధన వ్యయంతో కూడిన ఆర్బిటల్ డేటా సెంటర్ల ప్రతిపాదనకు ఆమోదం లభించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఎఫ్‌సీసీ అనుమతులపై ఎలాన్ మస్క్ 'ఎక్స్' వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు భవిష్యత్తులో అమెరికాతో పాటు ప్రపంచానికి ఓ గొప్ప ఆస్తిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు అమలుకు సంబంధించి ఎఫ్‌సీసీ నిర్దేశించిన కాలపరిమితి ప్రకారం మొదటి ఉపగ్రహ ప్రయోగం 2033 నవంబరు నాటికి పూర్తి కావాలి. 2035 నవంబరు నాటికి 10 శాతం (లక్ష) ఉపగ్రహాలను



కక్ష్యలోకి చేర్చాలి. 2038 నవంబరు నాటికి 50 శాతం ప్రాజెక్టు పూర్తి కానుండగా, 2040 నాటికి పూర్తిస్థాయి నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తీసుకురావాలి.

అమెరికా చిన్నారులకు మస్క్ బంపర్ ఆఫర్

ఒక్కొక్కరికి రెండు స్పేస్‌ఎక్స్ షేర్లు



ప్రపంచ కుబేరుడు, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ అమెరికాలోని చిన్నారులకు భారీ శుభవార్త చెప్పారు. దేశంలోని ప్రతి చిన్నారికీ తన అంతరిక్ష సంస్థ స్పేస్‌ఎక్స్‌లో రెండు షేర్లను ఇవ్వనున్నట్టు సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ప్రకటించారు. ఈ పథకం కింద తొలుత ఒక్కో చిన్నారికి ఒక్కొక్క షేరు చొప్పున ఇవ్వాలని ప్రకటించిన మస్క్.. తాజాగా ఆ సంఖ్యను రెట్టింపు చేస్తూ రెండు షేర్లకు పెంచారు. వీటిలో ఒక షేరును స్పేస్‌ఎక్స్ సంస్థ తరపున జారీ చేయనుండగా మరొక షేరును మస్క్ తన వ్యక్తిగత వాటా నుంచి సమకూర్చనున్నారు.

అమెరికాలోని 18 ఏళ్లలోపు చిన్నారుల దీర్ఘకాలిక సంపద వృద్ధి కోసం ఉద్దేశించిన 'ట్రంప్ అకౌంట్స్' పెట్టుబడి కార్యక్రమం ద్వారా ఈ షేర్లను బదిలీ చేయనున్నట్టు తెలుస్తోంది. సంస్థ తరపున ఇచ్చే షేర్లను డిసెంబర్‌లో బదిలీ చేయనుండగా, మస్క్ తన వ్యక్తిగత వాటా నుంచి ఇచ్చే షేర్లను లాక్-ఇన్ వ్యవధి ముగిసిన తర్వాత వచ్చే ఏడాది జూన్‌లో అందించనున్నట్లు సమాచారం. సుమారు 7 కోట్ల మందికి పైగా చిన్నారులకు లబ్ధి చేకూర్చే ఈ నిర్ణయం విలువ దాదాపు 18బిలియన్ డాలర్లకు పైగా ఉంటుందని అంచనా.

భారత్‌పై అమెరికా మరోసారి సుంకాల కొరడా

25 శాతం టారిఫ్‌ల ప్రతిపాదన

వాషింగ్టన్: భారత ఎగుమతులపై అమెరికా మరోసారి భారీ సుంకాల కొరడా ఝళిపించింది. భారత్ నుంచి దిగుమతయ్యే సరకులపై 25 శాతం వరకు టారిఫ్‌లు విధించాలని ప్రతిపాదించింది. దేశీయ అవసరాలకు మించి అధికంగా వస్తువులను ఉత్పత్తి చేసి (స్ట్రక్చరల్ ఎక్సెస్ కెపాసిటీ) అంతర్జాతీయ మార్కెట్లో కుమ్మరిస్తూ తమ కంపెనీల ప్రయోజనాలను దెబ్బతీస్తున్నందుకే ఈ చర్యకు ఉపక్రమించినట్టు అమెరికా వాణిజ్య ప్రతినిధి (యూఎస్‌టీఆర్) జేమీసన్ గ్రీర్ వెల్లడించారు. అయితే తమ దేశంతో భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటే ఈ సుంకాలను 17 శాతానికి తగ్గిస్తామని స్పష్టం చేశారు. 1974 వాణిజ్య చట్టంలోని సెక్షన్ 301 కింద నిర్వహించిన విచారణ అనంతరం భారత్‌తో పాటు చైనా, జపాన్, దక్షిణ కొరియా, ఐరోపా యూనియన్ (ఈయూ), బంగ్లాదేశ్, వియత్నాం, తైవాన్ తదితర మొత్తం 14 ఆర్థిక వ్యవస్థలపై యూఎస్‌టీఆర్ కొత్త టారిఫ్‌లను ప్రతిపాదించింది. కాగా, అమెరికా ఆరోపణలను భారత వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తోసిపుచ్చింది. ఏ రంగంలోనూ తమకు అధిక ఉత్పత్తి సామర్థ్యం లేదని, వాణిజ్యపరమైన అంశాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని స్పష్టం చేసింది. కాగా ప్రతిపాదిత సుంకాలు తక్షణమే అమల్లోకి రావని యూఎస్‌టీఆర్ తెలిపింది. వీటిపై అమెరికా పౌరులు, భాగస్వాములు వచ్చే ఏడాది జనవరి 5లోగా రాతపూర్వకంగా తమ అభిప్రాయాలను సమర్పించవచ్చు. జనవరి 25న బహిరంగ విచారణ నిర్వహించిన తర్వాత తుది నిర్ణయం తీసుకోనున్నారు.

కైరోలో ఘోర అగ్నిప్రమాదం

చమురు ట్యాంకర్ పేలి 31 మంది మృతి... మరో 21 మందికి గాయాలు

కైరో: ఈజిప్ట్ రాజధాని కైరో నగరంలోని ఓ బిజీ హైవేపై ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. చమురు ట్యాంకర్ పేలిన ఘటనలో 31 మంది మృతి చెందగా మరో 21 మంది గాయపడినట్టు అక్కడి ఆరోగ్య శాఖ ప్రకటించింది. వరాఖ్ ప్రాంతంలోని రింగ్ రోడ్డు సమీపంలో చమురు ట్యాంకర్ బోల్తా పడటంతో ఈ దుర్ఘటన జరిగింది. ట్యాంకర్ నుంచి ఒలికిన పెట్రోల్ సమీపంలోని వాహనాల వద్దకు చేరడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో పలు వాహనాలు చిక్కుకుని దగ్ధమయ్యాయి. హైవేపై వెళ్తున్న ట్యాంకర్ ఎదుట హైటెన్షన్ విద్యుత్



కేబుల్ తెగిపడటంతో అదుపుతప్పి బోల్తా పడినట్టు సమాచారం. సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేసరికే 31 మంది ప్రాణాలు కోల్పోయారు. మంటలు తగ్గిన తర్వాత పెద్ద సంఖ్యలో ప్రజలు హైవేపైకి చేరుకోవడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. ఈజిప్ట్‌లో రహదారి నిర్వహణ లోపాలు, అక్రమ నివాసాలు, పాత మౌలిక వసతుల కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తుంటాయి. గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో సుమారు 6వేల మంది మృతి చెందినట్టు గణాంకాలు చెప్తున్నాయి.

బ్యాంకాక్ చమురు శుద్ధి కర్మాగారంలో భారీ పేలుడు

బ్యాంకాక్: థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లోని ఒక చమురు శుద్ధి కర్మాగారంలో గురువారం భారీ పేలుడు సంభవించి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. తూర్పు బ్యాంకాక్‌లోని ఫ్రా ఖానోంగ్ జిల్లాలో ఉన్న 'బాంగ్‌చాక్ కార్పొరేషన్' చమురు శుద్ధి కేంద్రంలో స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.45 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. పేలుడు ధాటికి మంటలు భారీగా ఎగిసిపడటంతో పాటు ఆ ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగ కమ్ముకుంది. ఈ ఘటనలో కనీసం 7 నుంచి 9 మంది గాయపడగా వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని వైద్య వర్గాలు వెల్లడించాయి.



ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక, రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగి సుమారు అరగంట పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయి. ముందుజాగ్రత్త చర్యగా సమీప ప్రాంతాల్లోని నివాసాలు, పాఠశాలలను ఖాళీ చేయించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ప్రమాదం నేపథ్యంలో రిఫైనరీలోని అన్ని ఉత్పత్తి యూనిట్లను తాత్కాలికంగా నిలిపివేసినట్టు బాంగ్‌చాక్ సంస్థ ప్రకటించింది. పేలుడుకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. పరిసర ప్రాంతాల్లో వాయు, జల కాలుష్య ప్రభావాన్ని అంచనా వేయాలని థాయ్‌లాండ్ ప్రధాని అనుతిన్ చర్న్‌విరాకుల్ సంబంధిత శాఖలను ఆదేశించారు. ప్రమాదానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

నేపాల్ ఆకస్మిక వరదల విషాదం

- **గల్లంతైన 213 మంది భారతీయులు మరణించినట్టు ప్రకటించే ప్రక్రియ ప్రారంభం**
- **3,915 మందితో జాబితా విడుదల చేసిన నేపాల్ విపత్తు నిర్వహణ సంస్థ**
- **అభ్యంతరాలుంటే డిసెంబరు 2లోగా తెలపాలని భారత రాయబార కార్యాలయం సూచన**

కాఠ్మండు: నేపాల్‌లో ఆగస్టు 26న సంభవించిన ఆకస్మిక వరదల్లో గల్లంతై ఇప్పటికీ ఆచూకీ లభించని వారిని మరణించినట్టు అధికారికంగా ప్రకటించే ప్రక్రియను నేపాల్ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ప్రకృతి విపత్తులో సుమారు 1,400 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా వేలాది మంది గల్లంతయ్యారు. మూడు నెలలు గడిచినా వారి ఆచూకీ తెలియకపోవడంతో 3,292 మంది నేపాలీ పౌరులు, 19 దేశాలకు చెందిన 623 మంది విదేశీయులతో కలిపి మొత్తం 3,915 మందితో కూడిన జాబితాను నేపాల్ 'నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ' తన వెబ్‌సైట్‌లో ప్రచురించింది. దీనిపై అభ్యంతరాలు, సవరణలను ఆహ్వానించింది.

ఎన్‌డీఆర్ఆర్ఎంఏ విడుదల చేసిన ఈ జాబితాలో 213 మంది భారతీయులు ఉన్నారు. ఈ నేపథ్యంలో కాఠ్మండులోని భారత రాయబార కార్యాలయం బాధిత కుటుంబాలకు కీలక సూచనలు జారీ చేసింది. జాబితాలో ఉన్న పేర్లు, ఇతర వివరాలపై ఏవైనా అభ్యంతరాలు లేదా మార్పులు, చేర్పులు అవసరమైతే డిసెంబరు 2లోగా తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరింది. ఇందుకోసం బాధిత కుటుంబ సభ్యులు eoikathmandufloodsupport@gmail.com ఈ-మెయిల్ ద్వారా లేదా +977 9851316807 (వాట్సాప్ సదుపాయం ఉంది) హెల్ప్‌లైన్ నెంబరు ద్వారా సంప్రదించవచ్చని రాయబార కార్యాలయం వెల్లడించింది. అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసిన తర్వాత నేపాల్ ప్రభుత్వం తుది జాబితాను ఖరారు చేసి మరణాలపై అధికారిక ప్రకటన విడుదల చేస్తుంది. అనంతరం స్థానిక అధికారుల నుంచి మరణ ధ్రువీకరణ పత్రాలను ఇప్పించే ప్రక్రియను భారత రాయబార కార్యాలయం చేపడుతుంది.



అది టీ20 మ్యాచ్ అనుకున్నా

వైభవ్ విధ్వంసానికి క్రిస్ గేల్ ఫిదా



భారత సిక్సర్ల పిడుగు వైభవ్ సూర్యవంశీ రికార్డు డబుల్ సెంచరీపై వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ స్పందించాడు. ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో వైభవ్ 53 బంతుల్లో 204 పరుగులతో విధ్వంసం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ స్కోర్ విన్నప్పుడు అసలు తాను సరిగ్గా విన్నానా లేదా అని మరోసారి నిర్ధారించుకున్నట్లు గేల్ వెల్లడించాడు. 12 ఓవర్లలో డబుల్ సెంచరీ అంటే టీ20 మ్యాచ్ అనుకున్నానని, అది 50 ఓవర్ల ఫార్మాట్ అని చెప్పడంతో ఆశ్చర్యపోయాయని తెలిపాడు.

'15 ఏళ్ల వయసులో తక్కువ బంతుల్లో డబుల్ సెంచరీ సాధించడం అద్భుతం. 28 సిక్సర్లు బాదడం అసాధారణం. ఆ మ్యాచ్ తర్వాత నా ఫోన్‌కు వరుసగా మెసేజ్‌లు వస్తూనే ఉన్నాయి. అసలు ఏం జరుగుతోంది? అని అనుకున్నా. 12 ఓవర్లలో వైభవ్ సూర్యవంశీ డబుల్ సెంచరీ చేశాడని ఎవరో చెప్పారు. వెంటనే ఇది టీ20 మ్యాచా? అని అడిగాను. కాదు 50 ఓవర్ల మ్యాచ్ అని చెప్పారు. 53 బంతుల్లో డబుల్ సెంచరీ చేశాడంటే నిజంగానే ఆశ్చర్యంగా అనిపించింది. ఇదే వేగంతో బ్యాటింగ్ చేస్తే వన్డే క్రికెట్‌లో ట్రిపుల్ సెంచరీ కూడా సాధ్యమే అనిపిస్తోంది. వైభవ్ ఆటను కొత్త దిశలో తీసుకెళ్తున్నాడు. అతడికి మరిన్ని అవకాశాలు రావాలి. టీమిండియాలో వైభవ్ తరచూ ఆడుతుంటే చూడాలని ఉంది. అతడి ప్రతిభ మరుగున పడకూడదు' అని గేల్ వివరించాడు.

'బేబీ బాస్' ట్యాగ్ వద్దు..

వైభవ్ విధ్వంసకర బ్యాటింగ్ కారణంగానే క్రిస్ గేల్‌తో పోలుస్తూ అభిమానులు 'బేబీ బాస్' అనే పేరు పెట్టారు. గేల్‌ను 'యూనివర్స్ బాస్' అని పిలుస్తారన్న సంగతి తెలిసిందే. అయితే ఈ పేరుతో కాకుండా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని వైభవ్‌కు గేల్ సూచించాడు. 'యూనివర్స్ బాస్, బేబీ బాస్ అని పిలుస్తున్నారని తెలుసు. కానీ అతడు తనకంటూ ఓ ప్రత్యేకమైన పేరు సంపాదించుకోవాలి. ఇతరుల పేర్లకు ట్యాగ్‌లైన్లు జోడించుకోవడం కంటే సొంత బ్రాండ్‌ను నిర్మించుకోవాలి. హిట్‌మ్యాన్, ఏబీ 360, క్రిస్ గేల్ యూనివర్స్ బాస్.. ఇలా ప్రతి ఒక్కరికీ ప్రత్యేక గుర్తింపు ఉంది. వైభవ్ కూడా తనదైన బ్రాండ్‌ను సృష్టించుకోవాలి. 'బేబీ బాస్' అనే పేరు ఎక్కువకాలం సరిపోదు. వైభవ్ అంతకు మించి.. భవిష్యత్తులో మరింత ఎదుగుతాడు. అయితే 'యూనివర్స్' అనే పేరు మాత్రం తీసుకోలేడు. ఎందుకంటే ఆ యూనివర్స్ నాదే' అంటూ గేల్ చమత్కరించాడు.

అజేయ భారత్... సెమీస్‌కు సై

జపాన్‌పై 4-0తో ఘన విజయం

చరిత్రలో తొలిసారి ప్రపంచ 4వ ర్యాంకు కైవసం

భోపాల్: మహిళల ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీలో భారత జట్టు అజేయ జైత్రయాత్ర కొనసాగుతోంది. బుధవారం జరిగిన ఆఖరి రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లో సలీమా టెటె సారథ్యంలోని భారత్ 4-0 గోల్స్ తేడాతో జపాన్‌ను చిత్తు చేసింది. గత మ్యాచ్‌లో హ్యాట్రిక్‌తో చెలరేగిన స్టార్ డ్రాగ్‌ఫ్లికర్ దీపిక (16, 48 నిమిషాల్లో) ఈ మ్యాచ్‌లోనూ రెండు గోల్స్ సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. లాల్రెమ్సియామి (12వ నిమిషం), నేహా గోయల్ (28వ నిమిషం) చెరో గోల్ చేసి జట్టుకు తిరుగులేని ఆధిక్యాన్ని అందించారు. లీగ్ దశలో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత్ 15 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంతో సెమీఫైనల్‌లోకి అడుగుపెట్టింది. 12 పాయింట్లతో జపాన్ రెండో స్థానంలో నిలిచింది. శుక్రవారం జరగనున్న తొలి సెమీఫైనల్లో భారత్... మలేసియాతో తలపడనుండగా, రెండో సెమీస్‌లో జపాన్, చైనా అమీతుమీ తేల్చుకోనున్నాయి.

ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత, ఈ టోర్నీలో ఓటమెరుగకుండా దూసుకెళ్తున్న భారత మహిళల జట్టు అంతర్జాతీయ హాకీ సమాఖ్య ప్రపంచ ర్యాంకింగ్స్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. మంగళవారం 5వ స్థానానికి చేరిన భారత్, జపాన్‌పై విజయంతో ఏకంగా 4వ స్థానానికి ఎగబాకింది. 2003లో ర్యాంకింగ్స్ ప్రవేశపెట్టినప్పటి నుంచి భారత జట్టుకు ఇదే అత్యుత్తమ ర్యాంకు. ఇదే జోరుతో వరుసగా రెండోసారి ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్ నిలబెట్టుకోవాలని భారత్ ఉవ్విళ్లూరుతోంది.



సౌతాఫ్రికా క్రికెటర్ ప్రపంచ రికార్డు

టెస్టు క్రికెట్ చరిత్రలోనే తొలి ప్లేయర్

దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ వియాన్ ముల్డర్ టెస్టు క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టెస్టులో బ్యాట్‌తో సెంచరీ సాధించడమే కాకుండా బంతితోనూ చెలరేగి ఏకంగా ఏడు వికెట్లు పడగొట్టాడు. 2025 జులైలో జింబాబ్వేతో జరిగిన టెస్టులో ముల్డర్ అజేయంగా 367 పరుగులు చేసిన విషయం తెలిసిందే. దీంతో 149 ఏళ్ల టెస్టు క్రికెట్ చరిత్రలో ట్రిపుల్ సెంచరీ సాధించడంతో పాటు ఏడు వికెట్ల ఘనత అందుకున్న తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు.

బంగ్లాదేశ్‌తో రెండో టెస్టులో ముల్డర్ 178 బంతుల్లో 100 పరుగులు చేశాడు. అనంతరం బౌలింగ్‌లో కేవలం 31 పరుగులిచ్చి 11 ఓవర్లలో ఏడు వికెట్లు పడగొట్టాడు. ఒక టెస్టు మ్యాచ్‌లో సెంచరీ సాధించడంతో పాటు ఏడు వికెట్లు పడగొట్టిన ఐదో ఆటగాడిగా ముల్డర్ నిలిచాడు. 1980లో ఇంగ్లండ్ దిగ్గజం ఇయాన్ బోథమ్ తర్వాత ఈ ఘనత సాధించిన తొలి ఫాస్ట్ బౌలర్‌గా రికార్డులకెక్కాడు. దక్షిణాఫ్రికా తరఫున ఒకే టెస్టులో సెంచరీ, ఏడు వికెట్లు సాధించిన తొలి క్రికెటర్‌గానూ నిలిచాడు.

అన్షుల్ కాంబోజ్‌కు మద్దతుగా నిలుద్దాం

టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్



న్యూజిలాండ్‌తో శుక్రవారం నుంచి భారత జట్టు రెండో టెస్టు మ్యాచ్‌లో తలపడనుంది. దీనికి ముందు టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ కీలక వ్యాఖ్యలు చేశాడు. తొలి టెస్టులో బౌలింగ్ వేగం తగ్గిందనే విమర్శలు ఎదుర్కొంటున్న యువ పేసర్ అన్షుల్ కాంబోజ్‌కు అండగా నిలిచాడు. పిచ్ స్వభావం కారణంగానే బౌలర్ల వేగం తగ్గిందని, ఈ విషయంలో కాంబోజ్‌ను ప్రత్యేకంగా తప్పుబట్టడం సరికాదని స్పష్టం చేశాడు. అతడికి మద్దతుగా నిలవాలని జట్టు సభ్యులు, అభిమానులకు సూచించాడు.

న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో అన్షుల్ కాంబోజ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 45 ఓవర్లు బౌలింగ్ చేశాడు. అయితే రెండో, మూడో స్పెల్స్‌లో అతడి బౌలింగ్ వేగం గంటకు 130 కిలోమీటర్ల కంటే తక్కువకు పడిపోయింది. బౌలింగ్‌లో వైవిధ్యం కూడా పెద్దగా కనిపించకపోవడంతో విమర్శలు వచ్చాయి. దీనిపై మోర్కెల్ స్పందించాడు. 'అన్షుల్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. బయట నుంచి చూసి పరిస్థితిని అంచనా వేయడం కష్టం. రెండో రోజు తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో కూర్చుని చూస్తే.. దాదాపు రెండు మీటర్ల ఎత్తులో బౌలింగ్ చేస్తున్న బౌలర్‌కు వికెట్ కీపర్ స్టంప్స్‌కు దగ్గరగా నిలబడాల్సిన పరిస్థితి కనిపించింది. అది ఆందోళన కలిగించే విషయం. బౌలింగ్‌లో వేగం తగ్గిందనే విషయంలో అన్షుల్‌ను ప్రత్యేకంగా తప్పుబట్టడం అన్యాయం. అతడు జట్టుకు నియంత్రణ అందించాడు. జట్టు కోసం కష్టమైన ఓవర్లు బౌలింగ్ చేస్తున్నాడు. మనం అతడికి అండగా నిలవాలి. మ్యాచ్ ఆరంభంలోనే పిచ్ వేగాన్ని కోల్పోయింది. అందువల్ల బౌలర్ల వేగం కూడా తగ్గింది. టెస్టు క్రికెట్‌లో పిచ్‌లు ఫ్లాట్‌గా మారడం సహజమే. అయితే వాటి నుంచి బౌన్స్, వేగం పూర్తిగా తగ్గిపోకూడదు. కొత్త బంతితో వీలైనన్ని వికెట్లు తీయడానికి ప్రయత్నించాలి. కొన్ని సందర్భాల్లో ధైర్యంగా బౌలింగ్ చేయాల్సి ఉంటుంది' అని మోర్కెల్ వివరించాడు.

డబ్ల్యూటీసీ ఫైనల్ లక్ష్యంగా..

మహమ్మద్ సిరాజ్‌ను తొలి టెస్టు జట్టు నుంచి తప్పించడంపై కూడా మోర్కెల్ స్పందించాడు. 'సిరాజ్ బాగానే బౌలింగ్ చేస్తున్నాడు. అతడితో నేను మాట్లాడాను. కొంతకాలం వెనక్కి తగ్గి, మనం ఎక్కడ మెరుగుపడాలో పరిశీలించుకుందామని చెప్పాను. జట్టు ఎంపిక అనేది మన నియంత్రణలో ఉండదు. యువ పేసర్ గుర్నూర్ బ్రార్ కూడా తన ప్రదర్శనలతో జట్టులో చోటు కోసం గట్టి పోటీ ఇస్తున్నాడు. అవకాశం ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలి. అతడిని 100 శాతం ఫిట్‌గా, సిద్ధంగా ఉంచడం నా బాధ్యత. భారత ప్లేయర్లు అందరూ డబ్ల్యూటీసీ ఫైనల్ ఆడాలని కోరుకుంటున్నారు. గెలుపోటములను పట్టించుకోకుండా.. ఒక్కో సెషన్‌ను విడివిడిగా విశ్లేషించుకుని అత్యుత్తమ క్రికెట్ ఆడటంపై దృష్టి పెట్టాలి' అని మోర్కెల్ స్పష్టం చేశాడు.



వైభవ్ బ్యాట్‌లో ఎన్విడియా ఏఐ చిప్స్!

ఐస్‌లాండ్ క్రికెట్ ఫన్నీ పోస్ట్

దోహా: రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ టోర్నీలో యూఏఈ బౌలింగ్‌పై యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ విరుచుకుపడిన తీరుపై క్రికెట్ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. గ్రూప్-బి మ్యాచ్‌లో 53 బంతుల్లో 204 పరుగులతో అజేయంగా/విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడిన వైభవ్‌పై ఐస్‌ల్యాండ్ క్రికెట్ చేసిన సరదా పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అతడి బ్యాట్‌లో ఏఐ చిప్స్ ఉన్నాయేమోనని చమత్కరించడం నెటిజన్లను ఆకట్టుకుంటోంది. 'ఎన్విడియా' సీఈవోగా జెన్సన్ హువాంగ్ పునరాగమనం నేపథ్యంలో, వైభవ్ సూర్యవంశీ బ్యాట్‌లో ఏఐ చిప్స్ తిరిగిరావడం కాకతాళీయం కాకపోవచ్చంటూ సరదాగా వ్యాఖ్యానించింది. దీనిపై స్పందించిన నెటిజన్లు కూడా తమదైన శైలిలో కామెంట్లతో సందడి చేశారు. వైభవ్ బ్యాట్‌లో ఏఐ చిప్స్ ఉన్నాయంటూ కొందరు, అతడే ఏఐ అంటూ మరికొందరు సరదాగా బదులిచ్చారు.

గంగూలీ కితాబు: యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ ప్రతిభపై క్రికెట్ దిగ్గజాలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఈ వయసులోనే ఐపీఎల్‌లోనూ రాణించాడని, అతడికి ఉజ్వల భవిష్యత్తు ఉందని భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ కొనియాడారు. భారత్ తరపున లభించిన అవకాశాలను వైభవ్ సద్వినియోగం చేసుకున్నాడని, అతడిని ఎవరితోనూ పోల్చకుండా సొంతంగా ఎదగనివ్వాలని గంగూలీ సూచించారు.

సిరాజ్‌కు మరోసారి నిరాశేనా?



న్యూజిలాండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో టీమిండియా సీనియర్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు మరోసారి నిరాశ తప్పేలా లేదు. తొలి టెస్టుకు దూరమైన సిరాజ్.. రెండో టెస్టులోనూ తుది జట్టులో చోటు దక్కించుకోవడం అనుమానంగానే ఉంది. భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ చేసిన వ్యాఖ్యలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. సిరాజ్ ప్రపంచ స్థాయి బౌలర్ అని ప్రశంసించిన మోర్నీ మోర్కెల్.. జట్టులోకి పునరాగమనం చేయాలంటే తన ఆటను సమీక్షించుకుని, మెరుగుపడాల్సిన అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. దీంతో రెండో టెస్టులోనూ సిరాజ్‌కు అవకాశం దక్కే అవకాశాలు తక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. మరోవైపు రెండో టెస్టు కోసం భారత తుది జట్టులో ఒక మార్పు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. తొలి టెస్టులో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన ప్రసిద్ధ్ కృష్ణ స్థానంలో యువ పేసర్ గుర్నూర్ బ్రార్‌కు తుది జట్టులో అవకాశం దక్కే అవకాశం ఉందని సమాచారం.

చైతన్య రథం
సినిమా
శుక్రవారం 27 నవంబరు 2026

పాక్ కంటెంట్‌ను బ్లాక్ చేయండి

నెట్‌ఫ్లిక్స్‌కు కేంద్రం కీలక ఆదేశాలు



భారతదేశంలో పాకిస్థాన్‌కు చెందిన ఎలాంటి సినిమాలు,వెబ్ సిరీస్‌లు లేదా ఇతర డిజిటల్‌కంటెంట్ అందుబాటులో లేకుండా చర్యలుతీసుకోవాలని ప్రముఖ ఓటీటీదిగ్గజం నెట్‌ఫ్లిక్స్‌ను కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ ఆదేశించినట్టు తెలుస్తోంది. నెట్‌ఫ్లిక్స్ నిర్మించిన తొలి పాకిస్థానీ ఒరిజినల్ వెబ్ సిరీస్ 'జోబచే హైసంగ్ సమేట్‌లో' డిసెంబరు 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో చెలరేగిన వివాదం పై కేంద్రం తీవ్రంగా స్పందించింది. ఈ సిరీస్‌ను భారత్‌లో విడుదల చేసే అవకాశాలు ఉన్నాయంటూ పలు ఫిర్యాదులు, వినతిపత్రాలు అందిన వెంటనే మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగి నెట్‌ఫ్లిక్స్‌కు ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది.

జపాన్‌లో అఖిల్ 'లెనిన్' సందడి
డిసెంబరు 11న గ్రాండ్ రిలీజ్



అక్కినేని యువ హీరో అఖిల్ అభిమానులకు మేకర్స్ ఒక సర్‌ప్రైజ్ అప్‌డేట్ అందించారు. ఇప్పటికే ప్రేక్షకుల నుంచి మంచి అంచనాలు సొంతం చేసుకున్న 'లెనిన్' చిత్రాన్ని ఇప్పుడు జపాన్‌లో విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు.అన్నపూర్ణ స్టూడియోస్ ఈ విషయాన్ని వెల్లడిస్తూ.. 2026 డిసెంబర్ 11న జపాన్‌లో 'లెనిన్' సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందని ప్రకటించింది. ఈ సందర్భంగా జపాన్ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా ఓ గ్లింప్స్‌ను కూడా విడుదల చేశారు. అంతేకాకుండా సినిమా ప్రచారం, ఇతర వివరాల కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు.

దీంతో ఈ సినిమా జపాన్‌లో ఎలాంటి స్పందన అందుకుంటుందనే ఆసక్తి నెలకొంది. భారతీయ సినిమాలకు జపాన్‌లో మంచి ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో 'లెనిన్' కూడా అక్కడి ప్రేక్షకులను ఆకట్టుకుంటుందా అనేది చూడాలి. ముఖ్యంగా చిత్రబృందం జపాన్‌కు వెళ్లి ప్రమోషన్లు నిర్వహిస్తుందా? అక్కడ ప్రత్యేక కార్యక్రమాలు ప్లాన్ చేస్తుందా? అన్నది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ సినిమా విడుదలతో అఖిల్‌కు జపాన్‌లోనూ కొత్త మార్కెట్ ఏర్పడుతుందేమోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

అమిత్ షాను కలిసిన 'రామాయణ' చిత్ర బృందం
రణబీర్, సాయిపల్లవిపై ప్రశంసలు



భారతీయ ఇతిహాసం రామాయణం ఆధారంగా తెరకెక్కిన భారీపౌరాణిక చిత్రం 'రామాయణ' ప్రపంచవ్యాప్తంగా సంచలన విజయాన్ని అందుకుంటోంది. ఈ నేపథ్యంలో 'రామాయణ' చిత్ర యూనిట్ గురువారం న్యూఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో ప్రత్యేకంగా సమావేశమైంది.ఈ భేటీలో నిర్మాత నమిత్ మల్హోత్రా,దర్శకుడు నితేశ్‌తివారీ, హీరో రణబీర్ కపూర్, హీరోయిన్ సాయి పల్లవితో పాటు సహ నిర్మాత నీరజ్‌సంఘూయ్ పాల్గొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే రామాయణ ఇతి హాసాన్ని అంతర్జాతీయ స్థాయిలో వెండితెరపై ఆవిష్కరించినందుకు చిత్ర బృందాన్ని అమిత్ షా అభినందించినట్టు తెలుస్తోంది.

నంది అవార్డులపై కదలిక
జ్యూరీ కమిటీల నియామకం... వచ్చే నెలలో ప్రదానం



అమరావతి:ఏళ్ల తరబడి పెండింగులో ఉన్న ప్రతిష్ఠాత్మక నంది అవార్డుల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. తెలుగు చలనచిత్ర, టెలివిజన్, నాటక రంగాలకు సంబంధించి 2017నుంచి 2025 వరకు పెండింగులో ఉన్న నంది అవార్డులతోపాటు జాతీయ చలనచిత్ర పురస్కారాల ఎంపికకు వేర్వేరు జ్యూరీ కమిటీలను నియమిస్తూ సాధారణ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ గురువారంఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే నెలలో విజయవాడ లేదా అమరావతి వేదికగా చలనచిత్ర, జాతీయ పురస్కార ప్రదానోత్సవాలను, తిరుపతిలో టీవీ అవార్డులవేడుకను ఘనంగానిర్వహించాలని ప్రభుత్వంనిర్ణయించింది.వీటి నిర్వహణకు రూ. 15.28కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు మంజూరయ్యాయి.

ఎన్టీఆర్ జాతీయ అవార్డు, రఘుపతి వెంకయ్య, బీఎన్ రెడ్డి, నాగిరెడ్డి-చక్రపాణి వంటి ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారాల ఎంపిక కమిటీలకు ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను ప్రభుత్వం చైర్మన్‌గా నియమించింది.

2025 జాతీయ అవార్డుల కమిటీ: బాలకృష్ణ చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో ప్రముఖనిర్మాత అల్లు అరవింద్, ఛాయాగ్రాహకుడు ఎస్.గోపాల్‌రెడ్డి, సీనియర్ నటి ప్రభ సభ్యులుగా నియమితులయ్యారు.

2017-2024 జాతీయ అవార్డుల కమిటీ: ఈఎనిమిదేళ్ల పురస్కారాల ఎంపిక కమిటీకి కూడా బాలకృష్ణనే చైర్మన్‌గా నియమించగా...ఇందులో వరప్రసాద్‌రెడ్డి, గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ,కైకాల నాగేశ్వరరావు సభ్యులుగా ఉంటారు. ఈ రెండు కమిటీల్లోనూ ఏపీ స్టేట్ ఫిలిం,టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సభ్య కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

నంది చలనచిత్ర, టీవీ అవార్డుల కమిటీ చైర్మన్లు వీరే:

2025 నంది చలనచిత్ర అవార్డులు: ప్రముఖ దర్శకుడు బి.గోపాల్ (కథా చిత్రాలు, జాతీయ సమైక్యత, బాలల చిత్రాలు), టి.ప్రసన్నకుమార్ (డాక్యుమెంటరీ, విద్యావిషయక చిత్రాలు), పరుచూరి గోపాలకృష్ణ (ఉత్తమ సినీ గ్రంథం, విమర్శకులు).

2017-2024 చలనచిత్ర అవార్డులు: ఎన్.సీతారామరాజు (2017, 2018), దర్శకుడు ఎ.కోదండరామిరెడ్డి (2019, 2020),ఎడిటర్ కోటగిరి వెంకటేశ్వరరావు (2021, 2022), దర్శకుడు రేలంగి నరసింహారావు (2023, 2024).

టీవీ అవార్డుల కమిటీలు: శింగంపల్లి శ్రుతి(2017-2020), యేటా సత్య నారాయణ (2021-2024), కొమ్మనపల్లి గణపతిరావు (2025).

60 ఏళ్ల ప్రత్యేక సావనీర్ కమిటీ: నంది అవార్డుల ప్రస్థానానికి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రచురించే స్మారక సంచిక కమిటీకి సీనియర్ సినీ పాత్రికేయుడు రెంటాల జయదేవ చైర్మన్‌గా నియమితులయ్యారు.

బాహుబలి కాంబో... మళ్లీ రిపీట్
2028 తర్వాత రాజమౌళి భారీ ప్లాన్

భారతీయ సినీ చరిత్రలోనే సరికొత్త అధ్యాయాన్ని లిఖించిన క్రేజీ కాంబినేషన్ రెబల్ స్టార్ ప్రభాస్, దర్శకధీరుడు ఎస్ఎస్. రాజమౌళి. వీరిద్దరి కలయికలో వచ్చిన 'ఛత్రపతి' మాస్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా 'బాహుబలి' సిరీస్ మాత్రం తెలుగు సినిమా స్థాయిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పింది. ఈ రెండు సినిమాలతో ప్రభాస్‌ను పాన్ ఇండియా స్టార్‌గా నిలబెట్టిన రాజమౌళి, భారతీయ సినిమా మార్కెట్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. ఇప్పుడు మరోసారి ఈ ఇద్దరూ కలిసి పనిచేయబోతున్నారనే వార్త సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

ప్రస్తుతం సూపర్‌స్టార్ మహేశ్‌బాబుతో రాజమౌళి తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి'పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా షూటింగ్ పూర్తయిందని, ప్రస్తుతం విజువల్ ఎఫెక్ట్స్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని సమాచారం. ఈ ప్రాజెక్ట్ తర్వాత రాజమౌళి ఎవరితో సినిమా చేయబోతున్నారనే ప్రశ్నకు సమాధానంగా ప్రభాస్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. 'వారణాసి' తర్వాత మరోసారి డార్లింగ్‌తో జక్కన్న సినిమా చేయబోతున్నారనే ప్రచారం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

రాజమౌళి సినిమా అంటేనే ప్రేక్షకుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతాయి. ఆయన ప్రతి చిత్రాన్నీ గత సినిమాల కంటే మరింత భారీ స్థాయిలో తెరకెక్కించేందుకు ప్రయత్నిస్తుంటారు. ముఖ్యంగా ప్రభాస్‌తో ఆయనకు ఉన్న అనుబంధం, గతంలో వీరిద్దరూ కలిసి సృష్టించిన రికార్డులు మరోసారి ఈ కాంబినేషన్‌పై ఆసక్తి పెంచుతున్నాయి.

